# అక్కన్న మాదన్నల చరిత్ర

సం॥ తెనుఁగుభాషాసమితివారి బహుమతినందినది.)

రచయిత: వేదము వేంకటరాయశాస్త్రి, *M. A.*

వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్

స్వామిగుడిసందు, లింగిసెట్టివీథి,

జి. టి. మదరాసు.

1962

# అక్కన్న మాదన్నల చరిత్ర

1951 సం॥ తెనుఁగుభాషాసమితివారి బహుమతినందినది.

రచయిత: వేదము వేంకటరాయశాస్త్రి, *M. A.*

ద్వితీయ ముద్రణము.

[చంద్రికాముద్రణాలయము, చాకలపేట]

వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్

4, మల్లికేశ్వరస్వామిగుడిసందు, లింగిసెట్టివీథి,

జి. టి. మదరాసు.

1962

*All Rights Reserved.*



అబుల్ హసన్ తానాషా

[హావార్ట్. ను డచ్చిరచయిత గ్రంథమునుండి.]

# అవతారిక

ఈయాంధ్రమంత్రులంగూర్చి యెవరును విపులముగా వ్రాయలేదు. అందులకై ప్రారంభింపఁగా నాకు వీరిచరిత్ర ఒక యాకరమున దొరకలేదు. సర్కారు పండితుఁడు రచించిన యౌరంగజేబు చరిత్రమున అచ్చటచ్చట కొంతగలదు. అతఁడు సయితము ప్రాచీన దాక్షిణాత్యచరిత్రకారుల గ్రంథములను పరిశీలించినట్లు లేదు. ఈభావమునే వెల్లడించుచు, తానాషా, అక్కన్న మాదన్నలలో ఎట్టిదోషమును లేదనియు ఔరంగజేబు సామ్రాజ్యకాంక్షచే వారిపై అసత్యము నారోపించెననియు ప్రొఫెసర్ అబ్దుల్ మజీద్ సిద్దికిగారు ఒకవ్యాసమును ఆంగ్లమున రచించియున్నారు. [హైదరాబాద్ ఎకాడెమీ జర్నల్] భారతేతిహాస పరిశోధకమండలి, పూనా, వారు ప్రకటించిన 'గోల్కొండ్యాచీ కుతుబ్‌శాహీ' గ్రంథమున, మెకంజీదొర వారి స్థానికచరిత్రలనుండి కొంతయు, 'హదికత్-ఉల్-అలామ్' అను గ్రంథమునుండి కొన్ని ప్రకరణములును కలవు. మదరాసు విశ్వవిద్యాలయ సంస్కృతాచార్యులు శ్రీ డాక్టరు రాఘవన్ గారు, డాక్టరు సి. కున్‌హన్‌రాజాగారికి మిత్రులు సమర్పించిన సంపుటములో తానాషా గురువు బడే అక్బర్ షా శృంగారమంజరినిగురించి యొకవ్యాసము వ్రాయుచు తానాషానుగురించి వ్రాసియున్నారు. ఇటీవల శృంగారమంజరినే ప్రకటించినారు.

డచ్చిరచయిత హావార్టు వీరింగూర్చి వ్రాసియున్నాఁడు. వీరు మొదట 1666 లో సయ్యద్ ముస్తఫా (తర్వాతి మీర్




అక్కన్న పంతులుగారు

జుష్లూ) అనువానికడ గుమాస్తాలుగా 10 గిల్డర్సు జీతమున ప్రవే
శించిరి. వీరిలో మాదన్న ఉపాయశాలి, అక్కన్న కొంతతొందర
పడువాఁడు. వీరివలననే మీార్ జుష్లూ గోలకొండను వదలెను.
తరా[illegible] [illegible]రావు' బిరుదముతో సర్వా
ధికారమును [illegible] సుల్తాను అంతటిని ఆతనిపై



మాదన్న పంతులుగారు

వదలి తానుమాత్రము 75000 డాలరులు గ్రహించి ఆనందించుచుండెనఁట. మాదన్న పర్షియను హిందూస్థానీలలో పండితుఁడఁట. ఆతని బంగారుపల్లకీ పోవుచుండఁగా వీథులలో నెల్లవారును లేచి నిలిచి గౌరవించుచుండిరఁట. డచ్చివారిని చాలమర్యాదగా మాదన్న చూచి హవార్టుకు దర్శనము సైతమొసంగెనఁట.



మంత్రుల దుర్వర్తనము

ఇట్లు ఎంతేనియు సామగ్రి కలదు. చర్చించి వ్రాయుటకు చాలకాలము పట్టును గాన ప్రస్తుతము దొరకిన విషయములనే సామాన్య పాఠకలోకముకొఱకు నవలవలె ఈ వచనగ్రంథమును 1949 లో రచించితిని. ఇందు కొంత సంగ్రహించితిని.

15-5-1962.

వేదము వేంకటరాయశాస్త్రి.

# విషయసూచిక


| ప్రకరణము | విషయము | పుట |
|---|---|---|
| ౧ | దండోరా | 1 |
| ౨ | తానాషా దర్బారు | 5 |
| ౩ | తానాషా పూర్వచరిత్ర | 14 |
| ౪ | అక్కన్న మాదన్నల స్వప్నములు | 21 |
| ౫ | ఉపాయసిద్ధి | 24 |
| ౬ | మాదన్న పరిపాలనాప్రారంభము | 28 |
| ౭ | శివాజీ | 32 |
| ౮ | శివాజీ గోలకొండ ప్రయాణము | 39 |
| ౯ | శివాజీ తానాషాను దర్శించుట | 42 |
| ౧౦ | ఆశాభంగము | 49 |
| ౧౧ | పాదుషా ప్రయత్నములు | 56 |
| ౧౨ | మొగలాయీలతో ఘర్షణ | 63 |
| ౧౩ | కుట్రలు, కుయుక్తులు | 67 |
| ౧౪ | మాదన్న మీఁద రెండవకుట్ర | 73 |
| ౧౫ | పాదుషాతో రాయబారము | 77 |
| ౧౬ | రామదాసు చరిత్రము | 80 |
| ౧౭ | మంత్రుల దుర్మరణము | 83 |
| ౧౮ | బిజాపూరు ముట్టడి | 91 |

| ప్రకరణము | విషయము | పుట |
|---|---|---|
| ౧౯ | గోలకొండముట్టడి ప్రారంభము | 95 |
| ౨౦ | క్షామము | 100 |
| ౨౧ | మరల ముట్టడి ప్రయత్నములు | 104 |
| ౨౨ | అబ్దుల్ రజాక్ లారీ కడపటి యుద్ధము | 113 |
| ౨౩ | తానాషా కడపటివిందు | 116 |
| ౨౪ | అబ్దుల్ రజాక్ లారీ బ్రదుకుట | 121 |
| ౨౫ | తానాషా కడపటి మాటలు | 125 |


ఇందలి చిత్రపటములను ప్రకటించుట కనుమతించిన ప్రభుత్వమువారికి మాకృతజ్ఞతలు.

# అక్కన్న మాదన్నల చరిత్ర

## ప్రకరణము ౧ - దండోరా

"హిందువుగాని మహమ్మదీయుఁడుగాని, ఎవఁడైనను ఈ కాగితమును చదివి ఇందులోని విషయమును విశదీకరించు వానికి అబుల్ హసన్ తానాషాసుల్తాన్ బహద్దరువారు గొప్ప యుద్యోగమిచ్చి చాలగౌరవము చేయఁగలరు. ఎవరైనను చదువఁగలిగినవారు వచ్చి చదువవచ్చును." అని గోలకొండ పట్టణము వీథులలో నొకదినము దండోరా వినవచ్చుచుండెను. వెట్టివాఁడొకఁడు డప్పువాయించు చుండఁగా, తెల్లని, అక్షరములు కనఁబడని, కాగితమును చూపుచు నతనివెంట రాజభటులును వారితో నొక యుద్యోగస్థుఁడును పోవుచుండిరి. ఆ కాగితమును చూచి అదేదోహాస్యమని కొందఱు నవ్వుచుండిరి. కొందఱు అందేమో వాస్తవముగా విశేషము కలదని చూచుచుండిరి. వీథులలో నిదియొక వేడుకగానుండెను.

ఈతెల్లని కాగితము ఔరంగజేబుపాదుషా గోలకొండ సుల్తానునకుపంపిన 'ఇనయత్ నామా' అనఁగా కుశలప్రశ్నలు వేయుజాబు. పాదుషాయొక్క రాయబారి అంతకు మూఁడు నెలలక్రింద దానిని తెచ్చి గోలకొండసుల్తానైన తానీషా (తానాషా) గారికిచ్చి జవాబుకోరియుండెను. అది అక్షరములు లేని తెల్లని కాగితము. ఐనను చదువుఁడని తానాషా తన వజీ

ర్లను ఉద్యోగులను అందఱను అడిగెను. ఎవరును చదువలేక పోయిరి. కాని అది వట్టి కాగితమని ఎవరును సాహసించి చెప్ప లేకపోయిరి. దర్బారులో నెవరును చదువలేక పోఁగా సుల్తాను ఊరిలో నెవరైన చదువఁగలరా విచారింపుమని కొత్వాలును నియమించెను. ఎవరును కనఁబడలేదు. తుదకు ఇంటింటి కడను డప్పువాయించుచు చౌబుదారులనఁబడు బంట్రోతులు గోలకొం డలోని పంద్రెండు పెద్దవీథులలో తుడుము కొట్టసాగిరి. మూఁడు నెలలుగా తాసా వాయించుచుండినను ఎవరును ముందునకు రాలేదు. వాడుక ప్రకారము వారు ప్రతిదినమును వాయించుచునే యుండిరి. అదియే నాటి దండోరా.

దండోరా ఒక గొప్ప భవనము కడకువచ్చి నిలిచినది. ఆయింటి యజమాని సయ్యదుముజఫరు అను సేనాపతి. దండో రా వినఁగానే ఆయింటినుండి యొకఁడు ఆ చౌబుదారుల నాయ కుని లోపలికి పిలిచెను. నాయకుని జమాదారని అందురు. జమా దారు లోన వరాండాలో ప్రవేశింపఁగానే అచ్చటి తిన్నెల మీఁద కూర్చుండి లెక్కలు వ్రాయుచుండిన ఇరువురు బ్రాహ్మణ యువకులు నౌకరుమూలముగా నాకాగితమును అందుకొనిరి. ఒకరుమార్చి ఒకరు దానిని చూచి తమలో తామేదోచెప్పుకొని వెంటనే తమయజమానుని కడకు పోయిరి.

యువకులు — సలాం దివాన్‌బహద్దర్ గారికి. ఈ కాగి తమును మేము చదువఁగలము

వారి యజమాని ముజఫరు సేనాపతి ఆశ్చర్యపడెను. 'మూఁడు నెలల నుండియు ఈజాబును ఎవరును ఈ గోలకొండలో చదువలేక వీరు దండోరా వాయించుచు తిరుగుచున్నారు గదా, మీరు ఇంత చిన్నవారుగా నున్నారు, నిన్న గాక మొన్న నౌకరిలో చేరినారు, అప్పుడే ఇటువంటి జాబు చదువఁగలమని చెప్పుచున్నారు, అటువంటి జ్ఞానమున్నదా మీకు, ఆశ్చర్యముగా నున్నదే!' అని.

యువకులు — సాహేబ్, తమ యనుగ్రహ ముండిన ఇంకను ఎన్నేనియు చేయఁగలము. నియోగులము. మాది ఓరుగల్లు. మాతండ్రిగారు మాకు ఎన్నియో విద్యలు నేర్పినారు. మామాతృభాషలగు సంస్కృతాంధ్రములే గాక అరబ్బీ ఫారసీభాషలను నానావిధములైన లిపులను నేర్పినారు. మన భారతదేశములో ఒక్కొక్కరును నాలుగైదు భాషలు నేర్చుకొన్నగాని రాజకీయోద్యోగములు దొరకవుగదా. తర్వాత, దర్బారులో ఎవరికిని సాధ్యముగాని లెక్కలన్నియు మేము తయారు చేయఁగలము. ఎటువంటి అసాధ్యమైన రాచకార్యమైనను తమవంటి ప్రభువులు దయదలఁచిన క్షణములో సాధింపగలము.

ముజఫరు — అచ్ఛా, చాలసంతోషము. మీరు తెలుఁగువారు, నియోగులు, చాల బుద్ధిమంతులు. మీకు ఇంతటి సామర్థ్యము తల్లికడుపు నుండియే వచ్చును కాఁబోలు. మంచిది మఱి ఆజాబు చదువుఁడు, వినోదము చూతము.

యువకులు — ఇది చాల రహస్యమైన విషయము. సుల్తానువారి సన్నిధిలో చదువవలసినది.

సేనాపతికి ఈజవాబు కొంత యతృప్తిని కలిగించినది. అతఁడొక క్షణము ఆలోచించి 'అట్లైన మనము రేపు సుల్తానువారి దర్శనమునకు పోదము. ఈ దినము మనకు ఇచ్చట తొందరపని యున్నది గదా' అని యనెను.

ఆ యువకులకు ముజఫరు మాటలలో ఏదో సందేహము తోఁచినది. వారు ఒకరి నొకరు చూచుకొనిరి. ఆచూపులలోనే వారి యభిప్రాయము 'ఈ మహానుభావుఁడేదో అడ్డు దారి తీయుచున్నాఁడే! ఈతని కపటమే మనమీఁద అసూయ జనించినది.' అనున ట్లుండెను. ఆ యువకులు పైయెత్తు ఎత్తిరి. 'సర్దారు చిత్తము. మరి దండోరావారు ఈ విషయము సుల్తానువారికి నివేదించిన వా రేమనుకొందురోగదా? అని దండోరా జమాదారును కనుగిలెను.

జమాదారు — సర్దార్ సాహేబ్, సుల్తానువారి పని కన్న మనకు వేఱుపని యేమి ముఖ్యము. సుల్తానువారికి ఈ సంతోషవార్త మొదట నివేదించి తర్వాత మనపని చూచుకొనుట మంచిది. ఈ యాలస్యమునకు వారు సహింపలేరు సాహేబ్.

ముజఫరు ఆలోచించెను—'ఈజమాదారు వదలఁడు. ఈ తెలుఁగు యువకులు అసాధ్యులుగా నున్నారు. ఏమిగతి? కానీ చూతము గాక.' అని, వారితో నిట్లనెను — "ఓహో! ఆలా

గా. అచ్ఛా, అచ్ఛా. అట్లయిన మనము సుల్తానువారి దర్శనమునకే ముందుపోదము. దండోరా జమాదార్, నీవు ముందుగా పోయి సుల్తానువారికి మా సలాములు చెప్పి, 'పాదుషావారు పంపిన జాబు చదువఁగల గుమాస్తాలు, ఇరువురు బ్రాహ్మణయువకులు ఓరుగంటి నుండి వచ్చియున్నారు. మా కొలువులో నున్నారు. వారిని మేమే సుల్తానువారి దర్శనమునకు తెచ్చుచున్నాము' అని మనవి చేయుము. మేము, ఇదుగో ఇప్పుడే వచ్చుచున్నాము."

వెంటనే ఊరంతయు పుఖారేర్పడెను. చాల నేర్పరులైన గుమాస్తాలు ముజఫరుసాహెబువద్ద చేరియున్నారని అందఱును చెప్పుకొనసాగిరి. కబురందఁగానే సుల్తాను వెంటనే ఆయువకులను తోడితెమ్మని పరుగుబంట్రౌతును పంపెను. ఇఁక తప్పదని అక్కన్నమాదన్నలను వెంటబెట్టుకొని ముజఫరు దర్బారునకు పోయెను.

---

## ప్రకరణము ౨ - తానాషా దర్బారు

గోలకొండ గొప్పపర్వతదుర్గము. కొండకు క్రింద మొదటి దర్వాజాకడనుండు తిన్నెలకడ దాదాపు తొంబదిలేక వంద యడుగుల యెత్తు గోడలమీఁద గండభేరుండపక్షులు చిత్రితములై యున్నవి. నేఁడును యాత్రికులు చూడవచ్చును. దర్వాజాకు ఆనుకొనియుండు తిన్నెలపై కూర్చుండి మాటలాడిన యెడల ఆశబ్దము పైకిపోయి కొన్నినిముసములు

ప్రతిధ్వనించుచుండును. సింహద్వారము దాటగానే కొండ యడివారము మొదట మఱియొక దర్వాజా కలదు. దానికి ముందు పెద్దమంటపము; అందు కిటికీలు లేవు గాని లోన వెలుతురు కలదు. అటనుండి మెట్లెక్కి పోవలయును. ఆకొండ యంతయు దుర్గాకృతిని రహస్యగృహముల చేతను వానికి వలసిన నీటి సదుపాయముల చేతను అమర్పఁబడి నేటికిని చూపరుల కాశ్చర్యము కలిగించుచున్నది. ఏచోటినుండి ఏచోటికి పోవుటకు ఎచ్చటెచ్చట రహస్యమార్గము కలదో కోటఁడి రక్షకులకు మాత్రమే తెలియును. నాలుగైదు అంతస్థులు దాఁటిన యనంతరము తానీషామందిరము కొండ నెత్తమున నున్నది. అచ్చట స్థలము కొంతవిశాలము. ఆమందిరమున నడుమ పెద్ద కొలువు మంటపమును, దాని కిరువైపుల రెండు గదులు, దీని కెక్కుటకు ముందఃభాగమున రెండువైపుల ఎదురెదురుగా పదిమెట్లు మంటపమధ్యభాగమున కలసి సింహాసనమున కెదురుగానుండును. దీనికిపైన మరియొక మంటపము, దానికిపైన ఇరుకుమెట్లచే పోదగినది బోడిమేడ. అచ్చట మెట్లకుపైన నొక యెత్తునివేశమును దానిపై సుల్తాను కూర్చుండుటకుస్థలమును ఏర్పరుపఁబడియున్నవి. అచ్చట సుల్తాను కూర్చుండినయెడల గోలకొండ దుర్గమంతయు నాతనికి కనఁబడుటయేగాక చుట్టువైపుల పదిమైళ్ల దూరము వఱకు కనఁబడును. ఆ దృశ్యము చూచుటకు నేఁడే ఎంతో ఆనందకరముగా నుండఁగా నాఁడు సజీవమై యుండినప్పుడు చూచినవారిదే భాగ్యము.

నాఁడు తానాషాసుల్తాను మొదటి మంటపముననే దర్బారు తీరియుండెను. అమీరులు, వజీరులు, ఉమ్రాలు, ఫౌజు దార్లు, వారివారి పరివారము, తెలుఁగుదొరలు, జోదులు, విదేశీయులు, ఎల్లవారును వారివారి స్థలములలో కూర్చుండియు నిలువఁబడియు నుండిరి. సిపాయీలు దర్వాజాలకడ విచ్చు కత్తులతోను ఈఁటెలతోను జాగరూకులై, వచ్చుచు పోవుచు నున్నవారిని నిదానించి చూచుచుండిరి. దర్బారులో సుల్తాను ప్రక్క మొగలాయీపాదుషా ఔరంగజేబు పంపిన రాయ బారి కూర్చుండి యుండెను.

మొగలాయి రాయబారి ఇట్లు మాటలాడు చుం డెను. — 'తానాషాసుల్తాన్‌బహద్దరుగారు, మా యేలినవారు ఔరంగజేబు అలంఘీరు పాదుషావారు మమ్ము గోలకొండకు పంపి కొన్ని నెల లైనవి గదా. మేము తెచ్చినజాబును ఇప్ప టికి ఎవరును చదువలేదు గదా. దర్బారులోనే లేనప్పుడు దూరపు పరగణాలలోను గ్రామములలోను ఎవరుండఁగలరు? మాకు సెల విప్పించిన మేము మరలి పోయి పాదుషావారికి ఈవిషయమును నివేదింపఁగలము — గోలకొండలో ఇట్టి జాబులు చదువఁగలవారు గాని వ్రాయఁగలవారు గాని లేరని.'

తానాషా — (ప్రశాంతముగా) రాయబారిభాయిగారు, తొందరపడ వలదు. మా దేశము పెద్దది. చాల దూరము వ్యాపించి యున్నది. అందువలన చక్కని ముసద్దీలను దూర

ములలోనుండువారిని కనిపట్టుటకు కాలము పట్టుచున్నది. దొరకకపోరు; మేధావులున్నారు.

సభలో సుల్తానునకు చెంతనేయుండిన యొక ముసలి వజీరు అబ్దుల్ రజాక్ లారీ యనునతఁడు ఇట్లనెను. 'సుల్తాన్బహద్దర్, మనకు కొంత నెమ్మది కావలెను. మనయీ యాంధ్ర దేశము, సుల్తానువారు సెలవిచ్చినట్లుగా, చాల విస్తీర్ణమైనది. శ్రీకాకుళము మొదలు పుదుచ్చేరి వఱకు మూల మూలలకు, అన్ని తాణాలకు, మనుష్యులు పోయియున్నారు. తెలంగాణములో నిత్యము దండోరా వేయుచున్నాము. ఈదేశములో హిందువులు మహమ్మదీయులు అందఱును బుద్ధిమంతులు. ఎవరో దొరకకపోరు.'

ఇట్లు వీరు మాటలాడుచుండఁగానే పహరాజవాను వచ్చి మోకాళ్లమీఁద నిలిచి ఖుర్నీషుసలాములు చేసి, ముజఫరుసేనాపతిగారును వారితో ఆజాబును చదువగల వారిగుమాస్తాలును వచ్చియున్నారని నివేదించును. సుల్తానువారి యుత్తరువైనంతనే ప్రభువు కొలువునకు, ముజఫరుముందు నడచుచుండ ఆయాంధ్రయువకులు వెంటనంటి పోయిరి. కొలువు కూటము చేరినంతనే అందఱి చూపులును ఆయువకుల మీఁదనే పడినవి. వీరేదో యాశ్చర్యకరమైన పని చేయఁబోవుచున్నారని సభ్యులును పరివారమును తలంచుచుండిరి.

ఆయువకుల వేషము చాల వినీతముగా నుండెను. —దోవతియు, పొడుగుచొక్కాయయు పైన సన్నని యంగవస్త్ర

మును నెత్తిన తిలక్ టోపీవంటి టోపియు, మొగమున గీరు నామములును, వారు దూరమునుండియే మోకాళ్లపై నిల్చి సుల్తానునకు సలాములు చేసిరి. ముజఫరు సలాముచేసి, 'జగద్రక్షకా, వీరే ఆ తెలంగీ పంతుళ్లు' అని విన్నవించెను. సుల్తానునకు వారినిచూడఁగనే ఏదో చెప్పరాని యానంద మేర్పడిన ట్లుండెను; వారిని చెంతకు పిలిచెను. చూపులోనే భావము గ్రహించిన ఆసోదరులు సింహాసనము చెంతకు పోయి నిలిచిరి. మరల సలాములు చేసి వినమ్రులై నిలువఁబడిరి.

తానాషాసుల్తాను వారిని నిదానించి చూచి ఇట్లనెను— 'మీసామర్థ్యమును గుఱించి మేము ఇప్పుడే విన్నాము. ఇంత చదివినవారు మాదర్బారులో ఉండవలెను. మంచిది. ఎవరురా, ఆ ఇనయత్ నామా తెండి.' అని పాదుషా పంపిన జాబును తెమ్మనెను. ఇంతలో తానాషా వారిని 'మీ పేరేమి?' అని యడిగెను.

యువకులు — మహాప్రభూ, క్షమింపవలెను. మాహిందువుల యాచారము, ఎవరును తమపేరు తామే చెప్పకొనరాదు.

తానాషా — సెబాష్. అది మీసంప్రదాయము.

ముజఫరు — ఈయన అక్కన్న పంతులుగారు, ఈయన మాదన్న పంతులుగారు.

తానాషా — అచ్ఛా చాలసంతోషము. అన్నదమ్ములు ఒక్కపోలికగా ఉన్నారు.

అక్కన్న — మహాప్రభువులవారి యనుగ్రహము కలుగుట భగవంతుని యనుగ్రహము కలుగుటయే. ఏలినవారి దర్శనమైన సంతోషములో మాకు నోట మాటలుకూడ సరిగ వచ్చుట లేదు ప్రభూ.

మాదన్న — జగద్రక్షకా, తమయనుగ్రహము కలిగిన నేఁడే మాజన్మమునకు మంచిరోజు. ఏలినవారికి ప్రియముగా నౌకరిచేసి మా రక్తమాంసములు గోలకొండకును ఈయాంధ్ర సామ్రాజ్యమునకును ధారపోయుటకు సిద్ధముగా నున్నాము. ఏదినము అట్టి సందర్భముకలుగునో నాఁడే మాజన్మము పావనము అగును. మావలన పనిగొనుము మహాప్రభూ.'

అబ్దుల్‌రజాక్‌లారీ — అచ్ఛా, అచ్ఛా. చక్కఁగా చెప్పినారు మాదన్నపంతులుగారు. ఈగోలకొండకు మీరు రక్తమాంసములు ధారపోయుదురేని మేము మాప్రాణమును శరీరమును అర్పింపఁగలము. అల్లాకటాక్షము చక్కఁగా నుండు నెడల ఇటువంటిరాజభక్తియు దేశభక్తియు గల రాజ్యమును ఆ రావణాసురుఁడు కూడ పట్టలేఁడు. మీవంటివారు మాకు అవశ్యముగా స్నేహితులుగా నుండవలెను.

తానాషా — అచ్ఛా, అచ్ఛా. మనకు అందఱును స్నేహితులే. అందఱును అన్నలును తమ్ములును. మాదికూడ సామాన్యప్రాణమే. భగవంతుని వేడుక కొఱకు మేము ఇచ్చట సంహాసనముపై నున్నాము. ఈప్రపంచమంతయు ఒక ఆశ్చర్యము, సందేహము, మోసము, తమాషా, గమ్మత్తు. మన

మెందులకు పుట్టితిమో, ఏమికానున్నామో, ఎక్కడికిపోఁగలమో, ఎప్పుడుపోఁగలమో, ఎట్లుపోఁగలమో, ప్రాణమేమి, ఆత్మయేమి — ఏమియు తెలియదు. ఇదంతయు తెలిసినట్లు కొందఱు అభినయము చేయుచుందురు. అదియొక టక్కు. అందుచేత మనము ప్రాణముతోనుండు నీనాలుగు దినములును సంతోషముగా నుందము. 'భాయిభాయి'గా సోదరస్నేహము నెఱపుకొందము. ఎవరికిని కష్టముండరాదు. సాధ్యమైనయెడల నలువురకు ఉపకారము చేయుదము. ఎవరికాలము వచ్చినప్పుడు వారు పోఁగలరు. మీఋషులు చెప్పునది అదే. మాసూఫీల వేదాంతమును అదే.

అక్కన్నమాదన్నలు ఆశ్చర్యపడిరి. 'తాము గొప్ప వేదాంతి మహాప్రభూ' అని పలికిరి. ఈసంభాషణయంతయు ముజఫరునకు (అతని తోడివజీరును మహద్దారు ఉద్యోగియునైన మూసాఖానునకును ప్రియముగా నుండలేదు. వారు, 'నౌకరు లింకను ఆ ఇనయత్ నామాను తేలేదే' యని వేదనపడుచుండిరి. పాదుషావారి రాయబారి, తానాషా వాక్యములలో ఔరంగజేబుపై దూషణ ఏమైనను ధ్వనించుచున్నదా యని ఆలోచించుచుండెను. ఇంతలో నౌకరులు ఆజాబును తెచ్చిరి. ముజఫరు దాని నందుకొని సుల్తానుముందు నిలువఁబడెను.

తానాషా — దయచేసి చదువుఁడు

మాదన్న ఆ తెల్లని కాగితమును గ్రహించి, 'మహాప్రభూ ఇందలి విషయములు చాల రహస్యములు. తమకు మాత్రమే తెలియవలెను.' అనెను.

తానాషా — అచ్ఛా, అటులైన మా 'కులయత్ ఖానా' కు పోదము.' అని లేచెను. కులయత్ ఖానా యనఁగా నాంతరంగిక గృహము. సుల్తాను అక్కన్నమాదన్నలు అంగరక్షకులును మాత్రమే మేడమీఁదికి పోయిరి. ముజఫరునకు నెత్తిన పిడుగు పడినట్లు ఆయెను. తన గుమాస్తాలేమి సుల్తానుతో అంతరంగిక గృహమున ముచ్చటించుటయేమి! ఈయువకులకు జరుగు ఈమర్యాదయంతయు నాతనికి కనుకుట్టుగా నుండెను. తనకుకూడ వెంటపోవలయునని కోరిక యున్నదిగాని సుల్తాను యొక్క ఆజ్ఞలేనిదే పోరాదు. ఈయావేగమునకు కారణము ముస్ముందు తెలియును.

కులయత్ ఖానాలో ప్రవేశించిన వెంటనే మాదన్న — 'జగత్ప్రభూ తమకొక వేడుక చూపెదము' అని, నౌకరును చూచి 'ఒక గళాసునీరు' అనెను. నీరురాఁగా ఆకాగితముపై చల్లెను. వెంటనే నల్లనియక్షరములు కనఁబడసాగినవి.

తానాషా — ఏమి యాశ్చర్యము! అక్షరములున్నవి, కనఁబడుచున్నవి.

మాదన్న — వట్టి క్షేమసమాచారము. ప్రభూ ఇది తెల్లసిరావ్రాఁత, అందుచేత తెలియలేదు. దీని రహస్యము మాతండ్రిగారు మాకు చిన్నప్పుడే బోధించినారు. ఆలంఘీరు పాదుషా దీనిని పంపుటలో గోలకొండ దర్బారులో ఎటువంటివా రున్నారని పరీక్షించు నట్లున్నది. మహాప్రభూ మన రాష్ట్రమునకు వారివలన ఉపద్రవము ఎన్నటికైన తప్పదు, బిజా

పూరుమీఁద మొగలాయీలు బలముగ యుద్ధసన్నాహములు చేయుచున్నారు. బిజాపూరు పడిపోయిన మనవంతు తప్పదు. చాల జాగ్రత్త వహింపవలయును.

తానాషా — ఔను. మీమాట నిజమే. ఔరంగజేబు మనయాంధ్రదేశమును మ్రింగవలయునని యున్నాఁడు. మా సర్దారులు బుద్ధిలేక తమలో తాము జగడ మాడుచున్నారు. కానిండు ఆలోచింతము.

మాదన్న — మహాప్రభువు గారితో పదిమాటలేల ? మేము తమ చిత్తమునకువచ్చునట్టి నౌకరులము.

తానాషా — అచ్ఛా. అదే మాకు కావలెను. ముందు ఆలోచింతము. ఇప్పుడు ఈజాబునకు బదులుజాబు తయారు చేయుఁడు.

మాదన్న వెంటనే తన చొక్కా జేబునుండి ఏదోపొడి తీసి నీటిలోరంగరించి ఆసిరాతో మఱియొక కాగితముపై వ్రాసి పాదుషాకు జవాబు తయారుచేసి సుల్తానునకు చూపెను. తానాషా సంతోషించి దర్బారులోనికి వచ్చెను. అక్కన్న మాదన్నలు పరమానందభరితులై ఒకరినొకరు చూపులతో మాత్రమే హెచ్చరించుకొనుచు సుల్తానువెంట దర్బారులోనికి పోయిరి.

మొగలాయి రాయబారిని చూచి, తానాషా— 'రాయబారిభాయి ఇదుగో తమకు జవాబు. మీరు దీనిని పాదుషా వారికి అందఁజేయుఁడు' అనెను.

సభలో నందఱు ఆశ్చర్యపడుచుండిరి. అక్కన్న మాదన్నలు సుల్తానునెదుట నిలువఁబడియే యుండిరి. తానాషా వెంటనే వారికి 'పసారత్' (ఆంతరంగిక కార్యదర్శి) అను నుద్యోగము నిచ్చి చాల గౌరవించెను. వారిని తెచ్చినందులకు ముజఫరుఖానునకును మర్యాద చేసెను.

---

## ప్రకరణము 3 - తానాషా పూర్వచరిత్ర

ఎవరీ యక్కన్న మాదన్నలు? వీరే సామ్రాజ్యాధినాయకులై కొంతకాలము గోలకొండను పరిపాలించిన సుప్రసిద్ధాంధ్రమంత్రులు అక్కన్న మాదన్నలు.* వరంగల్లుఫర్గణాలో పింగళి భానూజీపంతులు ఒకానొక అమీలుక్రింద సుంకాధికారి. ఈయన భార్య భాగ్యమ్మ. ఈదంపతుల భాగ్యముగా వారికి నలువురు కుమారులు జనించిరి. — అక్కన్న, మాదన్న, విశ్వనాథుఁడు, మృత్యుంజయుఁడు నని. తండ్రియే కుమారులకు చదువు చెప్పెను. సకాలమున వివాహములంజేసి గృహస్థులనుగా నొనర్చెను. ఉత్సాహవంతులైన పెద్ద కుమారు లిరువురును ఒక శుభముహూర్తమున తండ్రియాజ్ఞనంది తమ పురోహితుని వెంటనిడుకొని రాజకీయోద్యోగములకై గోలకొండకు వచ్చి ముజఫరుఖానుకడ గుమాస్తాలుగా ప్రవేశించిరి.

---

*వీరు కొందఱు తలంచినట్లు మహారాష్ట్రులుకారు. ఆంధ్రనియోగి బ్రాహ్మణులలో వీరవైష్ణవులైనవారు గోలకొండ వ్యాపారులు. వీరి బంధుఫరంపర నేటికిని ఆంధ్రదేశములో నున్నారు.

ఆ మూఁడవనాఁడే సంధో కరా వినిరి. నాఁడే సుల్తాను దర్శన ముసు వసారత్ ఉద్యోగలాభమును. మెల్లమెల్లగా పైకివచ్చి ఎన్నఁడో సుల్తానుదర్శన మగుటకన్న తలవని తలంపుగా నొక్క దెబ్బతో వారికి సుల్తాను దర్శనమైనది. దర్బారువీడి బసకు వచ్చినవెంటనే వారు తమయదృష్టమును తల్లికి చెప్పి పంపిరి.

అక్కన్నమాదన్నలకు తానాషా వేదాంతవాక్యములు వినినదిమొదలు ఆతఁడేల అట్లు మాటలాడెనో, ముజఫరు ఖానుఁడు తమపై నేల యసూయవహించెనో కనుఁగొన వల యునని కుతూహలము పొడమినది. వారు అటనట విచారింపఁగా నీక్రింది విషయములు తెలిసినవి.

గోలకొండ సుల్తానులలో అబ్దుల్లాకుతుబుషా ఆఱవ వాఁడు. ఈతఁడు తనతండ్రి మరణానంతరము క్రీ. శ. 1626లో పండ్రెండేండ్ల వయసున రాజ్యమునకు వచ్చి నలువదియాఱు సంవత్సరముల కాలము పరిపాలించెను. ఈకాలమం దంతయు నాతఁడు ఇతరుల చేతికీలుబొమ్మయై యుండెను. నలువది యేండ్ల కుపైగా నీతని రాజ్యతంత్రము నంతయు నీతని తల్లి హాయత్ బక్ష్ బేగమ్ అనునామె నడపుచువచ్చెను. ఈమె బలవంతురాలు, దర్పముతో నిర్వహించినది. ఈమె చనిపోయిన తర్వాత అబ్దుల్లా తన పెద్దయల్లుఁడైన సయ్యద్ అహమ్మద్ అనువానికి సర్వవిధముల వశవర్తి యైయుండెను.

ఈతనియొక్కయు ముజఫరుయొక్కయు రాజనీతిచే గోలకొండ సామ్రాజ్యము మొగలాయీలకు లోఁజిక్కక దాదాఁపు అర్థశతాబ్దము తప్పించుకొనెను. కాని రాజ్యవినాశము ఎట్లును తప్పనట్టి పరిస్థితి రాఁదొడఁగినది. అబ్దుల్లా దుర్బలుఁడు; తనజీవితమంతయు సోమరిగా గడపెను. క్రీ. శ. 1656 వ సంవత్సరమున నీతఁడు ఔరంగజేబు చేతఁబడక కొంచెములో తన ప్రాణములను కాపాడుకొనెను. ఇతఁడెప్పుడును ప్రజలకు దర్శనమిచ్చుటగాని దేశాచారముల ననుసరించి ధర్మాధర్మములను విచారించుట గాని లేదు. కోటగోడలను దాఁటి ఇవలికి వచ్చుటకు అధైర్యపడుచుండును. అందుచేత దేశమందు కల్లోలములును అరాచకమును సహజముగా తప్పనివయ్యెను.

రాచనగరునందును పరిస్థితులు ఇంతకన్న చక్కఁగా లేవు. రాజకుటుంబమునందు అంతఃకలహము లేర్పడుచుండినవి. సుల్తాన్ అబ్దుల్లాకు మువ్వురు కుమార్తెలు మాత్రమే, పుత్రసంతానములేదు. మొదటియల్లుఁడు పైన పేర్కొన్న సయ్యద్ అహమ్మద్. రెండవయల్లుఁడు ఢిల్లీ పాదుషా ఔరంగజేబు రెండవ కొమారుఁడు. వీరిలో అహమ్మద్ మక్కాకుచెందిన యొక గొప్ప కుటుంబములోజనించి కేవలము తన స్వశక్తిచేతనే రాజ్యమందు సర్వాధికారిగా నుండెను. సుల్తానుయొక్క మూఁడవకొమార్తెకు వివాహము కావలసి యుండెను. ఈమెను అహమ్మదు తన యాశ్రితునికే సయ్యద్ సుల్తాన్ అను వానికిచ్చి పెండ్లిచేయుటకేర్పాటుచేసెను. ఇంతలో ఈయిరువురకును బెడిసి ద్వేషమేర్పడి

నది. ఇది క్రమముగాముదిరి జగడమునకుదిగి, సరిగా సయ్యదు సుల్తాను పెండ్లినాటికి ఆపెండ్లి మాన్పవలసినట్లు వచ్చెను. పెద్దయల్లుని కోపమునకు సుల్తాను భయపడెను. సయ్యద్ సుల్తానుయొక్క పెండ్లివేషమును లాగివేసి రాజ్యమునుండి తఱుమఁగొట్టి ఆతనియింటిని రాజభటులు కొల్లగొట్టిరి.

తర్వాత జోస్యులుపెట్టిన లగ్నము దాఁటిపోనీయక ఆదినమే సుల్తానుయొక్క మూఁడవకుమార్తెకు వివాహము నెఱవేర్పవలసి యుండెను. రాజమంత్రులు వరాన్వేషణ మొనరింపసాగిరి. బలవంతుఁడును బుద్ధిమంతుఁడు నైనవాఁడు సుల్తానునకు అల్లుఁడైన తనకాపదయని పెద్దయల్లుఁడును అక్లే మంత్రులును తలంచి వ్యర్థుఁడెవఁడైన దొరకునా యని వెదుకసాగిరి. వారికి అబుల్‌హసన్ అనువాఁడు దొరకెను. ఇతఁడు తండ్రి పార్శ్వమున రాజబంధువు. ఆతండ్రి గొప్పవర్తకమును సాగించి మరణించినను తన యవసానకాలమున నేమియు మిగుల్పనందున అబుల్‌హసన్ పేదరిక మనుభవించుచుండెను. వివాహదినము నాటికి పదునాలుగు సంవత్సరములుగా నీతఁడు సయ్యద్ రాజుకొత్తాల్ అను మహమ్మదీయస్వామికి శిష్యుఁడై వారి సాంగత్యమందే కాలము గడపుచుండెను. తండ్రి చనిపోవునప్పుడు పదునాలుగేండ్లు, ఇప్పుడు ఇరువదియెనిమిది.

ఈ మహమ్మదీయ సన్న్యాసి సంస్కృతాంధ్రములలో కూడ కవి, వేదాంతి, పండితుఁడు. ఈతఁడు తానాషాకాలమున గోలకొండలో మహాతపస్వి యని ప్రసిద్ధినందియుండెను.

తపస్సంపన్నులవంశమున జనించినవాఁడు. బందేనవాజ్ హాజరత్ అను తపస్వియొకఁడు ఢిల్లీనగరమునుండి బయలుదేరి అల్లాయుద్దీను సుల్తాను కాలమున గుల్బర్గాకువచ్చి అచ్చటనే యుండి సమాధినందెను. ఈతనివంశమువా రందఱును గొప్ప వేదాంతులై స్వాములని ప్రసిద్ధినందిరి. వీరిది సూఫీమతము. తాము మహమ్మదీయులే యైనను తమవారియందు వీరికి పక్షపాతము లేదు. ఏమతమువారైనను సరియే వేదాంతులైన చాలును. ఇతనివంశమున పుట్టినవాఁడే సయ్యద్ రాజుకొత్తాల్, అబుల్ హాసన్ గురువు. ఈమహర్షి పెద్దకొమారుఁడు అక్బరుషా, 'బడేసాహేబ్' అని బిరుదమువహించినవాఁడు. తండ్రివలెనే కవిశిఖామణి. ఈతఁడు ఆంధ్రభాషయందు శృంగారమంజరి యను నొక 'రసమంజరి'వంటి కావ్యమును రచించెను. అది పోయినదిగాని దాని సంస్కృతానువాదము నేటికిని కలదు. ఇతఁడును అబుల్ హాసనునకు గురువే.

నిరంతరము ఈమహాశయులమాటలు వినుచు వేదాంతిగా అబులహాసను కాలము గడపుచుండెను. దీనినెల్ల నీచసహవాసముగా భావించి ధనికు లెవ్వరును ఈతనితో చేరరైరి. అబుల్ హాసనునకు ఐహికవాంఛలు జనింపలేదు; వేదాంతము పట్టువడియుండెను. గురువుమీఁద నీతనికి అపారభక్తియు ఇతనియందు గురువునకు చాలవాత్సల్యమును ఏర్పడియుండినవి.

ఒకదినము గురుశిష్యులగోష్ఠిలో సుల్తానుకుమార్తె వివాహప్రస్తావము వచ్చినది. ఆమఱునాఁడే వివాహముహూ

ర్తము, రాచనగరులోని గందరగోళము ఊరంతయు తెలిసియుండి నది. సంతోషముగా నేవో మాటలాడుకొనుచుండి గురువు తటాలున నేలమీఁదనుండి ఎఱ్ఱని మట్టిముద్దను తీసికొని అబుల్ హాసనుయొక్క కాలివ్రేళ్లకు పాదములకును పారాణివలె నలంక రించెను; పరిహాసముగా నవ్వుచు 'నేను నిన్ను పెండ్లికొమా రునివలె నలంకరించుచున్నాను' అని పలికెను. ఏలయన వారిలో వివాహానంతరము పెద్దలు పెండ్లికొమారుని ఆశీర్వదించువిధ మిది. ఇదేమని చుట్టునుండినవారు ఆశ్చర్యపడిరి. 'ఏమో! భగ వంతుఁడు నాకీబుద్ధిని పుట్టించినాఁడు' అని ఆమహాత్ముఁడు బదులుచెప్పెను.

ఆమఱునాఁడు రాజాధికారులు అబుల్హాసనుకొఱకు వెదకుకొనివచ్చి గురుసన్నిధినుండి తోడ్కొనిపోయి, అతనికి, సయ్యదుసుల్తాను శరీరమునుండి లాగివేసిన వివాహమంగళవేష మిచ్చి, ఉజ్జ్వలాలంకృతమైన మహోన్నతాశ్వముపై నెక్కించి, దివిటీలతోను సంగీతాదికములతోను ఊరేగించి రాజుకొమార్తె నిచ్చి వైభవముగా వివాహము గావించిరి. ఇదంతయు నాతఁ డేదో స్వప్నమాయగా తలఁచెను. వివాహానంతరము గురు వును దర్శించి ఆతనిపాదములలో వ్రాలెను. 'ఈప్రపంచమే ఇటు వంటిది' అని ఆతనిగురువు బోధించెను. ఈమహానుభావుఁడే, నాటి పెండ్లికొడుకే నేటి తానీషా, ఆంధ్రులకు రామదాసచరిత్ర మున చిరపరచితుఁడైన 'తానీషానవాబు.' నిరంతరము వేదాంత వినోదములలో ప్రొద్దుపుచ్చుచుండినందుచేత నీతనికి తానాషా

అనఁగా నిత్యసంతోషి యగురాజు అని ప్రసిద్ధివచ్చినది. మన నోట తానీషాయైనది. కాని ఆయనపేరు అబుల్ హాసన్; కుతుబ్ షా అనునది గోలకొండసుల్తానుల పరంపర పేరు.

సుల్తానుయొక్క అల్లుఁడైన తర్వాత ఈయన సింహాసనమునకు వచ్చినదొక విచిత్రకథ. క్రీ. శ. 1671, ఏప్రిలు 21వ తారీఖున అబ్దుల్లాసుల్తాను మరణించెను. తత్క్షణమే సింహాసనమునకు తగవులు ప్రారంభమైనవి. సయ్యదు అహమ్మదు, గతించిన అబ్దుల్లా సుల్తానునకు తాను పెద్దయల్లుఁడైన కారణమున సింహాసనము తనదని లేచెను. అతనిభార్య, మాసాహేబు, తనచుట్టుసున్న బానిసలను వైదేశసేవికలను, సాయుధలను గావించి అంతఃపురమందు తనహక్కులను కాపాడుకొనుటకు సంసిద్ధురాలుగా నుండెను. కాని ప్రయోజనము లేకపోయినది. సయ్యదు అహమ్మదునకు ఆతనికఠినకర్కశస్వభావముచే శత్రువులనేకు లేర్పడియుండిరి. పైగా నీతఁడు పరిపాలనయందు సమర్థుఁడగుటచేత ఉద్యోగులు సహింపలేకయుండిరి. అబుల్ హాసనుయొక్క వేదాంతవినోదస్వభావము లంచగొండ్లైన రాజకీయులకు చాల అనుకూలముగా నుండెను. అతనిని సుల్తానుగా సింహాసనమెక్కించిన తమకు విశేషలాభముండునని వారనుకొనసాగిరి. అంతఃపురములోను కోట దర్బారులోను కొంత జగడమైనది. సయ్యద్ ముజఫర్ అను సేనాపతియు, మూసాఖాన్ అను మహల్దారును (అంతఃపురరాజగృహాధికారి) మఱికొందఱు ఉద్యోగులును ఏకమై ఆకస్మికముగా సయ్యద్ అహమ్మదును

పట్టి చెరసాలయం దుంచిరి. వెంటనే అబుల్ హాసనును సింహాసన మెక్కించి పైయిరువురును మంత్రులైరి. ఇతఁడే సయ్యద్ ముజ ఫర్, సర్వసేనాపతి, మహామంత్రి, అక్కన్న మాదన్నలను తానాషావద్దకు తెచ్చినవాఁడు. ఈ మంత్రియొక్క అధికార వాంఛయు తలపొగరుతనమును తానాషాకు భరింపరాక యుండెను. తన మంత్రులను దుర్మార్గులను తొలఁగించుట కాతఁడు తరివేచియుండెను. అందులకు తగినసహాయులు దొరక లేదు. అక్కన్న మాదన్నలను చూడఁగానే వీరు తనకీ కార్య మునకు ఉపకరింతురని తానాషా తలంచెను. వారివారి నడు గుటచే అక్కన్న మాదన్నలకు ఇంత పూర్వచరిత్రము తెలిసినది.

---

## ప్రకరణము ౫ - అక్కన్నమాదన్నల స్వప్నములు

అక్కన్న మాదన్నలు తానాషాకొలువులో ప్రవేశించి వారము దినములైనవి. అనుదినము రాజగృహామునకు పోవుచు తమ యుద్యోగమును నిర్వహింప మొదలిడిరి. చాల సులువుగా వీరు అన్ని కార్యములను చూచుకొనుటచే ఇతరులు మహమ్మ దీయులు పెక్కింటికి వీరి సాయమపేక్షింపసాగిరి; మిత్రులేర్పడిరి. సుల్తాను రహస్యముగా వీరి శక్తిసామర్థ్యములను పరీక్షించు చుండెను. ఆయవ్యయ విధానములలో వీరు లెక్కలు తయారు చేయుటను చూడవలెనను మిషతో వీరిని తన కులయత్ ఖానాకు పిలిపించుకొని ప్రసంగించుచుండెను. వారితండ్రి

భానూజీపంతులు కొమారుల యభివృద్ధిని ఎఱిఁగి సంతోషించి నను ఓరుగంటిలోనే యుండెను.

ఇట్లుండ ఒకనాఁడు అన్నదమ్ముల కిరువురకును చాల మంచి కలలు వచ్చినవి. వెంటనే మేల్కొని వారు ఒకరితో నొకరు చెప్పుకొనిరి. తెల్లవారిన తర్వాత స్నానాది నామధా రణము లైనవెనుక పూజాగృహము ప్రవేశించిరి.

మాడుపల్లి కృష్ణభట్టుగారు వారి పురోహితులు. సోదరు లిరువురును వారిని సమీపించిరి—'భట్టుగారూ, జపమైనదా?'

భట్టు—'ఆ అయినది నాయనా, ఇంద తీర్థము' అక్కన్న మాదన్నలు తీర్థము గ్రహించి భట్టుగారిముందు పీటపై కూ ర్చుండిరి.

అక్కన్న—భట్టుగారూ, మాకిరువురకు నిన్న రాత్రి అద్భుతమైన స్వప్నములు వచ్చినవండీ; చాల ఆశ్చర్యముగా నున్నది. వాని ఫలము తాము చెప్పవలెను.

భట్టు—శుభము, శుభము. మీకు ఇటీవలనే సుల్తాను దర్శనము, రాత్రి శుభస్వప్నము. ఈ గోలకొండసామ్రాజ్య ధారేయు లగుదురు కాఁబోలు. చెప్పుడు బాబూ.

అక్కన్న — తమ యాశీర్వచనము. మూఁడవజామున నేను ఎక్కడనో దేవాలయములో నున్నాను. చుట్టును భక్తు లనేకు లుండిరి. తటాలున దీపారాధన జరిగినది. ఎదుట భగవతి భవాని కనఁబడుచున్నది. విగ్రహము కాదు. దేవి ప్రాణము తో నుండెను. చేతుల నాడించుచు ఎల్లవారిని చూచుచు

నుండెను. నాకు ఆశ్చర్యముతో నేమియు తోపలేదు. మాదన్న నాప్రక్కనే యుండెను. ఆభక్తకోటిలో తానాషాకూడ కనఁబడుచుండెను. ఈ మహామ్మదీయుఁ డెట్లు గర్భాలయములోనికి రాఁగలిగెనని నా కాశ్చర్యమాయెను. మాదన్నవైపు చూచితిని. ఇంతలో నాతఁడు 'చూడు, చూడు, అన్నయ్యా! అమ్మవారు పిలుచుచున్నది' అనెను. అటు చూతునుగదా భక్తులు గాని తానాషాగాని ఎవరును లేరు, భవానీదేవిమాత్రము కనఁబడుచుండెను. 'అక్కన్నా, ఇంద, ఈకరవాలము గ్రహింపుము, మాదన్నా ఈపాశము నీకు. మీకు మేలగుగాక' అని అంతర్ధానమాయెను. ఆస్వప్నము తమ్మునికి కూడవచ్చినది.

మాదన్న—ఔనండి, మా యిరువురి స్వప్నములును ఒకటే. మేము ఏకకాలమున మేలుకొని ఒకరినొకరము చూచుకొని కొంతసేపుండి తర్వాత స్వప్నవృత్తాంతములను చెప్పుకొంటిమి. ఏమాశ్చర్యము!

భట్టు — ఆహా! దివ్యమైనకల. స్వప్నశాస్త్రములో చెప్పినట్లు మూఁడవజామునవచ్చినకల మూఁడు నెలలలో ఫలమిచ్చును. మీకు ఈవసారత్ నౌకరి మూఁడునెలలుమాత్రమే. తర్వాత, అక్కన్నా, నీకు మహాసేనాధిపతి పదవియు, మాదన్నా, నీకు మహామంత్రిత్వమును లభించును. అమ్మవారి ప్రసాదము వృథాపోదు. భక్తకోటిలో మీకు తానాషా కనఁబడుటచే నాతఁడు మహాభక్తుఁడనియు, గొప్పవేదాంతి యనియు, మహామ్మదీయుఁడేయైనను పూజ్యుఁడని తెలిసికొనవలయును,

అక్కన్న మాదన్నలు — 'అంతయు అమ్మవారి యను గ్రహము' అని దేవిపటమునకు నమస్కరించుచుండఁగా, ఇంతలో, వారిమేనల్లుఁడు గోపన్న వచ్చి 'తానాషాసుల్తాను వారు మామయ్యలకోసము కబురుపంపినారు. జవాను వచ్చి యున్నాఁడు, ఏదో తొందరపనియట' అని చెప్పెను. వెంటనే అక్కన్న మాదన్నలు ఉడుపులు ధరించి బయలుదేరిపోయిరి.

---

## ప్రకరణము ౫ - ఉపాయసిద్ధి

తానాషా సుల్తాను గొప్ప ఎత్తుగడలో నుండెను. తనకు తొలుత రాజ్యప్రాప్తికి కారకులైన ముజఫరు మూసాఖానులు తన్ను కేవల మొకబొమ్మగా చేయుట ఆతనికి కష్టముగానుండెను. వారిని తొలఁగింప నెంచియుండెను. సుల్తాను హృదయమును మాదన్న, మేధావి, క్షణములో గ్రహించెను. సుల్తానుతో నాంతరంగిక సంభాషణ మొదలిడెను; ముజఫరుమూసాలను తత్క్షణమే తొలఁగించిన నిందవచ్చుననియు ఆపని క్రమముగా చేయవలయుననియు మాదన్న సుల్తానున కుపాయముచెప్పెను. ఆయిరువురకును పరస్పరవిరోధ మేర్పడునట్లు చేయుమనెను. వారిలో ఒకనినిమించి యొకనిని, మర్యాద చేయుచుండు మనెను.

నాఁడు తానాషా మాదన్నచే నీతంత్రమును గ్రహించి అట్లేచేయ నారంభించెను. ముజఫరు మూసాలు ఒక్కొక్కఁ

డును సుల్తానునకు తానె ఆప్తుడనియు, సుల్తానునకు సాయము-
చేయు ప్రాధాన్యము తనదేయనియు [illegible] సుల్తానును
నాక్రమింపఁజూచు శత్రువనియు తలంప[illegible] వారిలో
ద్వేషము వర్ధిల్లసాగినది. ఈద్వేషము వారి సేవకులలోకూడ
వ్యాపించి వారు వీథులలో కొట్టుకొనువఱకు వచ్చినది. ఒక
దినము మూసా ముజఫరులు పరస్పరము దూషించుకొని రాజ
వీథులలో చాల అల్లరి గావించుకొనిరి. వెంటనే ఆవిషయము
సుల్తానువఱకు పోయినది. సుల్తాను మాదన్నను రహస్యముగా
సలహా యడిగెను. మాదన్న ఇట్లు నేర్పెను—వారిరువురను
ప్రత్యేకముగా పిలిపించి ఒక్కొక్కనితోను అతనిమీఁదనే తన
కభిమానమనియు ఇంకొకనిమీఁద ద్వేషమనియు నమ్మిక పుట్టించి,
తర్వాత ప్రతిష్ఠకొఱకు నలుగురయెదుట తాను దర్బారులో
వారిని మందలింపఁబోవుచున్నాననియు, దానిని వేఱుగా భావిం
పరాదనియు పలికి ఇరువురకును ఒకమారు బుద్ధి చెప్పవలసినది—
అని. సుల్తాను ఆ ప్రకారమే చేసెను. ఇంతవఱను, మంత్రుల
చేతి కీలుబొమ్మ సుల్తానని తలంచుచుండిన ప్రజలు ఇప్పుడు కొంత
భయపడసాగిరి. సుల్తాను వాస్తవముగా బలవంతుఁడనియే
తలంచిరి. ఆమంత్రు లిరువురును ఇది నాటకమేగదా యని
తలంచియుండిరి. ఈవిధముగా రెండుమూఁడుపర్యాయములు
జరిగినది. మూసాముజఫరులు కత్తియుద్ధమునకుకూడ సంసిద్ధు
లైయుండిరి. ఇంతలో అక్కన్న మాదన్నలు లంచములిచ్చియు
బెదరించియు ప్రభువులను సామంతులను ఉద్యోగులను

యోధాగ్రేసరులను సుల్తానుపక్షమునకు త్రిప్పియుండిరి. మంత్రులకు గౌరవము తగ్గుటతోకూడ బలమును ఉడిగెను. వీరు సుల్తానును త్రిప్పుచున్నా రనుమాటపోయి వీరు సుల్తానునకు లొంగిపోవుచున్నారుగాని సుల్తాను వాస్తవముగా సాధువు, లేకున్న వీరిని ఎన్నఁడో కడతేర్చియుండునని జనులు చెప్పుకొనసాగిరి.

నాలుగవపర్యాయము చాలరచ్చ జరిగెను. మూసా ముజఫరులు దర్బారులోనే పరస్పరము దూషించుకొనిరి. సుల్తానుయొక్క మాటలను సయితము లక్ష్యముచేయక తిట్టుకొనుచుండిరి. సుల్తాను తనగౌరవమును దర్బారుగౌరవమును కాపాడుకొనవలసియుండెను. సుల్తాను మాదన్నను చూచెను. మాదన్న కనుసైగ చేసెను. వెంటనే తానాషా వారిరువురను ఖైదుచేయుటకు ఆజ్ఞయిచ్చెను. ముందే మాదన్న ఏర్పాటుచేచేకాచుకొనియుండిన రక్షకవర్గము మూసాముజఫరులను బంధించికొనిపోయిరి. ఆశిక్ష న్యాయ్యమనియే ప్రజలు తలంచిరి. ఈ మారుకూడ సుల్తాను ఆత్మగౌరవమును నిలువఁబెట్టుకొనుటకొఱకు అట్లుచేసెనని ఆభ్రాంతులు తలఁచిరి. కాని సుల్తాను వారికి మరి విడుదలలేకుండఁజేసెను; వారి యాప్తవర్గమును పూర్తిగా శిక్షించెను. కొందఱు సుల్తానునకు పాదాక్రాంతులై వారిమన్నన వేడిరి. తక్షణమే సుల్తాను మూసాముజఫరులు అయోగ్యులనియు వారికి తానిచ్చినది లఘుశిక్షయనియు నుద్ఘోషించి, మాదన్నను వజీరుగ నియమించి అతనికి 'సూర్య

ప్రకాశరావు' అను బిరుదము నొసంగెను. అక్కన్నను మహా సేనాధిపతిగా నేర్పాటుచేసెను. వారిమేనల్లుఁడు గోపన్నకు మాదన్న సిఫారసుమీఁద భద్రాచలమున తాసిల్దారుద్యోగ మిచ్చెను. వానితమ్ముఁడు వెంకన్నకు 'రూస్తుంరావు' అను బిరుదిచ్చి ఫౌజుదారు (సేనాపతి)గా నియమించెను. మాదన్న సిఫారసుమీఁద సుల్తాను మహమ్మద్ ఇబ్రహీం అనువానిని మొదట సార్-ఇ-ఖేల్ (అశ్వసాహిణి)గాను తర్వాత నవాబుగాను చేసెను. తర్వాత సుల్తానుయొక్క ఆజ్ఞమీఁద అక్కన్న మాదన్నలను నవాబు లందఱును ఏనుఁగుపై నూరేగించి వారి బసకు కొనిపోయి అచ్చట వారికి చాలగౌరవముచేసి నజరులు చెల్లించి పెక్కుసలాములతో వీడ్కొనిరి. దేవీప్రసాదము ఈవిధముగా నెఱవేరెను.

భానుమూర్తి పంతులు కొమారుల యభ్యుదయమునకు సంతోషించి భార్యతోవచ్చి గోలకొండలోనే నివసింపసాగెను. హనుమకొండలోనుండి మాదన్నసోదరులును వచ్చిరి. విశ్వనాథునకు బక్షిగిరి, అనఁగా సైన్యమునకు జీతము పంచియిచ్చు నధికారమును, మృత్యుంజయునకు పీష్వాయుద్యోగమును లభించినవి. పదవీస్వీకారానంతరము సుల్తానుయొక్క అనుమతి నంది అక్కన్నయు నాతనిసోదరులును తమ కనుకూలముగా నొక యింటిని కట్టుటకు ప్రారంభించిరి. తండ్రితోను తమవిద్వాంసజ్ఞయైన మాడుపల్లి కృష్ణభట్టుతోను ఆలోచించి ఖిల్లా (కోట)కు తూర్పున సాహుబండ్ అనుచోట, శతాబ్దములు 1593 అగు

విరోధికృత్సంవత్సరము మాఘ శుద్ధ పంచమినాఁడు (క్రీ. శ. 1672 జనవరి 21-వ తారీఖున) శంఖుస్థాపన మొనర్చి మూఁడు నెలలలో కట్టడము పూర్తి చేసి, శకము 1594 పరీధావి వైశాఖ శుద్ధ సప్తమినాఁడు (క్రీ. శ. 1672 ఏప్రిలు 22 తేది) గృహ ప్రవేశ మొనర్చిరి.

---

## ప్రకరణము ౬. - మాదన్న పరిపాలనాప్రారంభము

మాదన్న కావించిన మహోపకారమునకు తానాషాకు ఆతనియం దపారమైన నమ్మకమును ప్రియమును ఏర్పడెను. సర్వాధికారమును మాదన్నకే వదలి తాను వినోదాదికముల లోను విద్యావంతులతోను కాలము గడుప నారంభించెను. మాదన్న తత్క్షణమే సామ్రాజ్యములో గొప్ప మార్పు లేవియు తేలేకపోయెను. రాజ్యరక్షణమే ప్రధానముగా నుండెను. అధి కారమునకు వచ్చినవెంటనే అక్కన్న మాదన్నలకు తలతిరుగ లేదు. ఈ మహోపకార మొనర్చిన సుల్తానుపై వారికి అపార భక్తి యేర్పడెను. ఆతని పూర్వచరిత్రమంతయు గ్రహించిన వెనుక నాతఁడు కేవల మొకజ్ఞాని ఈరూపున నున్నాఁడని తలంప సాగిరి. అట్టిప్రభువును కొలుచుట మహాభాగ్యమని తలంచిరి. అనుదినమును ఉదయము కచేరికిపోయి సుల్తానునకు నాటివిష యములెల్ల విశదీకరించి తాము చేయఁబోవువానిని మనవిచేసి ఆతని యనుమతి నందుచుండిరి. మునుపటి వజీర్లకును వీరికిని ఎంత భేదము! ముజఫరుమూసాలు తానాషాకు ఏమియు చెప్పెడి

వారేకారు. వీరు, సుల్తాను రాజకార్యముల వివరములు తనకు వలదనినను, ఆయనకు నివేదించుట ధర్మమనియు, మర్యాద యనియు చెప్పుచు అతనిని చాల అనుసరించుచుండిరి. భగవంతుఁడు తన కింతటి మంచిమంత్రుల నిచ్చెనుగదా యని తానాషా సంతసించుచుండెను.

మాదన్న మంత్రియైన కొలఁదికాలముననే దేశమును బాగుపఱిచెను. మొదటిపనిగా కొండలలోనుండి దేశోపద్రవము చేయు జాతులవారిని శిక్షించి పైరుపంటలకు రక్షణ యొసంగెను. జనులను పీడించు జమీందారులను సుంకాధికారులను లాగివేసి సాధువులను ధర్మపరాయణులను వారిస్థానమున నియమించెను. ఈవిధముగా నన్ని జిల్లాలను నిష్కంటక మొనర్చెను. తర్వాత అన్నిసుబాలలోను గ్రామగ్రామముగా తనిఖీచేయించి వివరముగా పన్నువసూలు పట్టీలు ఆయాసంవత్సరములకు ప్రత్యేకముగా తయారుచేయించెను. ఇందువలన జనులకు కొంతనెమ్మది యేర్పడెను. ఇనాములు, అగ్రహారములు, దేవ బ్రాహ్మణదానములు, 'నౌకరీ ఇనాములు' మొదలైనవాని పాలనలోని అక్రమములను మాన్పించెను. తాను క్రొత్తగా పెక్కు దానములను ఇనాములను ఇచ్చెను. హిందూమహమ్మదీయులకు పక్షపాతములేక శిక్షణ రక్షణ లొసంగుచుండెను.

గోలకొండసామ్రాజ్యము చాలవిస్తృతమైనది. ఉత్తరమున శ్రీయకుళము మొదలు దక్షిణమున పుదుచ్చేరివఱకును, ఆంధ్రదేశమంతయు నీ విశాల సామ్రాజ్యమున చేరియుండెను.

కడపజిల్లాయును కర్నూలుజిల్లాలోని తూర్పుభాగమును నేటి హైదరాబాదునందలి కల్యాణీజాగీరువఱకుగల భాగమంతయు ఇందులోనిదే. ఏవో ఒకటిరెండు ప్రదేశములు తప్ప ఆంధ్రదేశ మంతయు తానాషాపరిపాలనలో నుండెను. నాటి యాంధ్రదేశ మున బంగారము పండుచుండెననిన అతిశయోక్తి కానేరదు. బిజాపురమునందలి నిస్సారప్రదేశమును వదలి తెలంగాణమును ప్రవేశించినంతనే పచ్చని పైరుపంటలు చూపరుల కానందమును గొల్పుచుండినవి. ఫలవృక్షములు నేత్రోత్సవము సేయుచుండి నవి. ఈదేశపు వజ్రపుగనులును విశేషవ్యాపారస్థానములైన రేవుపట్టణములును ఖండాంతర ద్వీపాంతరములందు ప్రసిద్ధి నందియుండినవి. తానాషాసుల్తానునకు సంవత్సరమునకు దా దాఁపు మూఁడుకోటుల రూపాయల యాదాయ ముండెను. ఈమొత్తము సుల్తానయొక్క సకలవినోదాదికములకును చాలి పైపెచ్చు రాజ్యరక్షణకొఱకు విదేశీయులకు వార్షికము లిచ్చు టకుసయితము చాలియుండెను. ఈవైభవమే శత్రువులకు కను కుట్టాయెను. మొగలాయీలకు ఈసంపదనంతయు చూరగొను దురాశ పొడమెను.

ఔరంగజేబు సింహాసన మెక్కినతర్వాత ముప్పదిసంవ త్సరములవఱకు గోలకొండసామ్రాజ్యమునకు శాంతియుండెను. ఇందులకు కారణము, బిజాపూరువలె, గోలకొండ మొగలా యీలను ప్రత్యక్షముగా నెదుర్కొనకపోవుటయే. ఇంతవఱ కును మొగలాయీలకు, శివాజితోను అతనిస్నేహితుఁడైన

ఆడిల్‌షాతోను యుద్ధము చేయుచుండినందున గోలకొండపై దాడి సలుపుటకు అవకాశము దొరకలేదు. పైగా గోలకొండ వారు ఢిల్లీకి సక్రమముగా కప్పము కట్టుచుండిరి.

గోలకొండ రాజ్యమునకు సరియైన రక్షణ లేదు. దాని యుత్తరభాగము మొగలాయీలు జయించిన రాజ్యమును ఆనుకొనియున్నట్టి విశాలమైన బయలు. దానియందు బిజాపురము యొక్క రక్షణకున్నట్లు దుర్గమపర్వతములుగాని, నీరు దొరకని ఎడారిగాని మఱియెట్టి నైసర్గిక నిరోధముగాని లేకుండెను. కాని ఎంతకాలము బిజాపూరు స్వతంత్రరాజ్యముగానుండునో అంతవఱకు గోలకొండకు అపాయములేదు. ఈవిషయమును చక్కఁగా నెఱిఁగినవాఁడగుటచే నౌరంగజేబు పాదుషా, గోలకొండను మొదటజయించి తనసామ్రాజ్యమందు కలుపుకొనుటకు యత్నింపలేదు అట్లుచేయుటయు అసాధ్యముగానుండెను.

మాదన్నపంతులు కొలఁదిమార్పులతో తత్పూర్వము గోలకొండవా రనుసరించుచుండిన విదేశాంగనీతినే యనుసరించెను. క్రీ.శ. 1636వ సంవత్సరము నైజాముషాహీ రాజ్యము పడిపోయినది. ఆది మొదలు ఎట్లు ఈ మొగలాయీవారిని తప్పించుకొందుమా యను భీతి దక్షిణరాజ్యములకు పట్టినది. గోలకొండవారికిని అదేభయము. అందుచేతనే గోలకొండసుల్తానులు మాటమాత్రమునకు ఢిల్లీపాదుషాకు వశపడియుండిరే గాని వాస్తవముగా, లోలోపల, బిజాపూరు ఆడిల్‌షాహీవారికి ధనసహాయము చేయుచుండిరి ; మొగలాయీలు బిజాపురము

మీఁదికి దాడివచ్చినప్పు డంతయు తమసైన్యములను ఎల్లల కడకు పంపుచుండిరి. మొగలాయీలు తాము బిజాపూరుమీఁదికి దాడి వెడలినయెడల గోలకొండవారు తమసైన్యముమీఁదికో తమరాజ్యముమీఁదికో దండెత్తివచ్చి బిజాపురమువారికి సహాయము చేయుదురని ఎఱిఁగియుండిరి.

మాదన్న ఈమార్గమునే యనుసరించెను; బిజాపురము వారితో విరోధింపలేదు, స్నేహమే చేయుచుండెను. కాని బిజాపురవ్యవహారము ఇప్పుడు చాల గందరగోళముగానుండెను. అంతఃకలహములు జరుగుచుండినవి. ఇట్టిరాజ్యముతో స్నేహము ఈకాలమున అసాధ్యముగాను నిరుపయోగముగాను నుండెను. ఈవిషయములెల్ల మాదన్న ఆలోచించెను; నిరంతరము జయముగాంచుచుండిన మహారాష్ట్రులతో స్నేహము మొదలుపెట్టెను; శివాజీతో నుత్తర ప్రత్యుత్తరములు ప్రారంభించెను.

---

## ప్రకరణము ౭ - శివాజీ

క్రీ. శ. 1674లో శివాజీ పట్టాభిషేకము చేసికొనెను. అందుచే నాతనిబొక్కసము చాల తగ్గిపోయెను. తర్వాత నతఁడు బిజాపూరు రాజ్యమునందు చాలచోటులలో దోపిడి చేసినను ఎక్కువధనము దొరకలేదు. దక్షిణాపథమునందలి పలు చోటులను ఆతఁ డప్పటికే దోచియున్నాఁడు. ఈతని దాడికి భయపడి పెక్కువ్యాపారస్థలములు పాడైపోయినవి. దక్షిణ

దేశమున నేటి మదరాసుతీరము సుభిక్షముగా నుండుటయే గాక శివాజీ కంట నింకనుపడ లేదు. ఈదేశమందలి జనులు నిరాడంబరజీవులై సౌఖ్యముగ నుండిరి. ఇచ్చటి రేవుపట్టణములు అతిప్రాచీనకాలమునుండియు విశేషవ్యాపారముల కాటపట్టులగుటయేగాక ఇచటిగనులు తఱుగని సౌభాగ్యముగా నుండినవి. ఈ ధనమంతయు చాలవఱకు దేవాలయములకును ధర్మకార్యములకును ఖర్చగుటయేగాక విశేషముగా జనులకు దాఁచుకొనుటకును ఆభరణములు చేయించుకొనుటకును మిగులుచుండెను.

విజయనగరసామ్రాజ్యము పడిపోయినతర్వాత దక్షిణదేశము పెక్కురాజ్యము లాయెను. వీనిలోవీనికి కలహములేర్పడెను. తమకు సాయముచేయుటకై ఈరాజ్యములు గోలకొండ బిజాపూరు మొదలైన మహమ్మదీయరాజ్యముల సాయమును వేడుటచే తురుష్కుల పలుకుబడి హెచ్చసాగెను. మొగలాయీల బలముచే ఉత్తరమున రాజ్యమును విస్తరించుట అసాధ్యమైనందున బిజాపుర గోలకొండరాజ్యములు దక్షిణమునకు వ్యాపించుటకు ప్రయత్నించుచుండినవి. ఇందుచే గోలకొండవారు కడప, ఉత్తరార్కాడు జిల్లాల భాగమును పాలారువఱకును జయించిరి. బిజాపూరువారు కర్నూలు, బెంగళూరు, ఉత్తరముననున్న మైసూరు భాగములను, పాలారు కొల్లడముల నడిమి మదరాసుభాగమును, వేలూరు మొదలు తంజావూరువఱకు ఆక్రమించిరి. శివాజీ సోదరుఁడైన వెంకాజీ

తండ్రివలెనే ఆడిల్‌షాక్రింది సర్దారుగా నీప్రదేశములను పాలించుచుండెను. ఇతనికి జింజిప్రాంతభాగము తండ్రివలన వచ్చినట్టిది.

ఈలోపున మధురనాయకులకును తంజావూరి ప్రభువులకును స్పర్ధలువచ్చి తంజాపురిపాలకుని మధురవారు చంపివేసిరి. గతించినరాజుయొక్క కొమారుఁడు బిజాపూరు ఆడిల్‌షాకు మొఱపెట్టుకొనఁగా నాతఁడు వెంకాజీని సాయము పొమ్మనెను. వెంకాజీ తంజావూరిని జయించి మధురవారిని పాఱద్రోలి ఆరాజ్యమును తానేహరించెను; చుట్టునున్న వారినికూడ జయింప యత్నించుచుండెను. ఈనడుమ క్రీ. శ. 1675 సం, ఏప్రిలునెలలో శివాజీసైనికులు బిజాపురభూములలో కొల్లగొట్టుచు గోలకొండ రాజ్యములోనికి ప్రవేశించి ఏతగిరి (నేటి యాద్గీర్)ని పూర్తిగా దోచుకొని హైదరాబాదువఱకును వచ్చి వెడలిపోయిరి.

మాదన్న మహామంత్రి ఆలోచించెను. విజయాపురమందలి దక్షిణప్రదేశములను జయించి ఆంధ్రసామ్రాజ్యమున చేర్పఁదలంచెను. ఇట్టిసందర్భమున శివాజీతో సంధి కుదుర్చుకొని అతనితోచేరి దక్షిణదేశమును జయించి పంచుకొనుట మంచిదని ఆతనికి తోఁచినది. వెంటనే శివాజీతో సంధికి తానీషాను అతఁడు ఒడంబరుపసాగెను-బిజాపురములోని కర్ణాటక దేశమును తానాషాగారికొఱకు శివాజీ జయించి ఇచ్చివేయవలసినది; దండయాత్రాకాలమున దొరకిన లూటీనంతయు

శివాజీ తనకు గ్రహింపవలసినది—ఇట్లు నిబంధనలు కుదుర్చుటకు మాదన్న ప్రయత్నింపసాగెను.

శహాజీ చనిపోవునప్పుడు వెంకాజీ బాలుఁడు. ప్రపంచానుభవము చాలని తనకుమారునికి సాయముగా రఘునాథనారాయణహనుమంతె అనువానిని ఏర్పాటుచేసి శహాజీ మరణించెను. ఇంతకాలము ఈ హనుమంతె తానేప్రభువైనట్లు ఎల్లకార్యములను జరుపుచుండెను. వెంకాజీ నేఁడు పెద్దవాఁడు; హనుమంతుని పెత్తనమును సహింపలేకపోయెను. పైగా హనుమంతె నానామార్గోపాయములచేత విస్తారము ధన మార్జించియుండెను. వెంకాజీ హనుమంతుని పాతలెక్కలడిగెను. హనుమంతె వెంటనే తనయుద్యోగమునకు రాజీనామా నిచ్చి కాశీయాత్రకు పోవునట్లు నటించి తన ఆస్తినంతయు తీసికొని జనార్దనుఁడను తమ్మునితోకూడ బయలుదేరెను తంజాపురినుండి బిజాపురమునకు పోయెను. అచ్చట తనసామర్థ్యముచే నొక మంత్రిపదవి సంపాదించెను. ఇంతలో శివాజీ ఇతనిని తనకడకు పిలిపించెను. హనుమంతె పూనానగరమునకు పోయిచేరెను.

వెంకాజీమీఁద పగ తీర్చుకొనవలయునని హనుమంతె తలఁచియుండెను. అందులకై శివాజీని దక్షిణదేశముపై దండెత్తుమని హనుమంతె పురికొల్పుచుండెను. శివాజీకి తమ్ముని రాజ్యముమీఁద ఇంతవఱకు అపేక్షలేదుగాని హనుమంతుని దుర్బోధనలన ఇప్పుడు ఏర్పడసాగెను. ఈకాలమునకు సరిగా రాజకీయపరిస్థితి శివాజీకి అనుకూలమాయెను. మొగలాయీ

పాదుషా పంజాబులో యుద్ధమొనరించి ఢిల్లీకి వచ్చియుండినను ఆతనిసైన్యము లింకను పంజాబునందేయుండెను. బిజాపూరు సుల్తాను సికందరు బాలుఁడు. అందుచేత వజీరుపదవికి అంతఃకలహములును హత్యలును జరుగుచుండినవి. భలోల్ ఖాన్ అనునతఁడు క్రొత్త మంత్రియాయెను. మొగలాయీలు మఱియొకని మంత్రిత్వమునకు సహాయము చేయఁగోరి బిజాపూరుమీఁదికి దండెత్తిరి. కాని వారిసైన్యము లింకను రాలేదు.

ఇట్టిసమయమున మాదన్న బిజాపురమును రక్షింపనెంచెను. భలోలుఖాను శివాజీతో స్నేహముకోరెను. మాదన్న కోరినదియు నదియే. వెంటనే మాదన్న శివాజీతో భలోలుఖానునకు సంధి కుదిర్చెను. భలోలుఖాను బిజాపురమువారితరఫున శివాజీకి మూఁడులక్షలరూపాయలు బహుమతిగా నిచ్చుటకును,' తమ తూర్పువైపు కృష్ణాతీరపు జెల్లను కాపాడుటకును మొగలాయీలను తఱుముటకును లక్షహోన్నులు, (బంగారు నాణెములు) ఏఁటేట ఇచ్చుటకును మాదన్న మాటమీఁద ఒప్పుకొనెను. ఈసందర్భమున శివాజీ ఉత్తరమునుండి తనకెట్టి ఆపదయు రాదని గ్రహించెను. ఈకట్టుబాట్లను ఎక్కువకాలము జరుపవలయునని ఆతనియుద్దేశముకాదు గాన తాత్కాలికముగా అనుకూలమని ఆతఁడు ఒప్పుకొనెను. నిలుకడలేని బిజాపూరు ప్రభుత్వముతో ఎట్టిస్నేహమును చాలకాలము జరుగదని ఆతఁడు ఆలోచించెను. బిజాపూరువారిచ్చిన ధనమును మాత్రము గ్రహించెను.

అప్పుడు శివాజీ ఒక ఉపాయముచేసెను. మొగలాయీ వారినుండి బిజాపురమును కాపాడునట్టిపనిని తప్పించుకొనెను. ఎట్లనఁగా బిజాపురముమీఁదికి దండెత్తనుండిన మొగలాయీ రాయబారితో తానొకసంధి కుదుర్చుకొనెను. అంతకు రెండేండ్ల నుండి మొగలాయీలు శివాజీతో యుద్ధముచేసి విసిగియుండిరి; తమకు భయపడి భలోల్‌ఖాను శివాజీతో చేరఁగానే వారికిని కొంతకష్టమైనది. భలోలుఖానుమీఁద పైయెత్తుగా మొగలాయీ రాయబారి తానును శివాజీతో సంధి కోరినందువలన శివాజీకి మంచిదేయైనది. తన ద్రవ్యాకర్షణమునకును దక్షిణదేశ దండయాత్రకును అనుకూలమని శివాజీ వెంటనే ఒప్పుకొని, తాను కర్ణాటకదేశముమీఁద దండెత్తి తిరిగివచ్చులోపల దాదాపొక సంవత్సరకాలము బిజాపురమునకు మొగలాయీల వలన బాధలేకుండిన తాను శ్రమపడకయే వారిని రక్షించిన ట్లగునని, అట్టియేర్పాటుమీఁద సంధిషరత్తులు కుదిర్చెను.

ఇన్ని వ్యవహారములలోను మాదన్నమంత్రియున్నాఁడు. శివాజీయుద్దేశము నాతఁడు కొంతవఱకు గ్రహించెను. దక్షిణదేశములమీఁదికి శివాజీ కొల్లఁగొట్టుటకు బయలుదేరిన గోలకొండ గతి యేమగును? బిజాపురమును తాత్కాలికముగా కాపాడుటయైనది. మొగలాయీలవలన భయములేదు. మఱి శివాజీనికూడ స్నేహితుని చేసికొనిన మొగలాయీలను పూర్తిగా నిలుపవచ్చునని తలఁచి మరల శివాజీతో రాయబారము

జరిపెను. బిజాపురమునకును శివాజీకిని సఖ్యము కలిపినవాఁడు తానేగదా. శివాజీకి మాదన్న కడకుండి రాయబారముపోయి గోలకొండవారికిని మహారాష్ట్ర నేతకును సఖ్యము కుదిరినది. మాదన్న సంవత్సరమునకు ఒకలక్షహొన్నులు శివాజీకి గోలకొండను కాపాడుట కిచ్చుట కొప్పుకొనెను. ప్రహ్లాదనిరాజీ అను మహారాష్ట్రుని శివాజీ తనరాయబారిగా గోలకొండకు పంపెను.

శివాజీకికూడ గోలకొండవైభవమును చూడ వేడుకాయెను. హైదరాబాదునకేఁగు తనరాయబారి కాతఁడు తనయభిప్రాయమును తెలిపెను. ప్రహ్లాదనిరాజీ అందులకు తగిన సంవిధానమును కుదుర్పుమని మాదన్నను వేడెను. అఫ్జల్‌ఖానును కూల్చినవానితో ఏకాసనమందు కూర్చుండిన నేమగునోయని తానాషా మొదట భయపడెను. ప్రహ్లాదనిరాజీ చాలనమ్మకము కలుగునట్లు పలికెను. మాదన్నయు శివాజీ తమకు ద్రోహ మొనర్పఁడనియు నాతనికి మొగలాయీలే వైరులనియు దృఢముగా తానాషాను నమ్మించెను. పైగా శివాజీతో ముఖాముఖిగా మాటలాడుటవలన పెక్కు అనుకూలము లున్నవనియు తెలిపెను. తానాషా సమ్మతించెను. శివాజీతరఫున ప్రహ్లాదనిరాజీ తమదక్షిణదేశవిజయములలో కొంతభాగము తానాషాకిచ్చుట కొప్పుకొనెను.

## ప్రకరణము ౮ - శివాజీ గోలకొండ ప్రయాణము

క్రీ. శ. 1677 సంవత్సరము జనవరినెలలో శివాజీ రాయఘురునుండి బయలుదేరెను. ఆతనితో పలువురు బయలుదేరిరి. నేతాజీఫాల్కర్ అనునతఁడు పదేండ్లకాలము మహమ్మదీయులలో కలసియుండి ఢిల్లీలో కొలువుచేసి మహారాష్ట్రదేశమునకు వచ్చియుండెను. ప్రాయశ్చిత్తముచేసికొని మరల నీతఁడు హిందువయ్యెను. ఇతఁడును ఇట్టివారు కొందఱును శివాజికి తోడై బయలుదేరిరి.

శివాజీసైన్యము హైదరాబాదు రాజ్యపు ఎల్లలలో ప్రవేశించినది. వెంటనే తనసైనికులకు ఎచ్చటను ఎవరికిని ఎట్టి హానిగాని కలిగింపరాదని గట్టియాజ్ఞ నొసంగెను. ఇతరత్ర చేయునట్లు దోపిళ్లు ఇచ్చుట పనికిరావనెను. ఎల్లవారితోను స్నేహమర్యాదలు పాటింపవలసినదని కట్టడచేసెను. ఇందుచేత నాతని వెంటవచ్చిన ఏఁబదివేల సైన్యమును సాధువులవలె గోలకొండరాజ్యమున ప్రయాణ మొనర్చిరి.

ఫిబ్రవరినెల వచ్చినది. శివాజీ ససైన్యుఁడై గోలకొండను సమీపించెను. తానాషా శివాజీకి ఎదురేగి తోడ్కొని రాఁదలంచెను. ఆవార్త విని శివాజీ నివారించెను. 'తానాషా సుల్తానుగారు చాలదొడ్డవారు. నాకన్నను చాలపెద్ద. నావంటి చిన్నవానికి ఆయన ఎదురు రాకూడదు' అని యామహావీరుఁడు పలికెను. కాని వాస్తవముగా వయసులో శివాజీయే పెద్ద

వాఁడు. అందఱకన్ననుచిన్న మాదన్న. అక్కన్న మాదన్నలు మాత్రము కొన్నిమైళ్లు ఎదురువచ్చి శివాజీని సగౌరవముగా కొనిపోసాగిరి.

శివాజీరాకకై గోలకొండకు ఆఱుమైళుల దూరమున నుండిన హైదరాబాదు నగరము అలంకరింపఁబడియుండెను. వీథులును సందులును గొందులును సన్నని కుంకుమకెంధూళుల చేతను పసుపుపొడిచేతను తెల్లని బియ్యపుపొడిచేతను రచితములైన రంగవల్లులచేత మనోహరముగానుండెను. రాజమార్గములయందును నాలుగువీథులు కలియుచోటులయందును మహాసౌధములకడను గొప్పగడలు నిలిపి వానికి జెండాలును తోరణములును కట్టియుండిరి. వెదుళ్లచేత అటనట గొప్పదర్వాజాలు కట్టి వానిని అలంకరించియుండిరి. జనులు హిందువులును మహమ్మదీయులును వివిధములైన దుస్తులు ధరించి శివాజీయను ఆ వింతపురుషుని చూచుటకు తమకపడుచు నిలిచియుండిరి. స్త్రీలందఱును మేడలమీఁదను కిటికీలకడను క్రిక్కిరిసియుండిరి.

మహారాష్ట్రసైన్యము పట్టణములో ప్రవేశించెను. సైనికులును వారి యున్నతాధికారులును బహువిధాభరణములతో ఉజ్జ్వలవేషములను ధరించియుండిరి. వారికిరీటములు, వాని మీఁది బంగారము, రత్నములు, వారి జలతారువస్త్రములు,—మహారాష్ట్రవేష మంతయు తెలంగాణమువారికి వేడుకగానుండెను. ఏఁబదివేలసైన్యము సుముహూర్తమున పట్టణమును జొచ్చెను. 'ఈసైన్యమేగదా ఢిల్లీపాదుషాకు ప్రక్కలోబల్లె

ముగా నున్నది! వీరేగదా రెండేండ్లక్రింద సతగిరిని దోఁచి హైదరాబాదుపట్టుకు వచ్చి కొల్లగొట్టినవారు. వీరేగదా వీరాధివీరులకు గండరగండండ్రు!' అని జనులు చెప్పవాల్పక వారిని చూడసాగిరి.

కొంతసేపు మరాటా ఆశ్వికదళము ఖవంత్రొక్కెను. తర్వాత మావలీలనఁబడు వీరుల కాల్బలము నడచెను. వారి వారి దళనాయకులు జగత్ప్రసిద్ధులు-హంబ్బీరరావుమోహితే, ఆనందరావు, మానాజీమోరే, సూర్యాజీమాల్సురే, యెశాజీ కంక్ పోవుచుండఁగా జనులు వారిని తమమిత్రులకు చూపి చూపి వారిచరిత్రములను వర్ణించుచుండిరి. వారితర్వాత శివాజీయొక్క ప్రతీహారి సోనాజీనాయకు, వానివెనుక శివాజీ యొక్క అంగరక్షకుఁడు బాబాజీవంధేరేయును పోయిరి. వారి విశాలనేత్రములు, నల్లని కనుబొమలు, కుంకుమ చందనములు ధరించిన నొసలు ప్రస్ఫుటముగ కనఁబడుచుండెను. తర్వాత రఘునాథ హనుమంతెయును అతనిసోదరుఁడు జనార్ధనహనుమంతెయును, ప్రహ్లాదనిరాజీయు గ్రంథకారుఁడైన దత్తాజీ త్రింబక్, కేశవపంత్, నీలోమోరేశ్వరరావు, గంగాధరపంత్ మున్నగువారును గుఱ్ఱములమీఁద నేఁగిరి.

వీరిందఱేఁగినను చూపరులలో సంచలనము కలుగలేదు. వారివెనుక గుఱ్ఱములమీఁద మహామంత్రులు సేనాధిపతులు ప్రభువులు పరివేష్టించియుండ అక్కన్నమాదన్నలు ఇరుప్రక్కల వచ్చుచుండఁగా వారినడుమ సన్నగా చిక్కిపోయినవ్యక్తి

జనుల నాకర్షించెను. అతఁడే శివాజి! మూఁడువందలమైళ్లు నడచియున్నందునను అప్పుడే ఏదోజబ్బునుండి తేరుకొనుచున్నందునను చాల బలహీనుఁడుగా కనఁబడుచుండెను. కాని ఇటు నటువీక్షించుచుండిన యాతని నేత్రములలో తైక్ష్ణ్యమును కాంతియు జ్వలించుచుండినవి. పెదవులమీఁది యా 'మీసాలలో నవ్వులు'ను చక్కఁగా కోటేరు తీర్చినట్లున్న యాతని నాసికయు నాతని కొక శోభనుకూర్చి 'ఈతఁడు చండశాసనుఁడే గాని దయాళువే' యని నాఁడు గోలకొండ చూపరులకు తోఁచుచుండెను. 'శివాజీమహారాజ్ కు జై' అని ఆతనిచూచుచునే జనులు అఱచుచుండిరి. స్త్రీలందఱును మేడలనుండి పువ్వుల వర్షమును కురిపింపసాగిరి. ఇండ్ల వాకిండ్లలో ముత్తైదువలు హారతు లెత్తుచుండిరి. ఈవైభవమునంతయు చేయించుకొనుచు శివాజీ బదులు తాను బంగారమును వెండిని దారిపొడుగునను వర్షించుచుండెను. హారతులెత్తిన యిండ్లకడ తానే నిలిచి బ్రాహ్మణులచే ఆపళ్లెములలో వరహాలు పోయించుచుండెను. పట్టణములోని పేటల యధికారులు మర్యాద లొనర్చినప్పుడు వారికి శివాజీ ఉడుగరలిచ్చి గౌరవించుచుండెను.

---

## ప్రకరణము ౯ - శివాజీ తానాషాను దర్శించుట

ఊరేగింపు దాద్ మహల్ కడకు వచ్చి నిలిచినది. ఎల్లవారును వారివారిస్థానములలో దిద్దితీర్చినట్లు నిలువఁబడిరి. శివాజీయును అతనియుద్యోగస్థులు ఐదుగురును అక్కన్నమాదన్న

లును గోలకొండప్రధానులు మఱికొందఱును వెంటరాఁగా
నగరులోనికి పోయిరి. అచట నొక ప్రాంగణమున గుఱ్ఱములు
దిగి విశాలమైన యాస్థానమంటపమునకు మాదన్న శివాజీని
తోడ్కొనిపోయెను. అనుచరులు ఒకయడుగు వెనుక రాఁ
దొడఁగిరి. లోన ప్రవేశింపఁగానే తానాషాయును అతని యను
చరులును ఎదురువచ్చిరి. తానాషా శివాజీని కౌఁగిలించుకొని
తన ప్రక్కన రాజోచితమైన రత్నకంబళముమీఁద జలతారంచు
పట్టుదిండ్లకు ఆనుకొనునట్లు కూర్చుండఁబెట్టుకొనెను. సుల్తానును
శివాజీయు కూర్చుండఁగానే సుల్తానుసైగచే వారి ప్రక్కనున్న
మహామాత్యుఁడు మాదన్నయు మహాప్రచండదండనాయ
కుఁడు అక్కన్నయు కూర్చుండిరి. మిగిలినవారందఱును నిలువఁ
బడియే యుండిరి. లోపలనుండి సన్నని కంతలగుండ అంతఃపుర
స్త్రీలు ఈవేడుకలు చూచుచుండిరి. శివాజీ యంతటివాఁడు
ఇంట ప్రవేశించుట యనఁగా నాగుబాము సాధువై మనప్రక్క
వచ్చి కూర్చుండుట వంటిదిగాను, ఆనాగమును అట్లు కొని
వచ్చినమాంత్రికుఁడు మాదన్న యనియు వారు తలంచు
చుండిరి.

మూఁడుగంటలసేపు శివాజీ తానాషాలు గోష్ఠిసలిపిరి.
మొదట పరస్పరము ఆచారోపచారములు కుశలప్రశ్నలు
మొదలైన మామూలు కార్యక్రమము జరిగినది. తర్వాత
శివాజీ కావించిన మహాత్కార్యములను గుఱించియు నాతని
ధైర్యసాహసములనుగుఱించియు సభ్యు లుద్ఘోషించుచుండఁగా

తానాషా ఆనందముతో వినుచుండెను. సభ్యులవర్ణనలకు తని విఁజెందక శివాజీ 'ఈగ్రామదేవతలు సరిగావర్ణింపలేరు' అన్నట్లు తానే వర్ణింపసాగెను. ఎట్లు తాను అప్జల్ ఖానును కడతేర్చి నదియు, ఆతఁడు ద్రోహమెంచిరాఁగా తా నందులకొనర్చిన ప్రతిక్రియయు, తనది ద్రోహము కాదనియు విరివిగా నుద్ఘా టించెను. తర్వాత తానాషా ఔరంగజేబునుగూర్చి ప్రస్తావిం పఁగా శివాజీ, పాదుషా నీచుఁడనియు, తనకు మొగలాయీలు తా మొనర్చిన వాగ్దానాదికములను నెఱవేర్పక అల్పులుగా ప్రవర్తించిరనియు, సభలో తా నెట్లు పాదుషాను ధిక్కరించి వెడలివచ్చినదియు, తర్వాతఖైదును, ఆఖైదునుండి తాను తప్పించుకొనినవిధమును, ఆవచ్చుటలో జరిగిన విశేషములను కథగా చెప్పెను. తర్వాత తాను సూరత్తును కొల్లగొట్టినది యు, దుర్గములను కూల్చినదియు, మొగలాయీవారిని ఏడిపిం చినవిధమును వర్ణించెను. ఆవిధముగా చాలసేపు మాటలాడిన ఛత్రపతికి తానాషా ఆభరణము లొసంగి వస్త్రాదికములిచ్చి గుఱ్ఱములు, ఏనుఁగులు మున్నగు వాహనాదికములిచ్చి విశేష ముగా గౌరవించెను. తానాషా కనుసన్నచే మాదన్నయు అతనియనుచరులును శివాజీ పరివారమునకు తగినమర్యాద లొనర్చిరి. సభ లేవఁగానే తానాషా శివాజీపై అత్తరుపన్నీరు మొదలైన సువాసనలు చల్లి తాంబూల మొసంగి స్వయముగా మెట్లవఱకును వచ్చి విడిదికి సాగనంపెను. శివాజీ విడిదికి పోవుచు మరల మార్గమంతయు డబ్బులు చల్లుచుపోయెను,

అక్కన్న మాదన్నలు శివాజీతోఁ గూడ నాతని విడిదల కేఁగి ఆతని కచట అన్ని యేర్పాటులును చేయించి మరల సాయంకాలము వత్తుమనిపలికి వీడ్కోలిపిరి. తానాషాను వారు వచ్చి మరల దర్శించిరి. శివాజీసందర్శనమునకు అందఱును చాల సంతోషించి మాదన్నను మెచ్చుకొని శివాజీరాయబారిని శ్లాఘించిరి. శివాజీసౌజన్యమునకు తానాషా సంతోషించెను.

ఆమఱునాఁడు అక్కన్న మాదన్నలయింట శివాజికి విందు ఏర్పాటాయెను. వైభవముతో మహామంత్రులు శివాజిని ఆతని ముఖ్యవర్గమును తమ భవనమునకు కొనిపోయిరి. ఆ బ్రాహ్మణగృహమును శివాజీ పావుకోళ్లు లేకయే ప్రవేశించి భానూజీ భాగ్యమ్మలకు సాష్టాంగముగా నమస్కరించి ఆ వృద్ధ దంపతులచేత దీవనల నంది వారికోర్కిమీఁద వారియెదుట వారమర్చిన తివాసిపై కూర్చుండెను. కొంతసేపు భానుమూర్తి పంతులు మహారాష్ట్రభాషలో శివాజిని వినోదించెను. శివాజిని తెచ్చి అతనిచేత తనకు మ్రొక్కించిన కోమాళ్లపై ఆయనకు చెప్పరానిసంతోషము. కొంతసేపైపనతర్వాత భానూజిపంతులు శివాజికి స్నానాదికముల కేర్పాటుచేయించి మడిగా నాతని పూజాగృహమునకు కొనిపోయి ఆశీర్వదించి భగవత్ప్రసాద మిప్పించి, బ్రాహ్మణసంతర్పణ యైనవెనుక భోజనాదికమున కేర్పాటుచేయించెను.

సేవకులు, పరిచారకులు, వంటవాండ్రు శివాజిపరివార మును చూచుకొనుచుండఁగా భానూజీ భాగ్యమ్మలు మర్యా

దకు శివాజికి ముందుభోజన మిడుదుమనిరి. ఆతఁడు వారు ముందుభుజించినగాని తానుభుజింపనని పట్టుపట్టగా విధిలేక తా మెల్లరును శివాజి క్షమను నూర్లపర్యాయము ప్రార్థించి భుజించిరి. తర్వాత శివాజిని కూర్చుండ నియోగించి చెంతకూర్చుండి భానూజి మహారాష్ట్రభాషలో మాటలాడుచుండఁగా భాగ్యమ్మ స్వయముగా పరిచారకులు తెచ్చియిచ్చిన పళ్లెముల నందుకొని వడ్డించెను. అక్కన్నమాదన్నలు తండ్రియెదుట కూర్చుండు వారుకారు; దూరమునుండి వచ్చుచు పోవుచు, నడుమనడుమ తమకుతోఁచిన పడఁడో, లేహ్యమో, మురబ్బాయో తెచ్చి పెట్టుచుండిరి. విశ్వనాథ మృత్యుంజయులు మహారాష్ట్రుల బల గమునంతయు పరికించుచుండిరి.

శివాజి ఈమర్యాదకు పరమానందభరితుఁ డాయెను. భోజనానంతరము తాంబూల చర్వణమైనవెనుక శివాజి ఎల్ల వారికిని రత్నాదికములు భూషలు నిచ్చి బయలుదేరెను. అక్కన్న మాదన్నలు తండ్రిచేత శివాజికి వస్త్రములు ఏనుఁగులు గుఱ్ఱములు మొదలైనవాని నిప్పించిరి. శివాజి ఆ వృద్ధ దంపతులకు సాష్టాంగముగా నమస్కరించి వీడ్కొనెను. అతని యనుచరులును ఆ పార్వతీపరమేశ్వరులకు అర్ఘ్యెచేసి బయలు దేరిరి. మాదన్న మరల మహారాష్ట్రపతిని మర్యాదగా బసలో విడిచివచ్చెను.

ఇంతవరకు శివాజీ మాదన్నలు వ్యవహారవిషయములు మాటలాడలేదు. అబుల్‌హాసన్ తానాషాకు శివాజియందు

చాల స్నేహ మేర్పడెను; పూర్వముండిన జంకు పోయెను. మొగలాయీసామ్రాజ్యమును గడగడలాడించుచున్న ఈ వ్యక్తిని ప్రక్కనపెట్టుకొని కంటితో చూచినాడు, రాక్షసకృత్యము లొనర్చుచున్న మహారాష్ట్రవీరులను సైనికులను మాదన్నయొక్క మంత్రబలముచే ఇంట తెచ్చిపెట్టుకొని చూచినాడు. శివాజి చాల సరసుఁడనియు, సౌజన్యవంతుఁడనియు, మహాసత్త్వుఁడనియు, సైన్యశిక్షణలోను కార్యదీక్షయందును అసామాన్యుఁడనియు తలంచెను. ఆతనిస్నేహముండిన మొగలాయీల భయ మెంతమాత్ర ముండదని నమ్మకము కుదిరెను. మాదన్న రాజనీతిని కొనియాడెను. శివాజి ఏమికోరినను ఒసంగి ఆతనితో సంధిచేసికోవలసినదని మాదన్నను కోరెను. శివాజితో మాదన్న ఆలోచించి ఒక పథకమును కుదుర్చుకొనెను. దక్షిణదేశమును జయించుటకు శివాజికి దినమొకటింటికి మూఁడు వేల హొన్నులు లేదా నాలుగునరలక్ష రూపాయలు నెలనెలకు ఇచ్చునట్లును, తమ సేనాధిపతి (సార్-ఇ.లష్కర్) యైన మీర్జా మహమ్మద్ అమీన్ అనునతనినాయకత్వమున వేయిగుఱ్ఱపు దండును నాలుగువేల కాల్బలమును పంపునట్లును ఒప్పుకొనెను. కొంత తుపాకులు ఫిరంగులు వానికి కావలసిన మందుసామానులు, ఒప్పుకొన్న ద్రవ్యములో కొన్నినెలలది ముందుగానే ఖర్చులకు ఇచ్చుటకుకూడ ఒప్పుకొనెను. ఈసహాయమునకు బదులుగా శివాజి దక్షిణదేశమును జయించి తనతండ్రియైన షాజికి చెందనిభాగముల నన్నిఁటిని గోలకొండవారి కిచ్చునట్లు

ను, పూర్వము తనతండ్రి పాలించుచుండిన ప్రదేశములను తా నుంచుకొనునట్లును వాగ్దాన మొనర్చెను. మొగలాయీలవలన గోలకొండకు ఎట్టి యుపద్రవమును తాను రానీయనని శివాజి తానాషా ఎదుట ప్రమాణము చేసెను. తానాషాయును పై యుద్ధద్రవ్యముగాక రక్షణవిధానమునకుగాను సంవత్సరము నకు శివాజికి లక్షహొన్నులిచ్చునట్లును మహారాష్ట్రుల రాయ బారి నొకనిని తనయాస్థానమం దుంచుకొనుటకును ప్రమాణ పూర్వకముగా నొప్పుకొనెను.

శివాజి గోలకొండలో ఒకనెలదినము లుండెను. ఈనెల యంతయు ఊరిలో నుత్సవములు జరుగుచునేయుండినవి. శివా జికి తానాషా రెండుపర్యాయములు దర్శన మొసంగెను. వ్యవ హారములనుగుఱించి మాదన్నయే మాటలాడుచుండెను. మరల దర్శన మిచ్చినప్పుడు మరల విస్తారము అనర్ఘ్యవస్తువిశేషము లను తానాషా శివాజి కొసంగెను. తానాషా తనసౌధమున పైన కూర్చుండి ప్రక్కన శివాజిని కూర్చుండబెట్టుకొని ప్రజ లకు దర్శనమిచ్చెను. తానాషాయొక్క మంత్రులు సేనాధి పతులుమొదలు సామాన్యసైనికులవఱకు అందఱును రాజ వందన మొనర్చిరి. వెంటనే మహారాష్ట్రులును అట్లే తానాషా కును శివాజికిని వందన మాచరించిరి. తానాషా మహారాష్ట్ర సైన్యమునకును అధికారులకును సత్కార మొనర్చెను. ఈ వైభవమంతయు నైనవెనుక తానాషా శివాజి గుఱ్ఱముమెడలో వెలలేని వజ్రహారమునువైచి చాలమర్యాదచేసెను. హైదరా

బాదులోని ప్రభువులందఱును ఆదినము శివాజీకిని ఆతనిబృందమునకును విందొనర్చిరి. విందైనవెంటనే తానాషాకు మహారాష్ట్రవీరుల శౌర్య బలాదికములను చూపనెంచి శివాజీ యశాజికంకు అనువానిని ఏనుఁగుతో పోరాడుమనెను. గోలకొండవారి ఏనుఁగులలోని యుత్తమ మత్తేభమును తానాషా తెప్పించెను. ఆవీరుఁడు కత్తితో నాయేనుఁగుతో కొన్నిగంటలు పోరి దానికి రోషముపుట్టించి తుదకు దానితొండమును నఱికి తఱుమఁగొట్టెను.

తానాషా — శివాజీ అన్నగారూ, మీయొద్ద ఎన్ని గొప్ప ఏనుఁగులు ఉన్నవి ?

శివాజీ — తానాషాసుల్తాన్‌భాయి వీరందఱును మాయేనుఁగులే.

అని తనవీరులనుచూపి సుల్తానును నవ్వించెను.

---

## ప్రకరణము ౧౦ ఆశాభంగము

శివాజీ గోలకొండనుండి వెడలిపోయెను. వెంటనే ఈ విషయమంతయు మొగలాయీవారికి తెలిసిపోయెను. ఔరంగజేబు చాలమండిపడి బహదుర్‌షా అనువానిని అధికారమునుండి తొలఁగించి అతనిస్థానమున దిలిరుఖానువానిని నియమించెను. దిలిర్‌ఖాను గోలకొండమీఁదికి దాడివెడలెను. మాన్యఖేటము కడ (మాల్‌ఖేడ్) గోలకొండవారి సైన్యము మొగలాయీ

వారిని ఎదుర్కొని సులువుగా ధ్వంసము చేసినది. అదేసందర్భమున మొగలాయీలబలము తగ్గినదని గ్రహించి దత్తాజీ యను మహారాష్ట్ర సేనాపతి, గృహరక్షణకై శివాజిచే నిలుపఁబడినవాఁడు. కనరాపైకి దాడి వెడలి హుబ్బళిపట్టణమును కొల్లగొట్టెను.

గోలకొండనుండి బయలుదేరిన ఛత్రపతి, ఆంగ్లేయులు ఇటీవల కర్ణాటకమని పేర్కొన్న మదరాసురాజ్యమును ప్రవేశించెను. ఈప్రదేశమున దాదాఁపు నూఱుకోటలు గలవు. అందు చెంచి (జింజి) వేలూరులు ప్రధానములు. శివాజీ 1677-78 సంవత్సరములనడుమ జయించిన భాగము సంవత్సరమునకు ఇరువదిలక్షలహొన్నుల యాదాయముగలదిగా నుండెను. ఈ దేశమును అతఁడు మూలమట్టముగ దోఁచుకొనెను. ఇట్లు దాహశాంతి యైనంతట ఆప్రదేశములలో తనసిబ్బందిని కాపుంచి అతఁడు మైసూరు, కొప్ప, గదగు, ధార్వారు బెలగాములను జయించెను.

ఇప్పుడు శివాజీ గోలకొండవారికి కృతజ్ఞత తెలుపుచు ఒప్పందమును నెఱవేర్పవలసియుండెను. కాని అతఁడు ఆప్రకారము చేయలేదు. మాదన్నకును తానాషాకును ఆశాభంగమాయెను. గొప్పవారికి ఎట్టివారికైనను ఒకలోటుండును; అది రాజనీతి కానిండు లోకనీతి కానిండు. శివాజీ తనతోడిహిందువునకే మాటతప్పెను. తనప్రక్కనుండు దక్కనురాజ్యములలో నొకదానినే మోసముచేసెను, ఇంతవఱకు మాదన్న నిర్మించిన

నీతి పునాదిలేని సౌధమువలె నేలఁగూలెను. తానాషా శివాజీ శీలమును చక్కఁగా నెఱింగెను. శివాజీకి దక్షిణదిగ్విజయమునకు వలసినద్రవ్యమును వస్తువులను తానొసంగియుండియు గోలకొండలో తానును తనమంత్రులును వజీర్లును అట్లు మర్యాద చేసియుండియు దక్షిణదిగ్విజయమున శివాజి తనతండ్రికి పూర్వము చెందని రాజ్యములను తానాషాకు తానిచ్చుటకు ఒప్పుకొనియుండియు తుదకు ఇట్లు గోష్పాదమంత భూమిరైయిన నీయక పూర్తిగా ఏమియునెఱుఁగని యట్లుండుట ఎల్లవారికిని ఆశ్చర్యకరముగానుండఁగా తానాషాకును అక్కన్న మాదన్నలకును ఆశ్చర్యమగుటలో నాశ్చర్యము లేదు. తాను జయించిన కోటలలో నొకటిగాని, తానుగ్రహించిన ధనములో కొంత మరలగాని, తాను కొల్లగొట్టినదానిలో కొంతరైయినను గాని ఇచ్చుట, ఏదియు శివాజి తలపెట్టలేదు. దోఁచిన ధనమంతయు తానే గ్రహించెను; ఆక్రమించిన భూమినంతయు తనయధీనమందే యుంచుకొనెను. అధికారమంతయు తానే చెల్లించుకొనుచుండెను. జగడమాడు భార్యలు, చెప్పినమాట విననికుమారుఁడు, నిర్వహింపవలసిన కార్యభారము అపారముగానుండుట–వీనిచే శివాజీమాట నిలుపుకొన లేకపోయెననుట ఇందులకు చాలిన సమాధానముగా కనఁబడదు.

గోరుచుట్టుపై రోఁకటిపోటుగా శివాజీ మఱియొక ఎత్తు ఎత్తెను; లంచములిచ్చి బిజాపురమును స్వాధీనము చేసికొన యత్నములు చేయసాగెను. ఇప్పుడు బిజాపురములో సిద్ది

మసూద్ అనునతఁడు క్రొత్తమంత్రి. ఇతఁడు శివాజీప్రయత్న ములను ప్రతిఘటించెను. తానాషాకు శివాజి క్రొత్తయెత్తులు దుస్సహములుగ నుండెను. మాదన్న బిజాపురమునకు సాయము చేయఁదలంచి సిద్దిమసూదునకును అతని బిజాపురశత్రువుల కును సంధిగావింప నారంభించెను. అంతఃకలహములు అడఁగిన యెడల శివాజీయిచ్చెడు లంచము లేమిచేయఁగలవు? బిజాపూరు వారు సైన్యమునకు జీతము లీయలేకుండినందున వారు తిరుగఁ బడునట్లుండిరి. మాదన్న ఆలోచించెను. ఆజీతములను గోల కొండనుండి తానాషాచేత నిప్పించి సైన్యమును సిద్దిమసూదు నకు అనుకూలముగ చేసి సైనికుల తిరుగుబాటు తప్పించుట కును శివాజీని కొంకణమునుండి వెలికి రానీయకుండుటకు శివాజీ మీఁదికి బిజాపురమువారు దండెత్తుటకును కావలసినంత ధన సహాయము చేయుటకు వాగ్దానము చేసెను. ఈ యుపాయము మీఁద ఆడిల్ షాహీసర్దారులు ఇరువదియైదువేల గుఱ్ఱపుదళ ముతో లెక్కలేని కాల్బలముతోను శివాజీమీఁదికి తయారగు చుండిరి.

కాని ఇంతలో పరిస్థితులు మాఱినవి. మొగలాయీ సేనాధిపతి యెత్తులవలన మాదన్న ప్రయత్నము నెఱవేఱలేదు. దిలిరుఖాను మొగలాయీ సేనాధిపతి. ఇతఁడు బిజాపురమును ఓడించి 1677 నవంబరులో సిద్దిమసూదునకు చాల యవమాన కరమగువిధమున సంధిచేసికొనెను. తనయూరిలో అంతఃకలహ ములు, ఆఫ్ఘనుసిఫాయీలు ప్రతిదినమును జీతము లడుగుచు

తిరుగుబాట్లు జేయుచుండుట, ఒకవైపు రాజ్యములో శివాజీ కొల్లగొట్టుచుండుట - వీనిచేత ఎల్లవారును తన్ను దూషించుచుండఁగా సిద్దిమసూదు చాల చీకాకుపడియుండెను. ఖజానా ఖాళీగానుండెను. ఇట్టిసందర్భములలో శివాజీతో సంధిచేసికొనుట మేలని అతఁడు తలంచెనుగాని దిలిరుఖాను అట్టిచర్య అనవసరమనియు మహారాష్ట్రులను శిక్షించుటకు మొగలాయీ సైన్యము సిద్ధముగా నున్నదనియు ధైర్య మొసంగెను. కాని దేశముండిన సంక్షోభములో సిద్దిమసూదు దిలిరుఖానునకు తెలియనీయక శివాజీకి జాబువ్రాసెను. "మనము ఇరుగుపొరుగువారము. మొగలాయీలు మన కుభయులకును శత్రువులు. మన మిరువురునుకలసి వారిని తఱుమవలెను" - అని.

ఈవిషయము తెలియఁగానే దిలిరుఖాను చాల కోపపడెను. బిజాపురముమీఁదికి దండెత్తెను. ఈకాలమున నొక విశేషము జరిగినది. శివాజీకొమారుఁడు శంభూజీ తండ్రికి లోఁబడక వ్యర్థుఁడుగా నుండెను. నీతిరహితుఁడై తిరుగుచుండెను. శివాజీ అతనిని పన్హాలాకోటలో ఖైదుచేయఁగా తప్పించుకొనివచ్చి మొగలాయీవారితో చేరెను. దిలిరుఖాను పరమానందభరితుఁడై శంభుజీని సప్తహజారి మన్సబ్దార్ గావించి, ఏనుఁగుతో బహుమానించి ఔరంగజేబుచే సత్కరింపించెను. ఇప్పుడు బిజాపురమును ముట్టడించుటకు దిలిరుఖాను చేయు ప్రయత్నములు తీవ్రము లయ్యెను.

తత్క్షణమే సిద్దిమసూదు శివాజీని సహాయము కోరెను. శివాజి వెంటనే ఆఱు ఏడువేల గుఱ్ఱపుదండును బిజాపుర రక్షణకు పంపెను. కాని మసూదునకు మహారాష్ట్రులయందు నమ్మకము తగ్గసాగెను. మహారాష్ట్రులు కొంతవఱకు స్నేహము గానేయుండి తమ ద్రోహబుద్ధిని చూపఁగానే మసూదు వారిని దూరమందుంచెను. వెంటనే శివాజియాజ్ఞచే వారు దోఁచుటకు ప్రారంభించిరిగాని తుపాకిదెబ్బకు వారినాయకుఁ డొకఁడు చచ్చుటచే వారు వెంటనే పాఱిపోయిరి. బిజాపూరువారు మొగలాయీలతో సంధి చేసికొనిరి.

మొగలాయీలు ఊరకొనలేదు. మరల 1679 లో వారు బిజాపూరుమీఁదికి దండెత్తిరి. సిద్దిమసూదు మరల శివాజీనే ప్రార్థించెను. శివాజీ సహాయము పంపెను. మొగలాయీలు పట్టువదలక ఆక్రమించుచు బిజాపురమును మెల్లమెల్లగా సమీపించుచుండిరి. కాని శివాజీసాయముచేతను బిజాపూరువారి మొండిపట్టుచేతను మొగలాయీలకు విజయము కలుగలేదు. తర్వాత శివాజీ ఎక్కువకాలము బ్రదుకలేదు. సయ్యద్ జాఫర్ మహమ్మద్ అను సన్న్యాసియొక్క శాపముచేతనో లేక ఆయుర్దాయము లేనందువలననో శివాజీ 1680 ఏప్రిలు 5, ఆదివారమునాఁడు మరణించెను. తర్వాత శంభుజీ రాజారాములకు రాజ్యముకై స్పర్ధకలిగి తుదకు శంభువు 1680 సం॥ జూలై నెల రాజాయెను గాని 16 జనవరి 1681లోనే ఆతనికి పట్టాభిషేకము జరిగినది. ఈకాలమునకు సరిగా మొగలాయీలకు రాజపుత్రు

లతో పోరాట మేర్పడినది. బలవంతులైన మొగలాయీసేనాపతు లెవరును దక్కనులో లేరు. ఈలోపల పాదుషాకుమారుఁడు అక్బరనువాఁడు తిరుగఁబడి శంభుజీ అండఁజొచ్చెను. మహారాష్ట్రులను శిక్షించుటకు ఔరంగజేబు చేసినప్రయత్నములు ఏవియు కొనసాగవయ్యెను.

తనకొమారుఁడు అక్బరు శంభుజీకడ నున్నాఁడని తెలియఁగానే ఔరంగజేబు రాజపుత్రులతో సంధి కుదుర్చుకొని 1681లో దక్షిణమునకు వచ్చెను. అప్పటికి శంభువొకఁడే ఆతనికి శత్రువు. బిజాపురముమీఁదికిగాని గోలకొండమీఁదికిగాని దాడివెడలునుద్దేశ మాతని కింకను లేదు. శంభుజీమీఁదియుద్ధమున తనకు సాయపడవలసినదని బిజాపురి సర్దారులను పాదుషా కోరెనుగాని వారెవరును రాలేదు. శంభుజీతో ఆడిల్‌షా స్నేహముగానేయుండెను. శంభువునకు బిజాపురమువారి సాయము రాకుండుటకై పాదుషా తనసైన్యమును విభజించి ఇరువురమీఁదికిని 1682లో పంపెనుగాని ఫలింపలేదు. 1683లో పాదుషా అహామద్‌నగరమునకు వచ్చెను. ఆసంవత్సరమే మహామంత్రి సిద్దిమసూదు తమరాజ్యములోని అంతఃకలహములకు విసిగి తనయుద్యోగమును వదలుకొని ఆదవానిలో తనకోటలో ప్రవేశించెను.

# ప్రకరణము ౧౧ - పాదుషా ప్రయత్నములు

అక్కన్న మాదన్నల యధికారమునకు గోలకొండలో నడ్డులేదు. తానాషాసుల్తాను వారికి స్వాధీనుఁడు, వారి చేతి లోని కీలుబొమ్మయని ప్రజలు వాకొనుచుండిరి. పైకట్లే తోఁచును. ఏలయన సకలవిషయములును ఈ మంత్రులచేతులలో నుండెను. సుల్తాను వారినడుగక ఏదియు చేయఁడు. అంతమాత్రమేగాదు తనతో వారేదిచెప్పినను ఒప్పుకొనును. వారి యందు అతనికి అట్టినమ్మకము కుదిరినది. మొదట వారు మూసా ముజఫరులను తొలఁగించి అతనికి సాయముచేసిననాటినుండి పెత్తనమంతయు వారిదే. తొలుత కృతజ్ఞతతో ప్రారంభమైన నమ్మకము స్నేహముగా మారినది. అక్కన్నమాదన్నలు మహమ్మదీయులు గాకపోయినను దైవభక్తిగలవారనియు రాజసేవాసక్తులనియు ద్రోహులెంతమాత్రము కారనియు నాతఁడెఱుఁగును.

ఔరంగజేబుపాదుషా ఎట్లైనను గోలకొండరాజ్యమును ఆక్రమింపఁ దలంచియుండెను. తానాషాపై నేదైన నిందారోపణ చేసినగాని తోడిమహమ్మదీయులు తనచర్య నొప్పరని దోషములు కల్పింపసాగెను. తానాషా విషయాసక్తుఁడని యు నిరంతరము అంతఃపురములోనే కాలము గడపుచుండు ననియు, తనస్త్రాగుడు నిరంతరాయముగ జరుగుటయే ఆతనికి ప్రధానమనియు ప్రచారము చేయసాగెను. గోలకొండలోని

తనస్థానాధిపతికి వ్రాసిన యొకజాబులో నీవాక్యము లుండినవి. "వీఁడు (తానాషా) దురదృష్టవంతుఁడు. ఒక కాఫిరువాని (మాదన్న) చేతిలో రాజ్యమునువదలి గొప్పగొప్పసయ్యదులను, షేకులను, పండితులను వానికి లోఁబఱిచియున్నాఁడు. ప్రత్యక్షముగా సకలపాపములను చేయుచున్నాఁడు... ఇస్లామునకును కాపిర్లమతమునకు భేదము తెలియకయున్నాఁడు. ఆకాఫిరు శంభువు (శంభాజీ) నకు లక్షహోన్నుల నిచ్చినాఁడు. నాస్తికులతోనే వీనికి స్నేహము. భగవంతుని నియమముల నుల్లంఘించి దేవమానవులకు దూరమై పోవుచున్నాఁడుగదా!"

కాని వాస్తవముచూడఁగా తానాషామహాత్ముఁడు. తండ్రి మరణానంతరము పదునాలుగేండ్లు ఒకమహాత్ముని పరిచర్య చేసియుండెను. ఇప్పటికిని ఆయనను దర్శించుచుండును. సత్పాత్రమందు రాజ్యమునుంచి వేదాంతగోష్ఠియందు కాలము గడపుచుండెనుగదా. కాని రాజకార్యములలో అప్రమత్తుఁడై స్వయముగా నన్నిటిని గ్రహించుచు సమయము దొరకినపుడెల్ల ఉర్దూ పారసీభాషలలో కవిత్వము చేయుచు నుండెను.

ఇట్టిసందర్భమున దక్షిణరాజ్యములకు మొగలాయీల వలనిబాధ తప్పదని తలఁచి గోలకొండమాదన్నపంతులు మహారాష్ట్రులతోను బిజాపురీయులతోను సఖ్యమే చేయుచుండెను. ఎట్లును బిజాపురమునకు గోలకొండవారిసాయము తప్పదని ఢిల్లీ పాదుషా 'ఎంతమాత్రమును బిజాపురమునకు సాయపడవలదు; పడితివా నీకును అంత్యకాలము సమీపించును.' అని తానా

షాకు రాయబార మంపెను. కాని 1684 లో సికందర్ ఆడిల్ షా గోలకొండవారిసహాయ మపేక్షించెను. సికందర్ పదునాల్గేండ్ల బాలుఁడని తానాషా ఆతనిపై కనికరము వహించియుండెను. దక్షిణరాజ్యములన్నియు కలసియుండుట మంచిదని మాదన్న, పదివేలసైన్యమును సికందరుకు సాయముపంపుటకు ఒప్పుకొనెను; అట్లే శంభుజీని పంపవలసినదని కోరుచు జాబువ్రాసెను. మఱియొకజాబులో నలబదివేలసైన్యమును తాను పంపునట్లును తాము రెండువైపులను మొగలాయీలను కొట్టవలయుననియు వ్రాసియుండెను. ఈజాబు ఔరంగజేబుయొక్క వేగులవాండ్ర చేతపడినది. వెంటనే పాదుషా హైదరాబాదుమీఁదికి దండు పంపెను. కాని బిజాపురమువారికి గోలకొండవారి సాయము ఎట్లును అందిపోయినది.

పాదుషా ఉపాయాంతరములు వెదుకసాగెను. ప్రస్తుత పరిస్థితులలో గోలకొండను పీడించి ధనము పిదుకుకొనుటయే దానిని స్వాధీనము చేసికొనుటకన్న మేలని తలంచెను. హైదరాబాదులోని మొఁగలాయీ స్థానాధిపతి గోలకొండ సుల్తాను మీఁదను జనులమీఁదను అధికారము చలాయించుచు, వారిని తిరస్కరించుచుండినను వారు సాయుధులై తిరుగఁబడునంత వఱకు రానీయక వ్యవహరించుచుండెను. ఇందులకై ఔరంగజేబు కావలయుననియే మీర్జామహమ్మద్ అను నొకదయారహితుని, నిష్ఠురాలాపుని, అతికర్కశుని పంపియుండెను. అతనికి పాదుషా పెట్టినపని నిరంతరము కఠినముగా మాటలాడుచు

ఏదోసాకుమీఁద గోలకొండసుల్తానునకు కోపము తెప్పించి, ఘర్షణకు లాగి, ఆమీఁద గోలకొండపై దండెత్తుట కొకనెపము కల్పించుటయే. తనరాయబారిని గోలకొండకుపంపుచు ఔరంగజేబు ఇట్లు చెప్పియుండెను. "నేను నిన్ను గోలకొండకుపంపుట అచటినుండి నీవు రెండు పనికిరాని రాతిముక్కలను తేవలయునని కాదు. (వాస్తవముగా తానాషాకడ రెండు గొప్పవజ్రములుండినవి) అవి నాకులక్ష్యములేదు. నీవు తానాషాను సంతోషపెట్టవలయుననియు గాదు. నిర్లక్ష్యముగా వానితో మాటలాడుచు ఘర్షణకు దిగుము. అందుచేత నాతఁడు కోపముతెచ్చుకొని నిన్ను తిరస్కరించినయెడల వాని నుచ్చాటన చేయుటకు నాకు అవకాశము దొరకును. సాధ్యమైనంతవఱకు వానితో జగడమువేయుము. సభలోగాని ఏకాంతమునగాని వానిని మర్యాదగా చూడకుము."

తానాషా మహామేధావి. శత్రురాయబారియొక్కయభిప్రాయమును గ్రహించి అతఁడేమిచేసినను ఆగ్రహింపక యుద్ధమునకుగాని మనస్తాపమునకుగాని ఎట్టియవకాశమును రానీయక మెలఁగుచుండెను. ఔరంగజేబు పంపిన గోలకొండలోని మొగలాయీ రాయబారి సర్వస్వతంత్రుఁడైన ప్రభువువలె వ్యవహరించుచు, నిరంకుశముగా ఆజ్ఞలు, నిర్గమనపత్రములు, శాసనములు వ్రాయుచుండుటయేగాక జనులను మిక్కిలి పీడించుచుండెను.

ఒకనాఁడు అక్కన్న తమయింటిమేడమీఁద నిలువఁబడి వీథివైపు చూచుచుండఁగా దూరమున నొకపల్లకి ఎవరిదో వచ్చుచుండెను. అది పెద్దపల్లకి. దానినిమోయువారు దాదాఁపు పదునాలుగు రుండిరి. వారి వెనుకను ముందును కొంత సిబ్బంది. వారు 'ఓంభాయి' అని అఱచుశబ్దము చాలదూరము వినవచ్చుచుండెను. అక్కన్న ఆవైపే చుఱచుఱ చూడసాగెను. ఆవీథిలో నెవరిసవారిగాని వైభవమున పోరాదు. మహామంత్రియు మహాసేనాధిపతియు నివసించు గృహాముముందు వారితో సమానవైభవము ప్రకటించుటకు ఎవరికిని అధికారములేదు. మీఁద మిక్కిలి ఎక్కువగాచూపుట ఇంకను ధిక్కారమగును. అక్కన్నకు ఈ పల్లకీవైభవమును చూడఁగానే ఎవఁడో తమ్ము ధిక్కరించునంతటివాఁడు వచ్చుచున్నాఁడని తోఁచినది. ఆతఁడు ఎవఁడుగానుండునాయని ఆలోచించునంతటినెమ్మది అక్కన్నకులేదు. వెంటనే ఆబోయలను నిలుపుఁడని తనసేవకులకు ఆజ్ఞాపించెను. తటాలున మంత్రులసేవకులు ఆ బోయలను అడ్డగించిరి. మాటలును, తిట్లును, పోరాటము నైనవి. మంత్రులపటాలము అక్కన్నచూపులో పల్లకిని చించి చెండాడిరి.

ఇదంతయు మాదన్న ఎఱుఁగఁడు. లోన నేదో పనిలో నుండి తటాలున వెలుపలికి వచ్చిచూచెను. ఆతని కేదో తోఁచినది. ఆపల్లకీలోనివాఁ డెవఁడు! అత్తిమత్తరాయఁడు; ఢిల్లీ పాదుషాయొక్క ఆంతరంగికనివేదకుఁడు. ఆకాలమున పాదుషా

సకలవృత్తాంతమును రహస్యనివేదకుల మూలమున గ్రహించు చుండెను. పాదుషాకు ఎవరియందును నమ్మకము లేదు, తన కొమారులనే నమ్మడు. తనరాయబారిమీద ఈనివేదకుడు వేగు. రాయబారికి ఈతడన్న హడలు, ఏమియభిప్రాయునో తన్ను గుఱించియన్న భయము. పాదుషాకు వేగులపై వేగులుండిరి. అట్టివానికి కోపమువచ్చినయెడల అది ఎంత ప్రమాదకరమో ఊహింప శక్యమా! ఆతని శాంతింపజేయుటకు మాదన్న చాల ప్రయత్నించెను. 'ఆ! ఆ! ఎంతపని! ఎంతపని! ఎవరురా ఈపని చేసినవారు' అని బంట్లనుతఱిమి, అన్నను చూచి 'ఏమన్నయ్యా, ఈవిధముగా జరిగినది. వీరిని నీవు చూడలేదా?' అని అనుచునే ఆయనను చాలమర్యాదగా లోనికి కొనివచ్చి చాలక్షమాపణ కోరుచు, మర్యాదచేయించెను. అక్కన్న తమ్ముని భావము గ్రహించి, ఇది సిబ్బందిదోషమనియు, తనకు తెలియకపోయిన దనియు చెప్పి తానును మన్ననకోరెను. అత్తిమత్తరాయఁడు 'ఏమియు పరవాలేదు' అనెనేగాని ఆతనిహృదయమున క్రోధానలము ప్రజ్వలించుట మాదన్న చూడకపోలేదు. మెల్లగా మర్యాదలతో తమపల్లకీలో కూర్చుండఁబెట్టి సాగనంపెను.

ఈగందరగోళమైన నాటిరాత్రి మాదన్నకు చాలసేపు నిదురరాలేదు. ఉదయమున జరిగినదానినే చాలసేపు తలపోయుచు అక్కన్న తొందరపాటునకు చింతించుచు ఇందేదో అనిష్టమున్నదని భయపడుచుండెను. సగమురాత్రి గడచినతర్వాత ఆతనికి నిదురపట్టినది. స్వప్నమున మహాలక్ష్మి దర్శనమిచ్చినది.

'మాదన్నా నేను మీయింట అడుగుపెట్టి పదునొకండుసంవత్సరములు. ఇక నొకసంవత్సరము పూర్తియగులోపలనే నేను మిమ్ము విడిచి పోవుచున్నాను.' అని దేవి చెప్పినది. మాదన్న మేలుకొనెను. ఆనిముసమందే అక్కనయు అదేస్వప్నముఁ గని మేల్కనెను. సోదరు లిరువురును కలియఁబలికికొనిరి. మాదన్న వెంటనే ఇట్లనెను. 'అన్నా, తెలిసిపోయినది. మన భాగ్యదేవత మనలను వదలిపోవుదినములు వచ్చినవి. అందుచేతనే మన బుద్ధులు ఆవిధముగా మాఱినవి. కానీ, దైవగతి'. తర్వాత వారిరువురును నిదురపోక ఉదయము తలిదండ్రులకు ఈవిషయమును తెలిపిరి. తండ్రి 'భగవదాయత్తము' అనెను. నాఁడు అంతఱును కలసి గ్రహశాంతులుచేసి దానధర్మములు చేసిరి.

మాదన్న తనపదవికి అంతము సమీపించుచున్నదని నిశ్చయించుకొనెను. ఇఁకను మిగిలియుండు నీకాలమును సద్వినియోగము చేయనెంచెను. భావికాలమునకు జాగరూకత వహించుటగా, కోయిలకొండ, హసనాబాదు, రాజగోపాలపేట అనుమూఁడుపర్గణాలను తనసోదరులు విశ్వనాథ మృత్యుంజయులకును తన తల్లిదండ్రులకును ఇప్పించెను. వెంటనే వారిని గోలకొండనుండి పదిలముగానుండు ప్రదేశములకు పంపెను. తనబంధువుల కనేకులకు భూదానములు చేసెను.

ఆదినము అక్కన్న తనపల్లకి నాశనము చేసినది మొదలు అత్తిమత్తరావు (ఆదిత్యమూర్తిరావు) అక్కన్న మాదన్నల మీఁద గంటు వహించియుండెను. మాదన్న ఇది గ్రహించి, ఆ

దినము తాను అతనిని మర్యాదగా పంపినది చాలదని మరల నొకమారు ఆతనియింటి కేగెను. మరల క్షమాపణ ప్రార్థించెను. ఆదినము చాలపొరపాటు జరిగినదనియు, ఆపల్లకీ ఎవరిదోయని అక్కన్న తలంచెననియు నానావిధముల చెప్పి ఆతని హృదయమును రంజింపఁజూచెను. తనకుతోఁచిన బహుమతుల నెన్నిటినో ఇచ్చెను. కాని వాని నాతఁడుగ్రహింపలేదు. తాను ఆవిషయమును అప్పుడే మఱచిపోయితి ననెను. ఆతఁడు నవ్వుచునేయుండెనుగాని అది తెచ్చికోలునవ్వు, వికారముగా నుండెను. ఆతనిహృదయమున క్రోధానలము ప్రజ్వరిల్లుచుండెనేగాని ఆఱలేదు. "అక్కన్నగారు ఆవిధముగా ప్రవర్తించినందువలన వారికే మానభంగముగాని నాకేమికొదువ. వారిగౌరవము పోయినదిగాని నాకేమిపోయినది. దీనినిగుఱించి మీరేమియు అనుకొనవలదు." అని ఈతీరుననే మాటలాడుచుండెను. మాదన్న ప్రయోజనములేదని తలంచి వెడలిపోయెను.

---

## ప్రకరణము ౧౨ - మొగలాయీలతో ఘర్షణ

బిజాపురమునకు సాయము చేసినందులకు తానాషామీఁదికి పాదుషా దండు పంపెనని ముందుప్రకరణమున గ్రహించితిమిగదా. క్రీ. శ. 1680 సం. జూన్‌నెల 28 తారీఖున తన కుమారుని షాఆలం అనువానిని గొప్పసైన్యముతో హైదరాబాదుమీఁదికి పంపెను, మార్గమున 'ఇండి' అను ప్రదేశమున

కొపున్నటువంటి ఖానీజహాను అనువానిని రాజకుమారునితో కలసికొనవలసినదని ఆజ్ఞాపించెను. ఈ వ్యూహముచేత బిజాపురమును ముట్టడించు బలములుతగ్గినను తానాషాను దండించుటకు పాదుషా తనసైన్యమును విడదీసెను.

మొగలాయీసైన్యములు భీమానదీతీరమున ఆగ్నేయముగా నడచినవి. గుల్బర్గా షోలాపూరులనడిమి డెబ్బదిమైళ్లు మొగలాయీల స్వాధీనమున నున్నందున సులువుగా నడక సాగెను. తర్వాత మందగించెను. ముందుపోవుసైన్యమును నడపుచు ఖానీజహాను మాఖేడుకోటను సమీపించెను. రాజకుమారుఁడు మూఁడు నాలుగు ప్రయాణములు వెనుకఁబడి వచ్చుచుండెను. రెండుసైన్యములకును నడుమ 25 మైళ్ల దూరముండెను. సేనాముఖరక్షకముగా నొకసైన్యమును నడుపుచు జాఁనిసార్ ఖాఁ అను నతఁడు ముందుపోవుచుండెను. ఈసైన్యము మాన్యఖేటమునకు తూర్పుగా ఎనిమిది మైళ్లదూరముననుండు 'సెడం' అను ప్రదేశమునకు రాఁగానే గోలకొండవారిసైన్యము, (నలుబది వేలు మొదలు డెబ్బదివేలవఱకు నుండవచ్చును) మొగలాయీలను ఎదుర్కొనెను. గోలకొండవారి సేనాపతులు మీర్ మహమ్మద్ ఇబ్రహీం, షేక్ మిఁహాజ్, మాదన్నపంతులుగారి మేనల్లుఁడు రూస్తుంరావు అనువారలు. గోలకొండవారి గుఱ్ఱపు దళము మొగలాయీవారిని చుట్టవేసికొనినది. అతికష్టము మీఁద పోరాడి మొగలాయీలు దీనిని జయించినను వారిపురోగమనము భంగమైనది. జాఁనిసార్ ఖాను మాన్యఖేటమునకు

మరలి అచటినుండి యుద్ధముచేయ నారంభించెను. గోలకొండ సైన్యములు తమ యనుకూలములను చూచుకొని అనుదినము శత్రువులను కొట్టుచుండినవి. గోలకొండసైన్యములు గొప్పవగుటచే ఖానీజహాను తన స్కంధావారముచుట్టును ప్రాకారము లేర్పఱచుకొనుచు మాన్యఖేటముననే యుండి ముట్టడింపఁబడినవానివలె నాయెను. శత్రువుల నెదుర్కొని యుద్ధము చేయుట కష్టమని ఆతఁడు దుర్గము నిర్మించుకొని ఆత్మరక్షణ ప్రయత్నములు చేయసాగెను. ఒకయడుగైనను ముందునకు సాగుటకు లేకుండెను. తర్వాత కొంతకాలమునకు చక్రవర్తి కుమారుఁడు షాఆలం వచ్చిచేరెను. ఇంతలో యుద్ధతీవ్రత తగ్గెను. తానాషావచ్చి ఢిల్లీపాదుషాకు పాదాక్రాంతుఁడైన యెడల తా నాయనకుచెప్పి తానాషాను క్షమింపింతునని షా ఆలం రాయబారము పంపెను. విజయము తమదై యుండుటచే ఈమాటలను తెలంగాణమువారు పరిహసించి తిరస్కరించి వేసిరి. ఉత్తరప్రత్యుత్తరములతో కొంతకాలము గడచెను.

మొగలాయీలు మాన్యఖేటమున తమ సామానులను చేర్చుకొని తమ సేనాముఖమును ఖానీజహాను నేతృత్వమున హైదరాబాదునకు మార్గము కనిపట్టుటకు పంపిరి. ఈసైన్యమునకు మూఁడింతలసైన్యమువచ్చి ఎదుర్కొనెను. మొగలుసైన్యములో హిమ్మత్‌ఖాను, సయ్యద్ అబ్దుల్లాఖాన్ అను వారల క్రింద సైన్యములు మొండిపట్టుపట్టి పోరాడుచు ప్రతిదినము సాయంకాల మగుసరికి గోలకొండవారిని జయించుచుండినవి.

గోలకొండసైన్యములో బారిఖాఁ అనువాఁడు. తుపాకితో గుఱిగాఁగొట్టినట్లు బాణితోఁగొట్టు నేర్పుగలవాఁడు, ఖానీజహానును ఎదుర్కొనెను. కాని ఎచటనుండియో శత్రువులు కొట్టిన బాణమునకు కూలిపోయెను. ఒకపర్యాయము మొగలాయీవారు తామోడిపోవుటకు సిద్ధముగానుండు సమయమున రాజా రామసింగ్ అనువాని యేనుఁగును ఉసికొల్పి శత్రువుల నడిమికి త్రోలిరి. అది తనదంతములకు కట్టియుండిన మూఁడుమణుగుల బరువుగల ఇనుపగొలుసును ఇటునటుకొట్టుచు పరుగిడి తటాలున రాఁగా గోలకొండవారి గుఱ్ఱములు బెదరి రౌతులను త్రోసి చిందరవందరగా పాఱిపోయినవి. మొగలాయీవారికి జయమబ్బినది. ఈవిధముగా ఒక్కొక్కయుద్ధముచేతను వారిపురోగమనము మూఁడు నాలుగుదినములు ఆలస్యమగుచు వచ్చినది.

ఇంతలో ఆగస్టునెల వచ్చెను. ఎడతెంపులేని వానలచేత మొగలాయీలు కష్టపడఁజొచ్చిరి. వారిగమనము చాల మందగించినది. ఇంతలో గోలకొండవారు ఆయత్తపడఁజొచ్చిరి. మాదన్నపంతులుగారి సొంత గుఱ్ఱపుదండు, పదివేలస్తోమము వచ్చి యుద్ధరంగమును ప్రవేశించెను. జాఁనిసార్ ఖాను సెడంలోని మట్టికోటలో చేరఁగా గోలకొండఫౌజు వారిని ముట్టడించినదిగాని మొగలాయీలు ధైర్యముగా కోటను కాపాడుకొనిరి. ఈ నిత్యయుద్ధములలో ఇరుపక్షములలోను లెక్కలేనివారు చనిపోవుచుండిరి. మొగలాయీలకు దినమంతయు ఘోరముగా పోరాడినందున సాయంకాలమునకు జయమబ్బినను అలసి

పోయియుండినందున శత్రువును వెన్నంటుటకు సాధ్యపడనందున ఫలవంతము కాఁజాలకుండెను. మీఁదుమిక్కిలి మొగలాయీ దండనాయకులలో ఐకమత్యము లేకుండెను. రాజకుమారుఁడు చాల మృదుస్వభావుఁడై నందున వీరిజగడములు పెరుగుచుండినవి. మొగలాయీసైనికులకు ధైర్యము పోసాగినది. తుదకు యుద్ధము నిలిపి విశ్రాంతి నందసాగిరి. గోలకొండ సైనికులును చెంతనేయుండి అప్పుడప్పుడు రాత్రులు మొగలాయీస్కంధావారములోనికి అగ్నిబాణములను ప్రయోగించుచుండిరి.

ఇట్లుండఁగా పాదుషా తనకుమారుని అదలించుచు ఒక రాయబారిని పంపెను. అంత, మరల యుద్ధ మారంభమాయెను. ఒకదినము సూర్యాస్తమయమునకు షేక్ మిర్ హాజీ రూస్తము రావులకు గాయములు తగిలినవి. వెంటనే గోలకొండసైన్యము వెనుదిరిగెను. ఇప్పుడు ఇరువాగులును హైదరాబాదును సమీపించినవి. మఱునాటి యుదయము మొగలాయీవారు విచారణచేయఁగా గోలకొండసైన్యము హైదరాబాదునకు పాఱిపోయెనని తెలిసినది.

---

## ప్రకరణము ౧౩ - కుట్రలు, కుయుక్తులు

ఆకస్మికముగా గోలకొండసైన్యము పాఱిపోవుటకు కారణము చాలగొప్పదై యుండవలయును. అక్కిమత్తరాయడు ఎట్లయినను అక్కన్న మాదన్నలను కడతేర్చు నుపాయ మాలోచించుచుండెను. ఇట్లుండఁగా నాతనికి సందుచిక్కెను. షేక్

మిర్జాహాజ్ ఏ కారణముచేతనో అక్కన్నతో వైరమూనియుం డెను. మొదటినుండియు అంతఃపురమందలి స్త్రీలకు అక్కన్న మాదన్నలన్న ద్వేషమే. అబ్దుల్లాసుల్తానుభార్యలైన సరోమా జనీసాహెబులకు తానాషామీఁద మొదటనేర్పడిన ద్వేషము ఆతనిమంత్రులమీఁదికి ప్రసరించెను. వీరికి ఈ హిందువులను తొలఁగించి మహమ్మదీయులను మంత్రులుగా నియమించుకొన వలయునను కోర్కెయుండెను.

స్కంధావారమునుండి ప్రతిదినము యుద్ధ మొనరించు చుండిన షేక్ మిన్హాజునకును నగరిలోనుండు అత్తిమత్తరాయని కిని ఆ పూర్వసువాసినులైన పూర్వరాణులకును ఉత్తరప్రత్యు త్తరములు జరుగుచుండినవి. మీర్ ఇబ్రహీం అను వానిని మొగలాయీలు తమవైపు లాగుటకు ప్రయత్నించుచుండిరి. షేక్ మిర్జాహాజ్ కూడ మొగలాయీలతో చేరుటకు యత్నిం చుచు ఆవిషయమును పైకితెలియనీయక మెలఁగుచుండెను. రహస్యముగా గోలకొండకు చారులనుపంపి ప్రతిదినము సాయం కాల మగుసరికి గోలకొండఫౌజు ఓడిపోవుటకు కారణము ఇబ్రహీము కార్యశ్రద్ధ వహింపకపోవుటయే యని తానాషా యును మంత్రులును తలంచునట్లు చేయుచుండెను. అట్లే ప్రచా రమగుచుండెను. మీరుమహమ్మదు తనమాటలలో, మీర్ ఇబ్రహీం మొగలాయీలకు అనుకూలుఁ డనునట్లు చెప్పుచుం డెను. సుల్తాను మాదన్నను పిలిపించి ఇట్లుండునా యని యడి గెను. మాదన్నకు ఇందు సత్యము తెలియనందున తానేమియు

గట్టిగా చెప్పజాలకున్నాననియు విషయము చక్కఁగా తెలిసి కొనవలసి యున్నదనియు కాని అట్లుండదనియు బదులిడెను.

గోలకొండలో మీార్ మహామ్మదును అంతఃపురములోని వారును వీరితో చేరినవారును 'తానాషాసుల్తానును మాదన్నయు కలసి ఇబ్రహీమును ఖైదు చేయనున్నారు' అని ప్రవాద పుట్టించిరి. ఈమాటలు స్కంధావారమున ఇబ్రహీం చెవిలో పడెను. ఇందులకు దోహదముగా కూడనుండి స్నేహము నటించుచుండిన మిర్జాహాజు అతనికి అపాయము తప్పదనియు వెంటనే మొగలాయీలకడకు పాఱిపొమ్మనియు తానును శీఘ్రముగ వెనుకవచ్చునట్లును నమ్మించెను. లోకులను మోసము చేయుటకు ప్రత్యక్షముగా నిరువురును ఒకదినము జగడమాడి తటాలున ఆకారణముచేత వెడలిపోయినట్లు ఇబ్రహీము మొగలాయీల కడకు పాఱిపోయెను. అతనిని వారు గౌరవించి ఆఱువేలసైన్యమునకు మన్సబ్దారుగా నియమించి మహాబత్ ఖానను బిరుద మిచ్చిరి.

ఇబ్రహీము పాఱిపోయెనని తెలిసినంతనే మాదన్న మీాఁద నాతనిశత్రువులు చాడీలు చెప్ప నారంభించిరి. శత్రు పక్షమున చేరిన మీార్ ఇబ్రహీం మాదన్నకు ఆశ్రితుఁడనియు, అతఁడు వంచనచేయఁబోవుట మాదన్నకు ముందుగానే తెలియుననియు, అందుచేతనే ఆనాఁడు తెలిసియు, ఇంకను విచారించుట మంచిదని పల్కెననియు, ఇంక త్వరలోనే మాదన్నయు గోలకొండవారిని మోసముచేసి శత్రువులతో చేరుననియు షేక్

మిర్ హాజ్ తానాషాకు చెప్ప నారంభించెను. ఈమాటలను తానాషా నమ్మలేదు. తన చిరకాలమిత్రుడును, తనకు విశ్వాస పాత్రుడును మహామేధావియు ధర్మబుద్ధియునైన మాదన్న ఈరీతిగానుండడని తానాషా గట్టిగాచెప్పి మిర్ హాజును నో రెత్తనీయలేదు.

ఇంతలో అంతఃపురమందలి స్త్రీలు తమకు హైదరాబాదు నగరములోనుండిన అపాయమనియు మొగలాయీలు బలవంతులగుటచేత నగరమునువీడి తాము గోలకొండదుర్గమును ప్రవేశించుట మంచిదని మిర్ హాజ్ మొదలైనవారి దుర్బోధనలచేత ఆందోళన చేయసాగిరి. మిర్ హాజ్ స్వయముగా పోయి తానాషాసుల్తానుతో నిదేరీతిని మాటలాడెను. సుల్తాను మాదన్నతో ఆలోచించెను. మాదన్న దూరదర్శి; ఆ ప్రకారము చేయరాదనెను. గోలకొండలో చేరుటకన్న ఓరుగంటికో కాక మఱియేదైన దూరప్రదేశమునకో పోవుట మంచిదనియు కోటను శత్రువులు ముట్టడించిన తాము బయట ధారాళముగా తిరుగుచు లోపలివారికి సాయముచేయుచు యుద్ధముచేయుట కవకాశ ముండుననియు హితోపదేశ మొనర్చెను. మిర్ హాజ్ యొక్కకుట్ర మాదన్న గ్రహింపలేకపోయెను. ఇదంతయు మాదన్న దురుద్దేశమని మిర్ హాజ్ చెప్పసాగెను. సుల్తాను అతనివాక్యములను నమ్మకపోయినను రాణివాసముయొక్క ప్రోద్బలముచేత గోలకొండలో ప్రవేశించెను. ఇది చాలపొరబాటే యైనను మాదన్న ప్రభువాక్యమును మన్నించెను.

గోలకొండ పతనములోనిది ప్రథమసోపానము. రాజద్రోహపరంపరలో నిది మొదటివిజయము. ఈ సేనాపతి చేసిన ద్రోహము హైదరాబాదును తలక్రిందులుచేసెను. రాజ్యరక్షణప్రయత్న మంతయు భగ్నమాయెను. ఇంకను చాల సైన్యము సురక్షితముగానున్నను తానాషాకు ఏదో అధైర్యమేర్పడెను. తాను చేసినది సరికాదేమో అని సందేహింప నారంభించెను.

మిర్జాహాజ్ యొక్క కుట్రచేత మాదన్నమర్యాద పోలేదుగాని భాగ్యనగరము (హైదరాబాదు) అభాగ్యమాయెను. గోలకొండసైన్యము పాఱిపోవుటయు వెంటనే సుల్తాను నగరమువదలి కోటలో చేరుటయు పాఆలమునకు తెలియుటకు మునుపే ఊరిలో అల్లకల్లోలములు రేగినవి. సుల్తాను తనకు సాధ్యమైన వస్తువులు, నగలు, నాణెములు, రత్నములు, రూప్యములు గ్రహించి స్త్రీలతోకూడ కోటకు పాఱిపోయెనని జనులు రచ్చచేయసాగిరి. వర్తకులును సిబ్బందియు వెనుకనుండి కోటలోనికి పరుగిడసాగిరి. సామాన్యగృహస్థులును రక్షణకొఱకు దిగులుపడసాగిరి. ఎక్కడివారక్కడ పాఱిపోవుటకు సిద్ధులైరి. సొత్తు, ఇల్లు, వాకిలి ఎట్లుపోయిననేమి, ప్రాణమానములుండిన చాలునని కొందఱు బంధుమిత్రులతో పరారియైరి. స్త్రీలు బురఖాలు తగిలించుకొనుటకుకూడ అవకాశము లేకపోయెను. ఇంతలో దొంగలు కొల్లగాండ్రు దోపిడీలు మొదలు పెట్టిరి. సుల్తాను కోటలో ప్రవేశించిననాటి రాత్రియంతయు

నిక్లే జరిగెను. కొందఱు వీరులు తమశక్తినంతయు వినియో గించి పలువురు జనులను వారి ఆస్తిని కాపాడిరి. మాదన్నయు అక్కన్నయు రూస్తంరావును చాలపాటుపడిరి. మిర్జాహాజ్ స్వాధీనముననున్న సేన మాదన్నకు సాయపడలేదు.

తెల్లవాఱునప్పటికి మొగలాయీవారిసైన్యము హైదరాబాదునగరమును ప్రవేశించెను; మూలమూలలను సందు గొందులను ప్రవేశించి దోఁచుకొనసాగెను. బంగారము, జవాహరి, రత్నములు, నగలు, వస్త్రములు, వస్తువులు కొన్నివందల బండ్లకు దోపిడీ ఆయెను. రత్నకంబళములు గొప్పవి కొనిపోలేక ద్వేషముచేత వానిని కత్తులతో చించి చెండాడిరి. హిందూ మహమ్మదీయస్త్రీలను, బాలురను, బాలికలను చెఱగొనిపోయిరి. వృద్ధులను బలహీనులను నానావిధములుగా హింసించిరి. బలవంతులను కొద్దిమందిని పెక్కురు పరివేష్టించి బాధించిరి. ఇండ్లను తగులఁబెట్టిరి. షాఆలము ఎంతప్రయత్నించియు తనసేనకుపట్టిన యావేశమును మాన్పలేకపోయెను తుదకు సేనయొక్కకొత్వాలును దివానును ఇంక కొందఱుద్యోగులును ఈదోపిడిని ఎట్లో నిలిపించి వారిచేత నింకనుపడనట్టి కొన్నికార్ఖానాలలోనిద్రవ్యమునుమాత్రము తాము హరించిరి. ఇంతలో తానాషా షాఆలంకడకు రాయబారినిపంపి మన్ననకోరఁగా నాతఁడు దోపిడిగాండ్రను శిక్షించి జనులను కాపాడెను. తగులఁబడుచుండిన యిండ్లను ఆర్పించెను. దాదాఁపు డెబ్బదిలక్షలహొన్నుల విలువగలవస్తువులు దోపిడిపోఁగా మిగిలినవి షాఆలము చేతఁ జిక్కి

నవి. ఎంతకొల్ల పోయినదో! పాదుపాకుమారుఁడు పశ్చాత్తాప పడసాగెను. అతనిది మెత్తనిహృదయము; పాదుషావంటి కర్కశుఁడుగాఁడు. ఏమైనను తానాషా మహాత్ముఁడేగదా యని తలఁచి ఒకకోటియు నిరువదిలక్షలహొన్నుల కప్పము సంవత్సర మొకటింటికి తానాషా కట్టుట కొప్పుకొనునెడల తాను పాదుషాతోఁ చెప్పి మన్నన యిప్పింతుననెను.

---

## ప్రకరణము ౧౪ - మాదన్న మీఁద రెండవకుట్ర

అత్తిమత్తరాయని మొదటిప్రయోగము ఫలింపలేదు. సుల్తానునకు మంత్రులపై నభిమాన ముండువఱకు వారిబలము తగ్గుట కవకాశము లేదు. ఈమాఱు మఱియొకవిధమైన ప్రయోగము లేవనెత్తెను. మొగలాయీలువచ్చి చెంతనే యున్నారు. దినదినమును ఏదో క్రొత్త ఆశ్చర్యకరమైన విశేష మొకటి జరుగుచునే యుండెను. మీర్ ఇబ్రహీం మొగలాయీలకడకు పోయినది మొదలు ఎవఁడో యొకఁడు ప్రతిదినము ఆపనియే చేయుచుండెను. సర్దారులు చాలమంది పాఱిపోయిరి. ఒకదినము సుల్తాను చాలఖిన్నుఁడై యుండెను. షారఫ్ ఉల్-ముల్క్ అనునతఁడు, ఆతనిచెల్లెలి భర్తయే, మొగలాయీలకడకు పాఱిపోయెను. ఈసందర్భమున ఆదిత్యమూర్తియు షేక్ మిఞాహాజును కలసి ఒక దొంగజాబును పుట్టించిరి. ఔరంగజేబు స్వయముగా వచ్చినయెడల తాము తానాషాను పట్టియిచ్చి గోలకొండ కోటను ఆతనికి స్వాధీనము చేయుటకు సిద్ధముగా నున్నామని

అక్కన్నమాదన్నలు పాదుషాకు వ్రాసి దానిని ఒకనిచేతి కీయఁగా వానిని ఎవరో పట్టుకొనివచ్చినట్లు సుల్తానుకడకు తెచ్చిరి. తానాషా ఆజాబు చూచుకొనెను. మాదన్న వ్రాఁతవలెనే అది యుండెను. కాని సుల్తాను మనుష్యుల అంతర మెఱిఁగినవాఁడు. ఈజాబును పట్టుకొనినవారు మాదన్నకు స్నేహితులు కారు. ఆతనివ్రాఁతకును దీనికి కొంతభేదము నుండెను. వెంటనే అక్కన్న మాదన్నలను సుల్తాను పిలిపించెను. వారును వచ్చిరి. ఆజాబు వారిచేత నిడెను. వారిరువురును దానినిచూచిరి. వారి మొగములయందు ఎప్పటిప్రసన్నత యుండెనేగాని అవి దొంగ మొగములుగా లేవు. తమవ్రాఁతగల మఱియొక కాగితమును చూపి పోల్చుకొమ్మని వారు ప్రభువును కోరిరి. కొన్నియక్షరములలోను భాషలోను భేద ముండెను. ఈజాబు వాస్తవముగా తమదేయని ప్రభువు నమ్మియుండినయెడల తా మెట్టిశిక్షకైన తలయొగ్గియున్నటులు మంత్రులు ప్రమాణ మొనర్చిరి. తానాషా వెంటనే ఆజాబును చింపివేసెను. అంతసేపును అట్టె చూచుచుండి షేక్ మిన్హాజ్ అత్తిమత్తులు మత్తులవలెనై వెడలిపోయిరి. తానాషా తనకు కష్టకాలము సంప్రాప్తమై యున్నదని తలఁచి తనమంత్రులమీఁది యీప్రయోగములు ఎట్లు పరిణమించునోయని చింతింపసాగెను.

సుల్తాను సెలవునంది ఇంటికి వచ్చుచునే భగవంతునిపై భారమువేసి అక్కన్న మాదన్నలు తమగుమాస్తాలను పిలిపించిరి. కాశీమొదలు రామేశ్వరమువఱకు పుణ్యక్షేత్రములలో

లక్షమంది బ్రాహ్మణులకు అన్న దానములకు ఏర్పాటు చేయించిరి. ఇంకను పారలౌకిక కార్యములు చేయుటకు కాలము వచ్చినదని వారు తలంచిరి. తల్లిదండ్రుల కషాయమురానీయక వారిని తమ్ములతో దూర దేశములకు పంపివేసిరిగదా. ఇది మొదలు తమ జీవితమంతయు భగవత్కైంకర్యమున గడుప మొదలిడిరి. శ్రీ శైల గర్భాలయమునకు బంగారుపూఁత పూయించిరి. పుష్పగిరి శంకరాచార్యపీఠమునకు భూదానము లిచ్చిరి. గోలకొండకు సమీపమున మహేశ్వర మనుచోట శివాలయమునకు ఒక వారములో నొక మహోన్నతగోపురమును నిర్మించిరి. అచటనే యొకతటాకమును త్రవ్వించి. ఆలయగోపురమునకు కలశాది ప్రతిష్ఠలుచేసి, పూజారులను హెచ్చుగా నేర్పాటుచేయించి ప్రతిదినము రెండువేలమంది బ్రాహ్మణులకు అన్న దానముచేయుటకు ప్రారంభించిరి. ఎన్ని రాచకార్యము లుండినను ప్రతిదినమును ఉదయము పండ్రెండుగంటలకును, రాత్రి పదిగంటలకును అచ్చటికేఁగి స్వయముగ బ్రాహ్మణసమారాధనలో పాల్గొని వచ్చుచుండిరి.

ఇట్లు వీరు కైంకర్యమున నుండఁగా శత్రువులు సుల్తాను సాయములేకయే వీరిని చంపివేసినయెడల చాలబాధలు పోవునని తలంచిరి. అంతఃపుర పూర్వసువాసినులు వీరికి సాయపడుచుండిరి. వీరందఱునుకలసి కుట్ర సాగించిరి. సుల్తానుకడనుండి మంత్రులు ఒంటరిగా వెడలిపోవు సమయమున వారిని చంపివేయవలసినదని తమపరివారములతో సమయము వేచి

యుండిరి. అంతఃపురమందలి పనికత్తెలుకూడ ఇందులకు సంసిద్ధలైయుండిరి. కాని ఎట్లో ఈవిషయము మంత్రులకు తెలిసిపోయినది. సుల్తానునకు వారు తెలుపఁదలఁచుకొనలేదు. కారణము ఆధ్యాత్మికదృష్టి యేర్పడిపోయినది. మహాలక్ష్మి త్వరలోనే వెడలిపోయెద నన్నదిగదా! దేశమా, గందరగోళముగానున్నది; ప్రాణమా, తామరమీఁది నీటివలె అల్లలనాడుచున్నది. శత్రువు వాకిటికి వచ్చియున్నాఁడు. తన యైశ్వర్యమంతయు తనయెదుట కొల్లవోవుచున్నను సుల్తాను దుఃఖపడకున్నాఁడు. ఆతఁడే వేదాంతిగానుండఁగా మనమేల అట్లుండరాదు అని ఆసోదరులు భావించిరి. ఈ మూఁడవకుట్ర జరిగినయనంతరము తమకు అంత్యకాలము చాల దాపైనదని తలంచి మహామంత్రు లిరువురును తమయింటఁగూడ విశేషవస్తువులుంచుకొనక సర్వస్వము దానముచేసిరి. బంధువులను సత్కరించి దూరస్థలములకు పంపివేసిరి. భార్యలును తామును గుమాస్తాలును పరివారముమాత్ర ముండిరి మేనల్లుఁడు, వెంకన్న (రూస్తుంరావు) గోపన్న తమ్ముఁడు మాత్రము ఉద్యోగధర్మము చేత వదలలేఁడు. అక్కన్నకుమాత్రము మల్లయ్య యని రెండేండ్లకుమారుఁ డుండెనేగాని మాదన్నకు సంతానము లేదు. మల్లయ్యను దాది ఎప్పుడును ఎడఁబాయక కాపాడుచుండెను. ఇంటికడను దానధర్మములు జరుగుచుండినవి. ఇదంతయు సుల్తానెఱుఁగఁడు.

---

# ప్రకరణము ౧౫ - పాదుషాతో రాయబారము

షాఆలము పంపిన రాయబారులు పాదుషాకు సకలవృత్తాంతమును నివేదించిరి. పాదుషా సంతోషించుటకు బదులు మండిపడెను. అంతధనము లూటీకానిచ్చినందులకు షాఆలము చేతఁగానివాఁడనియు బుద్ధిహీనుఁడనియు అఱచెను. తనకుమారుఁడు లూటీలో చాలభాగము దాఁచుకొని కొంతయే తనకుపంపి ద్రోహముచేసియుండునని యనుమానించెను. అందుచే మొగలాయీలు రెండవమారు గోలకొండమీఁదికి దాడివెడలిరి. అక్టోబరునెల 1685 సంవత్సరము షాఆలము మొదట డోబీపేట మీఁదుగా హైదరాబాదునకు పదునాలుమైళ్ళ పడమటినుండి గగన్‌పహారిపేటకు వచ్చియుండెను. అచ్చటినుండి ఇప్పుడు ఘోషామహలు నగరునకుపోయి కోటకుచెంత తానాషాయొక్క ఉద్యానవనమును ఆక్రమించెను. కొన్నిదినములవఱకు అక్కన్న మాదన్న తానాషాలు రాజకుమారునితో రాయబారములు జరుపుచుండిరి. పాదుషా కోరినదెల్ల తాముచేయుటకు సంసిద్ధులమని తెలుపుచుండిరి. పాదుషా సంధినిబంధనలలో దేశభాగమును డబ్బునుగాక పైపెచ్చు అక్కన్న మాదన్నలను తొలఁగించుట ప్రధానభాగమైనది.

షాఆలము తానాషాప్రార్థనపై గోలకొండనుండి లేచి నలువదియొనిమిది మైళ్లదూరమున కుహిర్ అను చోటికిపోయి పాదుషా ఆజ్ఞను తానాషా నిర్వహించు నని ఎదురుచూచు

చుండెను. ప్రస్తుతము గోలకొండలోనుండిన పరిస్థితుల ప్రకారము ఈకార్యము తక్షణమే సాధ్యముకాదు. అన్నిలక్షలు వెంటనే ఎట్లుదొరకును? రెండవది అక్కన్నమాదన్నలను ఎట్లు తొలఁగించుట? తానాషాహృదయము వారియెడ కృతజ్ఞతా జడమైయుండెను. తమశరీరములు వేఱుగాని హృదయము లొకటేయని ఆమంత్రులును ఆసుల్తానును తలంచియుండిరి. వారియం దేమిదోషము? తానాషా వేదాంతి. రాచకార్యములకును మతమునకు సంబంధము ఆతనికి గోచరింపలేదు. పైగా కుతుబుషాహీ (గోలకొండ) రాజ్యములో మహమ్మదీయేతరులు మంత్రులుగా నుండియున్నారు. వారికి రాజభక్తియు దేశభక్తియు లేకపోలేదు. ఇంతవఱకు ద్రోహమొనర్చిన వారందఱు మహమ్మదీయులే. ఈ హిందువులే సుల్తానును వదలకయున్నారు.

అక్కన్న మాదన్నలు సుల్తానును సమీపించిరి. ఆతఁడు పాదుషా రాయబారములోని ఈవాక్యములను వారికి వినిపింపలేదు. కాని ఆమహాత్ముని హృదయమును వారు గ్రహించిరి. వెంటనే తానాషా పాదములకు సాష్టాంగముగా మ్రొక్కి "మహాత్మా, మేము హిందువులము, బ్రాహ్మణోత్తములము. మాగురువులకుతప్ప నమస్కరింపము. తాము మహమ్మదీయులైనను భగవత్స్వరూపులు. మీవంటి వేదాంతియు పండితుఁడును మా యాంధ్రదేశమును ఎన్నఁడును పాలించియుండఁడని తలంచుచున్నాము. మీగురువులు జగద్గురువులేగాని వేఱు

గారు. స్వామీ ఈ దేహము నశ్వరము. దీనికై మాకు చింత లేదు. తమసింహాసనమును రాజ్యమును కాపాడుటకు వీని నర్పించుచున్నాము. గ్రహింపుఁడు. మమ్ము పంపివేసిన మేము కాశికో రామేశ్వరమునకో పోయెదము. లేదా మా ప్రాణము లనే గ్రహింపుఁడు." అని తానాషా హృదయము కరఁగునట్లు పలికిరి.

తానాషా తటాలున నేడువసాగెను. అంతటి సుల్తాను, అంతటిదొర, అంతటి వేదాంతి, పండితుఁడు సింహాసనమును వదలి, తన గాంభీర్యమంతయు అదృశ్యముకాఁగా ఆసోదరు లను కౌఁగిలించుకొనెను. అబ్దుల్ రజాకులారీకూడ కన్నీరు వద లెను. కూడనుండిన సర్దారులు పలువురు నేడ్చిరి. అక్కన్న మాదన్నలు నేడ్చిరి. "వలదు, వలదు, అంతపని వలదు. మీ ప్రాణము నాప్రాణము ఒక్కటేగాని వేఱుకావు. మేము ఏదైనను వదలఁగలముగాని మిమ్ముమాత్రము వదలఁజాలము. మీరు లేకపోయిన మాకు ఈసింహాసనమే అక్కరలేదు. ఇదంతయు భగవంతుని లీల" అనిపలికి ఎన్నికష్టములు వచ్చినను మంత్రు లను స్నేహితులును వదలరాదని నిశ్చయించుకొనెను. ఆప త్కాలమున ధైర్యము వహింపవలయుననియు, తాము క్రమ ముగా నుపాయ మాలోచింపఁగలమనియు సోదరులు పలికి సుల్తానును వీడ్కొనిరి.

మీర్ హాజ్ అత్తిమత్తరావులు మొగమొగములు చూచుకొనిరి. వారికిని దుఃఖమువచ్చినది కాని అది వేఱుదుఃఖము.

తమపన్నాగములు నెఱవేఱుటకుబదులు వీరి స్నేహబంధము దృఢమగుచున్నదేయని వారిదుఃఖము.

---

## ప్రకరణము ౧౬ - రామదాసుచరిత్రము

అక్కన్న మాదన్నలు మంత్రులైనవెంటనే తమబంధువుల కనేకులకు గొప్పయుద్యోగము లిచ్చియుండిరిగదా. వానిలో గోపన్న తహసీలు ఒకటి. తొలుత నాతఁడు సాధారణమైన తహసీలుదారుగానే వచ్చెను. తనపనియందు చాల జాగరూకుఁడై ఏమాత్రము లెక్కలలో నెక్కువతక్కువలు రానీయక పాడిదప్పక తహసీలు చేయుచుండెను. కాని త్వరలోనే ఈతనికి *కబీరుదాసను భక్తునిసాంగత్యము కల్గెను. హిందూ మహమ్మదీయ మతాభిప్రాయములు మేళవించి వేదాంతము ప్రబలియుండిన దినములవి. రామరహీముగా దైవప్రార్థనలు సలుపుకాలము. కబీరుదాసు గోపన్నకు రామమంత్రప్రభావము తెల్పెను. ఆదిమొదలు గోపన్న రామదాసై నిరంతరము భజనలయందును భద్రాద్రిదేవుని సేవయందును తనకాలము గడపుచుండెను. భక్తి దినదినప్రవర్ధమానము కాఁగా దేవాలయమున కైంకర్యములు చేయించెను. తనసొంతద్రవ్యము ఖర్చయిపోఁగా నీతఁడు 'రామభక్తులకు ఆపదలు రావు' అని భద్రాద్రి రామునికి నిత్యోత్సవములు చేయించుచుండఁగా సర్కారు

---

* ఈకబీరు మఱియొకఁడుగానుండును. 13-వ శతాబ్దపు సుప్రసిద్ధ భక్తుఁడుకాఁడు.

ఖజానాపైకము ఆఱుసంవత్సరములది నిలువయైనదని మాదన్న కడనుండి దూతవచ్చి చెప్పెను. భక్తిపారవశ్యమున నుండిన గోపన్నకు ఆమాటలు ఎక్కలేదు.

ఈలోపల రాజధానిలో చాల మార్పు లేర్పడినవి. అక్కన్న మాదన్నల యధికారమునకు లోపము లేదుగాని వీరికి శత్రువు లేర్పడిరి. రెండుపర్యాయములు ఆశత్రువులు చాడీలు చెప్పియు తానాషా వినలేదు. తామే వారినిచంపుటకు ప్రయత్నించియు ఫలింపలేదు. రామదాసుచర్యలు అత్తిమత్త షేక్ మిర్జాహాజులకు తెలిసినది. ఊరంతయు గందరగోళముగానుండు కాలమున తానాషాపేరిట గోపన్నను తర్కింపసాగిరి. గోపన్నయు వారుపెట్టుబాధలను సహించెనేగాని మామలకు చెప్పి పంపలేదు. ఆదుర్మార్గులు రహస్యముగా తమకు క్రిందిసర్దార్ల చేత గోపన్నను చెఱలోపెట్టించి క్రమముగా నొకదినము తానాషా అండనుచేరి భద్రాచలము తాసిల్దారు సర్కారుఖజానాకు పైకముపంపక భక్షించెనని చెప్పిరి. వెంటనే దర్బారులో విచారణ జరిగెను. అది వాస్తవమే. మాదన్న ఏమియు బదులు చెప్పుటకులేక ఆవిషయము ఈ దేశోపద్రవకాలములో తమ కింకను తెలియరాలేదనియు ఎవరైననేమి న్యాయముప్రకారము శిక్షింపవలసినదే అనియు సభలో నుడివెను. ఆమాటయే చాలునని మిర్జాహాజుపక్షమువారును అంతఃపురములోనివారును గోపన్నను తీవ్రముగ శిక్షింపవలసినదని తానాషాను పురికొల్పు చుండిరి. తానాషా గోపన్నను పిలిపించెను, విచారణ జరిపెను,

ఆయన మహారామభక్తుఁడని ఎఱిఁగి తనమంత్రులమీఁదనుండిన యనురాగముచే తత్క్షణమే క్షమించి భద్రాచలమునకే మర్యాదలతో పంపెను. ఈ ఘటన తానాషామీఁద మహమ్మదీయులలో కొందఱికి ద్వేషమునకును హిందువులలో అందఱికిని అభిమానమునకును కారణమాయెను.

పూర్వాచారములు మూఢవిశ్వాసములుగల ఆదినములలో ఎట్టి స్వల్పవిషయమునుగూర్చి యైనను సులువుగా కథలు అల్లుకొని పర్వుటలో నాశ్చర్యము లేదు. ఇంత సులువుగా విషయము తేలిపోయినందువలన శ్రీరాములవారే తానాషాకు దర్శన మనుగ్రహించి రామదాసును చెఱవిడిపించిరని జనులు చెప్పుకొనసాగిరి. మఱికొందఱు తానాషాకు పూర్వజన్మవృత్తాంతమును సయితము కల్పించిరి. ఆయన పూర్వజన్మమున నొక దొడ్డబ్రాహ్మణుఁ డనియు గంగాతీరమున నిత్యము స్నానము చేయుచు, శివునకు గంగోదకము నభిషేకము చేసిన దేవేంద్రపదవి కలుగునని చెప్పఁగా అట్లు కొంతకాలము చేసి, ఎన్నాళ్లకును శివుఁడు ప్రత్యక్షము కాలేదని విసిగి తుదకు నీటికుండను ఒకదినము శివలింగముపైఁ బడవేసె ననియు నంతట శివుఁడు ప్రత్యక్షమై యాతని మ్లేచ్ఛుఁడవై జనించి రాజవగుదువనియు నంతట భగవంతుని దయ కలుగుననియు వరమిచ్చెననియు నీజన్మమున తానాషా ఇంతవేదాంతిగా నుండుట కదే కారణమనియు పెక్కుకథలు బయలుదేరినవి. వాస్తవముగా తానాషా హిందువుల కంతప్రియుఁడుగా నుండెను,

వీనికెల్ల కారణము ఆతనిగురువు షారాజుఖొత్తాల్‌గారి ఉప
దేశమే.

---

## ప్రకరణము ౧౭ - మంత్రుల దుర్మరణము

అక్కన్న మాదన్నలకు దేవి కలలో కనఁబడి దాదాఁపు సంవత్సరమగుచున్నది. ఇది కడపటివారము. ఈ వారము దాఁటులోపల తమపతనము నిశ్చయమని ఆ సోదరులు దిన మెదరుచూచుచు తానాషా తుదకు తమ్ము పొండని చెప్పు కాలము చెంతనే యున్నదని తలంచుచు ఒకదినము సాధారణముగ ఎప్పటివలెనే నగరికి పోయిరి. ఉదయము పదునొకండు గంటలవఱకు సుల్తాను గోష్ఠియందు గడిపిరి. ఏవేవో పనులు విచారించిరి. ఔరంగజేబును తఱుమఁగొట్టుట కుపాయము లాలోచించిరి. పదునొకండు గంటలకు వెలికివచ్చి తమ బంగారు పల్లకిలో కూర్చుండిరి. పల్లకీవారు రెండడుగులు పోయిరో లేదో అత్తిమత్తరాయని సిబ్బంది కనఁబడెను. రెండవదర్వాజా దాఁటు సరికి సిబ్బందియెక్కువయై మంత్రుల పల్లకీవారిని చావమోది తటాలున అక్కన్న మాదన్నల మీఁది కుఱికి వారి తలలు ఖండించివేసిరి. వారితోకూడ వచ్చుచుండిన వారి మేనల్లుఁడు రూస్తుంరావు ఈ దురంతరమును చూచి చేయునది లేక ఒకరిరువురతో పోరి ఇంటికిపోఁగా నాతని తఱుముకొని పోయి ఇంటిలోనే కత్తితో పొడిచి చంపిరి. వారి యింటిచుట్టును

హిందువులును బ్రాహ్మణులును నివసించు పేటమీఁద నుఱికి వేయిమంది బ్రాహ్మణులను నఱికివేసిరి. మంత్రులభార్యలు తత్క్షణమే బావులలోఁదుమికి ప్రాణత్యాగ మొనరించిరి. అక్కన్న కొమరుని మల్లన్నను ఆ దాది గుడ్డలలోఁచుట్టి ఎచ్చటికో ఊరి వెలుపలికి కొనిపోయి ఒక మూరువాఁడు, మహమ్మదీయుఁడు, మాదన్న భక్తుఁడుండ, వానికడ వదలి భానుజీకడ చేర్పుమని పలికి తాను మరలివచ్చి తనయజమానురాండ్రు దుమికిన బావి లోనే పడి మరణించెను. ఆ దినమును రాత్రియు లెక్కలేని హత్యలు జరిగినవి. మంత్రులదేహములను వీథులవెంట లాగిరి.

అక్కన్న మాదన్నలు పడిపోఁగానే నౌకరులు సుల్తాను కడకు పరుగునపోయి ఏడ్చుచు రోదచేయుచు విషయమంతయు చెప్పసాగిరి. సుల్తాను దిగ్భ్రమజెందెను. నోటమాటరాక మూర్ఛపోయెను. నౌకరులును బానిసలును పన్నీరుచల్లి సేద దేర్చిరి. అబ్దుల్ రజాక్ మొదలైనవారు పరుగున చెంతకు వచ్చిరి. ఇంక నేమున్నది! మహామంత్రులు స్నేహితులు ఇట్టి దుర్మరణము పాలయినారన్న దుఃఖము సుల్తానునకు పొంగిపొంగి వచ్చుచుండెను. ఆతఁడు పిచ్చిపిచ్చిగా పలవింపసాగెను. ఎవ రేమిచెప్పినను శాంతింపలేదు. 'కోటదర్వాజాతలుపులు తెఱచి వేయుఁడు. ఔరంగజేబునుగాని మొగలాయీవారి నెవరినైన గాని వచ్చి గోలకొండను స్వాధీనము చేసికొని పొమ్మనుఁడు. ఇఁక మాకు గోలకొండ అక్కఱలేదు. ఈ రాజ్యమును మీరే అనుభవింపుఁడు. ఎంతపాపాత్మురాండ్రు ఈ యంతఃపురస్త్రీలు.

మీా కందఱకు వినాశకాలము వచ్చినది. గోలకొండ నాశ మైపోవు కాలమువచ్చినది. మొగలాయీాలు వచ్చి మిమ్ము ముక్కలుముక్కలుగా నఱకు కాలమువచ్చినది. హా! అక్కన్న మాదన్నలు మా అన్నదమ్ములు. పారుపోయిన తర్వాత మా కెందులకయ్యా ఈ రాజ్యము, ఈ యైశ్వర్యము?'

అబ్దుల్‌రజాక్ లారీ సుల్తానునకు ఊరటచెప్పసాగెనుకాని సుల్తానునకిక నెక్కడి ఊరట. వెంటనే తనగురువును దర్శించెను. ఆ స్వామి వేదాంతము తప్ప ఇఁకనేమి చెపఁగలఁడు. తానాషా తన సర్దార్లతో మొగలాయీావారికి కోటనువదలివేయుఁడని చెప్పుచుండెనేగాని మాననేదు. సర్దారులు కదలక నిలిచియుండిరి. తానాషా దుఃఖాతిరేకమున నిట్లనుచున్నాఁడని వారు మొగ మొగంబులు చూచుకొనుచు మంత్రులమీాఁద సుల్తానునకు ఇంతప్రేమ కలదని తమకు ఇంతవఱకు తెలియరాదాయెనని తమలోతాము చెప్పుకొనసాగిరి. తానాషా మరల నారంభించెను. 'అక్కన్న మాదన్నలు మాకు ప్రాణము వారే మాజీవము. ఈ దేశమునకు ఎంత సేవచేసినారు! ఎంత మేధావులు! రాజ్యము విస్తరించినారు, ధనము చేర్చినారు, ఊరిని కాపాడుచున్నారు. మహమ్మదీయులతో చాలస్నేహముచేసినారు. మామీాఁద వారికెంతో ప్రియము. రాజ్యములు రాగలవు పోఁగలవు, అట్టి స్నేహితులు రాఁగలరా? వారిది ఎంత సమదృష్టి. హిందూముసల్మాన్ భేదమే వారికిలేదు. అయ్యో! మాకు ఈ సింహాసనమిక అక్కఱలేదు. ఈతఖ్తు, ఈరాజ్యము,

ఈయైశ్వర్యము అక్కరలేదు. సన్న్యాసము. సన్న్యాసము. మక్కాకు పోవలసినదే. కాశీరామేశ్వరాలలో పకీరుగా తిరుగుటమేలు. పొండు, తెరచివేయుఁడు, ఖిల్లా దర్వాజాలంతయు తెరచివేయుఁడు."

తానాషా ఈమాటనేచెప్పి పనవిపనవి యేడ్చుచుండెను. ఆసందర్భమున సుల్తానుతో మాటలాడ గలిగినవాఁ డెవఁడు? దర్వాజాలు తెఱచినయెడల నిఁకనేమున్నది. మొగలాయీలు ప్రవేశించి సర్వసంహారము చేయుదురు. మంత్రులను ఖూనీ చేయించినవారి యుద్దేశము అదికాదు. వారికి ఆ మంత్రులు పోయి వేఱుమంత్రులు రావలయుననియు అట్లు చేసిన ఔరంగజేబు సంతోషించుననియు, తమ పగతీరుననియు. అబ్దుల్ రజాక్ లారీ చాలజాలితో సుల్తానును చూచుచుండెను. అతఁడు మాత్ర మేమిచేయఁగలఁడు. మొగలాయీవారు భేదదండోపాయములలో చాల సమర్థులు; ఎంతద్రోహమునకైనను వెనుదీయనివారు. వారితో తానాషాయొక్క అంతఃపురమందలి స్త్రీ వర్గము చేరినది. వారికి రాజనీతియేమి తెలియును. వారెఱిఁగినదంతయు కడుపుమంట తీర్చుకొనుటయే. పూర్వద్వేషములను మనసున నుంచుకొనియు కొందఱు ద్రోహులతో చేరియు అక్కన్న మాదన్నలను చంపించి హిందువులను కడతేర్చిన ఔరంగజేబు సంతోషించునని తలంచిరి. మొగలాయీపక్షపాత మవలంబించుటకు వారికిఁగలకారణమీమాత్రమే, గొప్పసామ్రాజ్యమును ఈ మహామంత్రులు కాపాడుచుండి

రనియు వారి పతనముచేత నీ సామ్రాజ్యము నశించుననియు నామూక్షురాంధ్రకు తెలియదుగదా. మిగిలిన సర్దారులు కొందఱు ద్రోహులు. అక్కన్న మాదన్నలమీఁద వ్యక్తి ద్వేషముగల వారు కొందఱు. మొగలాయీలు బలవంతులుగాన ఎట్లును గోల కొండపడిపోయిన తమయుద్యోగములకు లోటుండదని తలంచిన వారు కొందఱు. అబ్దుల్ రజాక్ లారీ పై బృందములలో వేటి తోను చేరఁడు. అతఁడు బుద్ధిమంతుఁడును సమర్థుఁడును. అక్కన్న మాదన్నలు రాజభక్తులనియు దేశభక్తులని మహా సమర్థులనియు నాతఁ డెఱుఁగును. పాడువేదాంతము వారిని చెఱచినది. తానో స్వయము రాజభక్తిసంపూర్ణుఁడు, వయసు చెల్లినవాఁడు. ఆతని చూపులో ఎంతభావము కలదోగాని చాలగొప్పవాఁ డనిమాత్రము తెలియుచుండెను. ఆతఁడు మెల్లగా తానాషా సమీపమునకు వచ్చి మోకాలిపై నిలిచి నెమ్మదిగా 'జహాపనా' అనెను.

తానాషా అతనివైపు చూచెను. ఆచూపులో నాతఁడు మరల మనలోకమునకు వచ్చుచున్నాఁడని యనిపించుచుండెను. 'జహాపనా' యను నాచల్లని పిలుపు ఆతనికెంతయో హృద యాహ్లాదకరముగా నుండెను. మరల నాతఁడు 'జహాపనా' యనెను. 'అబ్దుల్ రజాక్ సాహెబ్, చెప్పండిభాయి' అని సుల్తాను ప్రియముగా పలికెను. రజాక్ ఇట్లు చెప్పనారంభించెను. 'జహా పనా, దయచేసి తొందరపడవలదు. మనకింకను చాల పని యున్నదిగదా. తాము మహావేదాంతిగదా. ఎవరికిని కాలము

రాక వారుపోరుగదా. ఎవరికైన నసీబ్ తప్పునా? మంచిమంత్రులు ఘోరపుచావు చచ్చినారు. ఐనను మేమున్నాముగదా. నేను ఇన్నిదినములు తమనౌకరి చేసితిని; తమకొఱకు కత్తిపట్టితిని, తమపేరుచెప్పి పోరుచున్నానుగదా. నావంటివారు చచ్చువఱకు తాము దర్వాజా తెఱిపింపకూడదని నాప్రార్థన. మాప్రాణములు హరించి మాశవములమీఁద నడచి శత్రువులోపలికి వచ్చిన మాకు హాయిగానుండును. మాప్రాణములు సంతోషముగా పోఁగలవు. నమ్మక్ తిన్న ఋణము తీరును. హుజూరు సెలవైన ఖిల్లాను నేను కాపాడెదను. నాప్రాణాలమీఁద ఔరంగజేబును లోపలికి రానిండు. సర్కారువారి పాదములమీఁద అనుగ్రహము కోరుచున్నాను. సెలవిండు" అని చాల దీనముగాను పౌరుషముతోను వేడుకొనెను.

తానాషాహృదయము ద్రవించిపోయెను. అతనినోట మాటరాలేదు. కొన్ని నిముసము లాతఁడు జడునివలె నుండెను. రజాక్ మరల ఆమాటలనే పలికెను. తానాషా ఇష్టములేనివానివలెనుండి మెల్లగా 'సరే, రజాక్ భాయి, తమ ఇష్టప్రకారమే కానిండు. ఈఖిల్లా అంతయు తమస్వాధీనము, మనకెల్లను వినాశము తప్పదు. అది తమ మనస్సుప్రకారమే కానిండు ఈ కొద్దిలో తమ కాయాసమేల." రజాక్ పరమానందముతో సుల్తానునకు సలాముచేసి వెడలిపోయెను. దర్వాజాలు తెఱువలేదుగదాయని యందఱును సంతోషించిరి.

సుల్తానును వదలి రజాక్ ఈవలికిరాఁగానే గోలకొండ మీఁదికి మొగలాయీసైన్యము వచ్చుచున్నదని చారులు వచ్చి నివేదించిరి. కాని పాదుషాసైన్యము తాను సదుద్దేశముతో వచ్చుచుండునట్లు ప్రకటించియుండినది. షాఆలము సిఫారసుమీఁద పాదుషా తానాషాకు బహుమతులు పంపెను. ఎట్లును అక్కన్న మాదన్నలు పోయినారు. తానాషా సంధిషరత్తులకు ఒప్పుకొనియుండెను. ధనము చేకూర్చుటకు ఆలస్యమగుచుండెనేగాని తానాషా విరోధింపలేదు. పైగా పాదుషా కుమారుఁడు సుల్తానును క్షమింపవలసినదనియు సిఫారసు చేసియుండెను. ఇవెల్ల నాలోచించి చక్రవర్తి గోలకొండసుల్తానును మన్నించుమర్యాదగా నాతనికి గొప్పదుస్తులు నగలు పంపుచు వీనిని కొనిపోవుపనిని మీర్ హాషీం అనువానికే పెట్టెను. ఇది చాలసాభిప్రాయము. మీర్ హాషీం గోలకొండసైన్యమునుండి అంతకు కొన్ని నెలలక్రిందనే మొగలాయీలకడకు పాఱిపోయియుండెను. అట్టివానినిపంపిన గోలకొండవారికి తప్పక కోపము వచ్చును. కాని రహస్యముగా పాదుషా, ఈ సాకుతోపోయి గోలకొండను స్వాధీనము చేసికొనిరమ్మని హాషీమునకు ఆజ్ఞయిచ్చియుండెననియు, గోలకొండవాఁడే కాఁబట్టి అతనికి లోగుట్టులన్నియు తెలిసియుండుననియు సంధికి వచ్చియున్నందున గోలకొండవారు కొంతకాలము యుద్ధప్రయత్నము మానియుందురనియు కొంద ఱనుకొనుచుండిరి. ఈవిషయము గోలకొండ చారుల చెవులలోపడినది. దానిని వారు అబ్దుల్ రజాక్ లారీతో చెప్పిరి.

అబ్దుల్ రజాక్ సాహెబు, షారెజఖాను మొదలైనవారితో మొగలాయీవారిని డీకొనుటకు సంసిద్ధుఁడుగా నుండెను. మీర్ హాషీం అనువానివెంట నాతనికుమారుఁడు అబ్దుల్ కరీం అనువాఁడు వచ్చుచుండెను. ఇంకను గొప్పసర్దారులు వచ్చుచుండిరి. రజాక్ సాహెబు తన ప్రయత్నములను చాలరహస్యముగా నుంచియుండెను. అబ్దుల్ కరీమును మీర్ హాషీమును గోలకొండకు ఇరువదిమైళ్లదూరమున మునగాలకడకు వచ్చిరి. వెంటనే రజాకుయొక్క యాజ్ఞచేత షేక్ నైజాము అనుసర్దారును నాతని యధీనమం దుండిన ఆష్టనుసైనికులును మొగలాయీవారిమీఁద ఆకస్మికముగా దుమికి, ముట్టడించి పూర్తిగా దోఁచుకొనిరి. ఈదెబ్బలో మీర్ హాషీం చనిపోయెను, అబ్దుల్ కరీము బంధింపఁబడెను. ఆకస్మికయుద్ధముగాన షాఆలముకడనుండి సాయమువచ్చుటకు అవకాశము లేకపోయినది ఇదంతయు 1685 సం. నవంబరునెలలో జరిగినది.

వెంటనే మొగలాయీసైన్యము గోలకొండను వదలిపోయెను. ఇంతవఱకును మొగలాయీలు గోలకొండకు వెలుపలనుండి నానాబాధలు పడుచుండిరి. కోహీరులో నుండిన షాఆలముయొక్క స్కంధావారములోని సిబ్బందికి అన్నములేదు, గుఱ్ఱములకు ఉలవలు కాదుగదా గడ్డికూడ లేదు. సామానులు లాగు బండ్లయెద్దులకు నీళ్లేగతి. ఈస్థితిలో పాదుషా తనకుమారుని వెంటనేబయలుదేరి బిజాపూరును ముట్టడించుటకు తనకు సాయము రమ్మని ఆజ్ఞాపించెను. బిజాపురము సులభముగా

మొగలాయీలను లొంగునట్లు లేదు. అంతవఱకు షోలాపూరు లోనుండిన పాదుషా ఇప్పుడు స్వయముగానే బిజాపూరుముట్టడికి పూనుకొనెను. బిజాపూరును స్వాధీనముచేసికొనినతర్వాత గోలకొండమీదికి రావలయునని పాదుషా సంకల్పము.

---

## ప్రకరణము ౧౮ - బిజాపూరు ముట్టడి

క్రీ. శ. 1686 వ సంవత్సరము ఔరంగజేబు పాదుషా ఆజ్ఞమీద మహమ్మద్ ఆజామ్‌షా బిజాపూరును ముట్టడించెను. ముట్టడించునట్టి మొగలాయీ సర్దారులలో పాదుషాకుమారులు, కోటనుపట్టినకీర్తి తమకే రావలయునని ఒకరినిమించి యొకరు కుట్రలు చేయుచుండిరి. పైగా ఆసంవత్సరము క్షామ మేర్పడెను. ఆహారపదార్థములు దొరకవయ్యెను. కోటలో పని వారిబాధలు వీరికి పదింతలుగా నుండినవి. మొగలాయీలు బయటనున్నందున వారికి సరఫరాలు ఎచటనుండియైన రాగలవు గాని కోటలోనివారి కెట్లు రాగలవు? వారికి ఆలోపలనే సర్దుబాటు కావలసియుండెను. మొగలాయివారు కోటను పూర్తిగా ముట్టడింపగానే ఆ యవకాశమును పోయినది. లెక్కలేని జనమును గుఱ్ఱములును కోటలోపల మరణించుచుండినవి. తమకు గుఱ్ఱములు తక్కువయైనందున దక్కనీలు మొగలాయీల సరఫరాలను కొల్లగొట్ట లేకపోయిరి.

తర్వాత నొకవారమునకంతయు బిజాపూరుకోట పడిపోయినది. కాని మొగలాయీల ప్రతాపము వలనకాదు. ఒక

దినము సికందర్ ఆడిల్ షా సుల్తాను తనమంత్రులతో నాలో చించి ఇఁక నీ సర్వజనసంహారమును నిలుపుటకు తాను పాదుషాకు పాదాక్రాంతుఁ డగుటకు నిశ్చయించుకొనెను. కోటలోనిసిబ్బంది చాలవఱకు నాశముకాఁగా రెండువేలమంది మాత్రమే మిగిలి యుండిరి. క్రీ. శ. 1686 వ సంవత్సరము సెప్టెంబరు 12-వ తారీఖున విజయాపురముయొక్క కడపటి సుల్తాను సికందర్ ఆడిల్ షా తనపూర్వుల సింహాసనమును పట్టణమును వదలి, మధ్యాహ్నము ఒంటిగంటకు కొందఱు మొగలాయీ ఉద్యోగులతో ఔరంగజేబును దర్శించుటకు బయలు దేరెను. వీథులకు రెండువైపులను పురజనులు బారులుతీరి నిలుచుండి ఏడ్చుచుండిరి. సికందరుషా తననగరిని కడసారిచూపు చూచుకొని బయలువెడలి రాఁగానే మొగలాయీవారు జయభేరి వాయింపసాగిరి.

ఈలోపల పాదుషా కొలువుతీరియున్న గుడారమును పెచ్చుగాశృంగారించి యుంచిరి. చెంతకు సికందరు రాఁగానే గొప్పయధికారులు కొంద ఱాతని పాదుషాచెంతకు తోడ్కొని పోయిరి. పాపము సికందరుషా పాదుషాపాదములలో వ్రాలెను. ఆతని నవయౌవన సుందరాకారమును రాచఠీవియు చూపరుల గుండెలను కరఁగించి జాలిఁగొల్పుచుండినవి. పాదుషాకే ఆ యువకుని చూచినంతట జాలికలిగినది. సికందరునుచూచి దయతో నిట్లనెను. "భగవంతుఁడు నిన్ను కాపాడునుగాక. నీవు బుద్ధిమంతుఁడవై ఇంత తెలివిగా ప్రవర్తించినది నీమేలుకొఱకే

గదా. నిన్ను నేను గొప్పపదవియందుంచెదను. నీవేమియు భయపడవలదు. ధైర్యముగానుండుము." అని అతనిని తన మనుమని ప్రక్క కూర్చుండఁబెట్టుకొని గొప్పదుస్తులు బహుమతిగానిచ్చి ఏడువేలరూప్యములు వెలగలిగిన రత్నములు తాపిన బాకును, పచ్చరాల పతకముతోడి ముత్యాలహారమును పదుమూఁడువేల రూప్యములు వెలగలదానిని, రత్నములుతాపిన కత్తిని, వెలపొడవు గదను ఇచ్చి సన్మానించి, ఖానను బిరుదముతో నొక మొగలాయీ సర్దారునిగాజేసి, సంవత్సరమునకు లక్షరూపాయలు భరణ మేర్పాటుచేసెను. ఈ మర్యాద యైనంతట సికందరునుకొనిపోయి ఆతనికై ఏర్పాటు చేయఁబడియున్న గుడారములో ప్రవేశపెట్టిరి. బిజాపూరు సర్దారులందఱును మొగలాయీ సర్దారులైరి. పాదుషాయాజ్ఞపై మొగలాయీ అధికారులు బిజాపురమును స్వాధీనము చేసికొనిరి.

బిజాపూరు కళావిహీనమై పోయెను. స్వతంత్ర రాజవంశము పోయినది; రాజప్రతినిధియొక్క పరిపాలనము ప్రారంభమైనది. ధనాదాయమంతయు ఢిల్లీకి పోసాగినది. సంగీతసాహిత్యాది లలితకళలను లాలించువారు లేరు. ఆస్థానము అధ్వాన్నమాయెను. కవి పండిత గాయక చిత్రకార గణికాదులమొగములు చూచువారులేరు. రాచనగరిలో గోడలమీఁద నానావిధములైనచిత్రము లుండినవి. అవన్నియు ఖొరానుధర్మమునకు విరుద్ధములని, పరమాత్మతో మనుష్యుఁడు పోటీచేయ రా

దనియు మానవులచరిత్రములు ఎంతమాత్రము పనికిరావనియు పాదుషా వానినెల్ల తుడిపించెను. చాలమనోహరములైన చిత్రములు పాడైపోయినవి. ఆతర్వాత రెండుసంవత్సరములకు ప్లేగువ్యాధి బయలుదేరి దాదాఁపు సగము జనమును తినివేసినది. ఊరంతయు పాడుపడినట్లయినది. ఏకారణముచేతనో ఎప్పుడును సమృద్ధిగానుండు బావులుకూడ ఎండిపోయినవి. ఊరిలో గొప్పగోరీలు అలంకరణములవలె నుండుచు బిజాపురమునకు ఎప్పుడును ప్రత్యేకశోభను కూర్చెడివి. ఇప్పుడు ఆ గోరీలే ఆయూరిని శ్మశానమువలె చేసినవి. ఎంతదూరముపోయినను పడిపోయిన భవనములు, గొప్పబురుజులు, మసీదులు, నిర్మానుష్యమైన వీథులు, అచ్చట వీథులలోనే మహావృక్షములు మొలచి వీనిని చూచుకొనువారు పోయిరని చెప్పునట్లుండినవి. పెక్కుసాధనములమీఁద సయితము చెట్లు మొలచియుండినవి. పక్షులగూండ్లును, అందుండి పక్షుల యెఱువులును, గబ్బిలముల కంపునుతప్ప ఆపాడుపడిన ఇండ్లలో విశేషములు లేవు.

పాదుషాకు పాదాక్రాంతుఁడైన సికందర్ ఆడిల్ షా ఏమియు సుఖపడలేదు. కొంతకాలము పాదుషాతో నూరేఁగిన యనంతరము, ఆతఁడు తనరాజ్యములోని కృష్ణకుత్తరభాగము తనకు సామంతరాజ్యముగా ప్రసాదింపుమని ఎంత ప్రార్థించినను వినక పాదుషా సికందరును చల్లగా దౌలతాబాదులోని చెఱసాలకుపంపెను. ఆ గిరిదుర్గములో నాతఁడు తన జీవితశేషమునంతయు నిట్టూర్పుచు గడపెను. కొంతకాలము బందిలో

నున్న తర్వాత మరల పాదుషా తనకడకు పిలిపించి తనవెంట ఖైదుల గుడారములోనుంచి కూడ కొనిపోవుచుండెను. ఇట్టి పరిస్థితిలో సికందర్ ఆడిల్‌షా క్రీ. శ. 1700 సంవత్సరమున ఏప్రిలు 3-వ తారీఖున తన ముప్పదిరెండవ సంవత్సరమున చనిపోయెను. పదునాలుగేండ్ల వయసున సింహాసనమారోహించి మంత్రులచేతి కీలుబొమ్మగా కొన్ని సంవత్సరములుండి తర్వాత పదునాలుగేండ్లు ఔరంగజేబుయొక్క బందిగానుండి పాదుషా బంధమును ఈ సంసారబంధమునుకూడ సికందరువదలెను.

తనబందినుండి స్వయముగా విముక్తుఁడైన తమ కడపటి సుల్తానుయొక్క శవము ఊరిలోనికి రాఁగానే వేలకొలఁది జనులు పోయిచూచి ఏడ్చిరి. పెక్కుస్త్రీలు తమ భర్తలే మరణించిన నెట్లో అట్లు ఏడ్చి గాజులు పగులఁగొట్టుకొని అంగలార్చిరి. పాపము వారేమి చేయఁగలరు! పదునాలుగేండ్లుగా వారికి సుల్తాను లేఁడు. ఆతఁడుండినప్పుడును పాలించి యెఱుఁగఁడు. కాని తమకు సుల్తానని యొకఁడుండెనుగదా యను స్వాతంత్ర్యభావముకూడ పోయినది. తాము కేవలము బానిసలై పాదుషా ప్రీతికి తగినట్లు మెలఁగవలయును గదా యని బిజాపూరువారు ఆక్రందించిరి.

---

## ప్రకరణము ౧౫ - గోలకొండముట్టడి ప్రారంభము

బిజాపూరునకు పట్టినగతియే గోలకొండకును పట్టినది. పాదుషాకు దయాదాక్షిణ్యములులేవు. 1686 వ సంవత్సరము

డిసంబరులో నాతఁడు బిజాపురమును వదలెను. బయలుదేరు చునే, తానాషా తనకు అప్పుపడియున్న పేష్కస్సు తత్క్షణమే చెల్లింప వలసినదని ఫర్మానా వ్రాసెను. ఫర్మానా తెచ్చువారిచేత రహస్యముగా తనరాయబారి కొక జాబువ్రాసి పంపెను. "మనము హైదరాబాదును జయించుటకు ప్రయత్నింపవలెను. త్వరలో మా విజయపతాకలు అచటికి రాఁగలవు. ఇంతలోపల మీరు తానాషానుగుంజి సాధ్యమైనంత ధనమును లాగి మీ యుద్యోగధర్మమును నిర్వహింపవలెను."

మొగలురాయబారి సాదత్ ఖాను తానాషాతో అబద్ధములు చెప్పి పాదుషా ఆజ్ఞను ప్రతి యక్షరమును నిర్వహింప సాగెను. పాదుషా కోర్కెలు వర్ణనాతీతములు. తానాషాకడ ధనము లేనందున నాతఁడు తనరత్నాభరణాదులను తాకట్టుగా పంపఁగలనని చెప్పిపంపెను. సాదత్ ఖాను అందులకు ఒప్పుకొనలేదు. ఇంతలో పాదుషా బయలుదేరి వచ్చుచున్నాఁడని తెలియఁగానే తానాషా తానే తాకట్టుగా తనరత్నాభరణాదులను ఒకపెట్టెలోపెట్టి, ముద్రవేసి, మిగిలినపైకము ఎంతవసూలగునో దానిని మూఁడుదినములలో పంపునట్లును తన సదుద్దేశమును పాదుషావారికి తెలుప వలసినదనియు కోరి సాదత్ ఖానుకడకు పంపెను.

రెండుదినములు గడచినవి. పాదుషాకడనుండి బదులు లేదు సరిగదా ఆతఁడు దండువెడలి వచ్చుచున్నాఁడని తెలిసినవి. ఇదంతయు మొగలాయీవారి కపటోపాయమని తానాషా

గ్రహించి తనయుద్దేశము విఫలమైనదనియు తాను పంపిన తాకట్టును వాపసు చేయుమనియు కోరెను. సాదత్ ఖాను ఆ నగలు పాదుషావారికి తానుపంపివేసినట్లు బదులు చెప్పిపంపెను. పైగా తాను తనధర్మమును నెఱవేర్చితిననియు ఇప్పుడు ఆ వస్తువులకు బదులు తనతలను ప్రాణములను పాదుషావారి పేరు చెప్పి బలివేయవలసినదే యని కూడ వ్రాసెను. తానాషాకు కోపమువచ్చి సాదత్ ఖానుని యింటిని ముట్టడి వేయించెను. సాదత్ ఖాను సమయోచితముగ సంచరించు నేర్పరిగాన తనది సదుద్దేశమనియు, తన్ను శిక్షించుటచేత పాదుషాగారికి కోపమే యధికమగుననియు, తన్ను వదలిపెట్టిన తాను ఎట్లో పాదుషా వారికి నచ్చచెప్పి తానాషాను మన్నింపించుట కవకాశ ముండు ననియు చెప్పఁగా మెత్తటిమనసువాఁడు గాన తానాషా ఆతని వదలి చాల మర్యాద చేసిపంపెను.

ఇంతలో ఔరంగజేబు బయలుదేరెను. తానాషా కలఁత పడసాగెను. పరిస్థితులు విషమింప సాగినవి. మరల తానాషా పాదుషాకు తానుచేసినదంతయు నపరాధమే యని యొప్పు కొనుచు ఎంతధనమైనను చెల్లింతునని రాయబారమంపెనుగాని అంతయు వ్యర్థమాయెను. పాదుషా తానాషాపై పెక్కు తప్పులు వ్రాసెను. తానాషా ఆసలుడిగెను. ఆత్మరక్షణ వ్యూహము పన్నసాగెను. కొలువులో షేక్ మిర్జాహాజ్, షా రెజ్ ఖాఁ, అబ్దుల్ రజాక్ లారీ, అబ్దుల్లాఖాఁ పానీ అనువార లుండిరి. తానాషా గొప్పదండిచ్చి వారిని పాదుషామీఁదికి

పంపుచు, వారిని పాదుషాను పట్టుకొనినయెడల సాధ్యమైనంత వఱకు ప్రాణములతో చాలమర్యాదలతో తెమ్మని యాజ్ఞాపించెను. అబ్దుల్ రజాక్ లారీ మొదలగువారు, పాదుషాను చూడఁగనే తమ హృదయములు దహించుకొని పోవుననియు, ఆతఁడు కావించిన ఘోరములకు ఆతనియందు తమకెట్టి గౌరవ ముండుటకుగాని అవకాశము లేదనియు చెప్పిపోయిరి.

గోలకొండముట్టడి ప్రారంభమైనది. మోర్జాలను అచ్చుటచ్చుట ఫిరంగులు కాల్చుటకు నిలుపునప్పటికి బిజాపూరు జయించిన ఫిరోజుజంగను నతఁడు వచ్చిచేరెను. మొగలాయీలు సొరంగములు మొదలైనవి త్రవ్వుటకును ఆ కార్యము పైన కనఁబడకుండుటకు పందిళ్లను కట్టుటకును మొదలిడిరి. సముద్ర తరంగములవలె పొంగుచు సైన్యములు వచ్చుచుండినవి. ముట్టడి ప్రయత్నము లిట్లు జరుగుచుండఁగా గోలకొండవారు ఎదిరించుచు అనుదినము అటనట యుద్ధములు చేయుచునే యుండిరి. కోటనుపట్టుట కేర్పాటుచేయఁబడిన మోర్జాలవారు దినదినము కోటవైపు వచ్చుచుండిరి. ఒకదినము ఫిరోజుజంగు మోర్జాలవారిని ముందు నడుపుచుండఁగా గోలకొండసైన్యమును వెంటఁబెట్టుకొని అబ్దుల్ రజాక్ లారీ మహావేశముతో మొగలాయీవారిని ఎదుర్కొనెను. మొగలాయీసైన్యములో రాజపుత్రు లనేకులుండిరి. గోలకొండవారు వారిలో చాలమందినిచంపి కిషోర్ సింగ్ హాడా యనువానిని గాయపఱచి ఖయిదు పట్టుకొనిపోనుండఁగా మొగలాయీలు ప్రయత్నముతో తప్పిం

చిరి. గోలకొండవారు చాలమంది చనిపోయిరి. కాని దక్కనీలు చూపిన పరాక్రమమునకు మొగలాయీలు భయపడిరి. పాదుషాసైన్యములోనివారు తమలో చనిపోయినవారిని ఎత్తు కొనిపోవుటయే చాల కష్టముగానుండెను. ఎంతధైర్యముతో ప్రయత్నించినను సాధ్యము కాలేదు. దాక్షిణాత్యులు తమ వారి శవములనేగాక ఢిల్లీవారివికూడ తీసికొనిపోవుచుండిరి. తుదకు పర్షియను తురానీసైన్యములు వచ్చి రంగమును ప్రవే శించినవి. ఆతర్వాత అబ్దుల్‌రజాక్‌యొక్క సైన్యము నాఁటికి విశ్రమించెను.

ఆదినము మొదలు మరల నట్టియుద్ధములు జరుగలేదు. కారణమున్నది. పాదుషా దూతలనుపంపి షేక్‌మిన్‌హాజ్, షేక్‌నైజామ్ అను నిరువురను గోలకొండ సేనాపతులను లంచములిచ్చి స్వాధీనము చేసికొనసాగెను. వారును తానాషా చేసిన యుపకారములను మరచిపోయి మొగలాయీవారితో చేరిరి. తత్క్షణమే ఔరంగజేబు వారికి మర్యాదచేసి గొప్ప పదవులను బిరుదములను ఇచ్చెను. ఈ యిరువురును కోటను పట్టుటలో శత్రువునకు చాలసాయము చేయసాగిరి. ముట్టడి చాల కాలము సాగినది. కోటలోపల కొంత తుపాకిమందును ఆయుధసామగ్రులు నుండినవి. వీనితో మొగలాయీలమీఁదికి గోలకొండవారు తలుపుల సందులనుండియు, బురుజులనుండియు గోడల మాటులనుండియు ఫిరంగులను తుపాకులను కాల్చుచు బాణములు ప్రయోగించుచు నుండిరి. వీని ప్రయోగముచేత

ఆకాశమంతయు పొగగ్రమ్మి పగలురాత్రి యనుభేదము పోయి నది. అంతయు చీఁకటిమైనది. ప్రతిదినమును ఢిల్లీవారి సైన్యము మహాపరాక్రమమునుచూపి పోరాడుచునే యుండిరి. అనేకులు చనిపోవుచుండిరి. కొందఱు పాదుషాను మెప్పించు టకును ఆతనిమీఁది తమభక్తిని ప్రకటించుటకును సంవత్సరపు పని ఒక నెలలోను ఒక నెలపని ఒక దినములోను చేయుచు సొరంగములు త్రవ్వుచు, యంత్రములు నిర్మించుచు కోటలో ప్రవేశించుటకు మార్గములు వెదకుచు కష్టపడి ఎట్లెట్లో ప్రాణ ములకు తెగించి అగడితను సమీపించిరి. తర్వాత అగడితను మట్టితో పూడ్చుటకు పాదుషా ఆజ్ఞయాయెను. పాదుషా తానే స్వయముగా నొక గోనెసంచిలో మన్నుపోసి కుట్టి అఖాతములో వేసెను. సైన్యమంతయు పాదుషాను అనుకరింప నారంభించెను; ఫిరంగులు ఎక్కించి కోటమీఁదికి ప్రయోగిం చుటకు ఎత్తు కట్టడములు కట్టనారంభించెను.

---

## ప్రకరణము ౨౦ - క్షామము

ఈవిధముగా నెంతపని చేయుచున్నను కోట బురుజు లలో కొన్ని ప్రదేశములు పగిలి గోలకొండ సైన్యమునకు రక్షణతగ్గినను మొగలాయీ సైన్యములో కొంత యతృప్తి యేర్పడి చాలమంది తిరుగుబాట్లు చేయునట్లుండిరి. ఇందులకు కారణము జనులకు ఆహారము లేకపోవుటయు జంతువులకు

గడ్డి లేకపోవుటయు. దేశమందు క్షామ మేర్పడెను. మహా ధనికులుకూడ స్కంధావారమున దిగులుపడసాగిరి. ఆసంవత్సరము వర్షములు చాల తక్కువయైనందున జొన్నలుగాని రాగులుగాని పండలేదు. పైరు లెండిపోయినవి. పేదలు మాడిపోసాగిరి. ఈలోపల తానాషాకు సహాయము చేయుటకు వచ్చిన మహారాష్ట్రసైన్యము మొగలాయీవారికి వచ్చుచుండిన సరఫరాలను పూర్తిగా నడ్డగించి వేసెను. మొగలు సైన్యములోనే అంటువ్యాధులు బయలుదేరినవి. అన్నపానములు లేకయు రోగములు వచ్చియు ప్రతిదినము లెక్కలేనివారు చనిపోవుచుండిరి. చాలమంది సిఫాయీలు కడుపుకోసము తానాషాకడకు పోయిరి. మఱికొందఱు తానాషాతో చేరకపోయినను రహస్యముగా తానాషా సైన్యమునకు సాయము చేయుచుండిరి.

నాటిపరిస్థితులను కొందఱు మహమ్మదీయ కవు లిట్లు చిత్రించిరి.-మొగలాయీవారి దాడిచేత దేశమంతయు పాడైపోయెను. పాతిపెట్టిన ధనములవలె ప్రభువులు ఎచ్చటెచ్చటనో దాఁగియుండిరి. దారిద్ర్యము దేశమందు ప్రబలి కవుల కావ్యములలో ప్రజ్ఞాదారిద్ర్యము కనఁబడుచుండెను. సిఫాయీలకు జలధారకు బదులు అసిధారయు ఆహారమునకు బదులు సంహారమును దొరకుచుండినవి. వైద్యులు తమ వైద్యమును మఱచిపోయి ఆహారమే మహౌషధమని బోధించుచుండిరి. జోస్యుఁడు తనశాస్త్రము ఎవరికిని తన అక్కఱలేనందున

ఎచ్చట రొట్టె దొరకునాయని వెదకుచు చంద్రునిచూచి చంద్రుఁ డేల రొట్టె కారాదని కోరుచుండెను. పాదుషా వారి కరణములకు కరణీయములు లేవాయెను. కాని ప్రధానకరణము మాత్రము సంవత్సరమంతయు రంజానే యని వ్రాసికొనసాగెను. ఖోరానులో 'భోజనము చేయుము' అను వాక్యమును చదివి 'తిండికూడదు—అని యెచ్చటను లేదే' అని యొకసాయెబు చింతించుచుండెను. దర్జివాఁడు తన సూది తో సమానమైపోయెను. ఇతరుల నూతనవస్త్రములను కుట్టుటకు బదులు తనమలినవస్త్రమునుపఱచి దానిముందు కూర్చుండి ముష్టి యెత్తసాగెను. సాలెవాఁడు వస్త్రమునకు చాయమార్చుటకు బదులు తానే చాయమాఱిపోయెను. రొట్టెల యంగడివానికే రొట్టె చిక్కుట లేదు. చిల్లరసామానుల యంగడివాఁడు అంగడి నెత్తివేయుటకు ఆలోచించుచుండెను. వానియంగడిలో తక్కెడయు గుండ్లును తప్ప వేఱులేవు. వడ్రంగి తన అంపము ఉలియు చేతఁబెట్టుకొని ఆకాశము చూచుచుండెను. కమ్మరి వాఁడు కమ్మనివస్తువేది దొరకునాయని దిక్కులు చూచుచుండెను. మంగలివాని కత్తికి పనిలేదు. వంటవాండ్రందఱకు చాల విశ్రాంతికలిగినది. ప్రాయ్యులలో పిల్లులుకూడ వెచ్చదనము లేమిచే పరుండుటను మానినవి, ఒక యింటినుండి ఏడ్పులు వినవచ్చినవి. పోయి విచారింపఁగా వారి యింటికి బంధువులు భోజనమునకు వచ్చిరని తెలిసినది, ఇంకొకచోట జనులు చాల పరిహాసముచేయుచుండిరి. కారణ మేమనఁగా

నొకఁడు రొట్టెను చూచినట్లు కలగనెనట. ఈ దుఃఖము లేవియు తెలియని పిల్లలు మాత్రము సంతోషముతో నాడుకొనుచు, ఆఁకలివేసినప్పుడు ఏడ్చుచు, తాము వస్తుండి తమకు తల్లిదండ్రులు పెట్టగా తినుచునుండిరి.

గోలకొండ చాలగట్టికోట. ముట్టడి ప్రారంభమైనది మొదలు ఆకస్మికముగా వచ్చి కోటను పట్టవలయునని ఫిరోజు జంగు ప్రయత్నించుచుండెను. కోటలోపలను వెలుపలను కావలియుండు సిబ్బంది మామూలుగా మూఁడుజాముల వఱకు మేలుకొనియుండుటచే నాలవజామున త్రాటినిచ్చెనలు వేసి ఉచ్చుత్రాళ్లు విసరి వానిని పట్టుకొని మెల్లగా గోడల నెగఁబ్రాకి లోపల ప్రవేశింపఁదలంచెను. ఒకదినము రాత్రి మూఁడుజాము లైనపిదప ఒకజాము మిగిలియుండఁగా కొందఱు మహావీరులతో నాతఁడు కోటగోడను సమీపించెను. తా నచ్చట నొక బండఱాతి వెనుకనిలిచి తన పరివారమును పని ప్రారంభింప నాజ్ఞాపించెను. ఇరువురు సాహసికులు చాల నేర్పుచూపి కోటగోడలమీఁది కెక్కిపోయిరి. కొందఱు ఉచ్చుత్రాళ్లమూలమున సగముదూరము ఎక్కిరి. కాని వారి దురదృష్టవశమున ఆచోట సంచరించుచుండిన యొక పాడు కుక్క, అచట పడియుండిన శవములను తినుచుండినట్టిది, వీరిని చూచి తటాలున మొఱుగసాగినది. వెంటనే కావలివారు మేల్కొని కాగడాలు వెలిగించిరి. ఆశత్రువులను చూచి వారిని వెంటనే క్రిందికి దొర్లించి చంపిరి. ఇతరుల ననేకు

లను నిలువున చంపిరి. ఈ విపత్తును చూచి దుఃఖపడి చేయునది లేక ఫిరోజుజంగు వెనుదిరిగి పోయెను. ఇంతలో పాదుషాగారి సైన్యములు చాల దెబ్బ తిన్నవని స్కంధావారములో పూర్తిగా తెలిసిపోయెను.

---

## ప్రకరణము ౨౧ - మరల ముట్టడి ప్రయత్నములు

మేనెల 16-వ తారీఖున కోటలోని కావలిసైన్యము తటాలున వెలికివచ్చి వెలుపలనున్న వారిని కొట్టుటకు ఆరంభించెనని పాదుషాకు సమాచారము వచ్చెను. వెంటనే ఇజత్‌ఖానను వాఁడు వారిమీఁదికి పోయెనుగాని ఈ యుద్ధములో మొగలాయీలు డెబ్బదిమంది చనిపోయిరి. దాక్షిణాత్యులు ఎందఱు చనిపోయిరో తెలియదు. తర్వాత కోటలోపలివారు పెద్ద ఫిరంగీనొకదానిని కోటగోడమీఁదికి తెచ్చి దానిని సరిగా పాదుషా యొక్క శిబిరమునకు గుఱిచేసి కొన్ని గుండ్లు కాల్చిరి. అందు కొన్ని పాదుషా నిద్రించు గుడారమునుకూడ ప్రవేశించినవి; కొన్ని చుట్టును తాఁకుచుపోయినవి. పాదుషా భయపడి తత్క్షణమే తనగుడారమునకుముందు రక్షకముగా పందిళ్లను కట్టుట కేర్పాటు చేయించెను. ఎత్తుగోడలవంటి వానినికట్టి వానిమీఁద ఫిరంగుల నెక్కించి కోటగోడమీఁది వారిని కూల్చుమనెను. కావలిసైన్యము విడిసియున్నచోటి కెదటిభూమి పల్లమైనందున పాదుషాకోరిక సాధించుటకు కుదురలేదు. అంతట పాదుషా

రెండువందల తోలుకవచములను చేయించి సాహసికులకు పంచి పెట్టించెను. గట్టినిచ్చెన నౌకదానిని తెప్పించి దానిని కోటగోడలను సాధించు కట్టడముల కానించి తానే ఎక్కుటకు ప్రయత్నించుచు కాలుజారి పడఁబోయి తప్పించుకొనెను. ఈపని పాదుషా కావలయుననియే చేసెను. ఆతఁ డంతగట్టి పట్టుదల చూపనిచో ఇతరులు సాహసములు చూపరని యాతనినమ్మకము.

పాదుషాయొక్క ప్రయత్నములనుచూచి ఖాజీలందఱకు పెద్దయైన ఖాజీఅబ్దుల్లా పాదుషాకడకువచ్చి, శరణాగతుఁడైన ముసల్మానును కొట్టుట మహమ్మదీయాచారమునకును, ఖొరాను ధర్మమునకును విరుద్ధమని పాదుషాతో మనవిచేయఁగా నాతఁడు ఆ ఖాజీని స్కంధావారమునుండి దూరముగా తఱిమివేసెను. ఇట్లే అవమానితులైన ఖాజీలు కొందఱు మక్కాకుపోయిరి.

ఇట్లుండఁగా జూనునెల 16-వ తారీఖున రాత్రి గొప్ప తుపాను కొట్టెను. మొగలాయీవారి స్కంధావార మంతయు నానావిధముల బీభత్సమాయెను. డేరాలును గుడిసెలును చపారములును చిందరవందరగా నెగిరిపోయినవి. కొన్ని తడిసి ముద్దయైనవి. సర్వత్ర బురదరేఁగి పడినగుర్తులు కనఁబడుచుండినవి. పాదుషావారి కార్ఖానాలలోని సామానులన్నియు వెల్లువలో కొట్టుకొని పోయినవి. సొరంగములందును పల్లముల లోను దాఁగియుండినవారందఱును మునిఁగిపోయిరి. గాలిని వానను లక్ష్యముచేయక కోటమీఁదికి లగ్గలెక్కుటకు ప్రయత్నించి ముందునకు సాగినవారందఱును ప్రవాహములో కొట్టు

కొనిపోయిరి. వారెంత మొత్తుకొనినను వారిని కాపాడుట అసాధ్యమాయెను. కొండమీఁదను కోటగోడలమీఁదను దిబ్బలమీఁదను ఉండినవారుమాత్రమే ప్రాణములను దక్కించుకొనిరి. ఫిరంగికొఱకు కట్టినదిబ్బ కరఁగి నేలమట్టమై పోయెను.

సూర్యోదయమాయెను. గోలకొండ కోటలోపలి సిబ్బంది ఆవులించుచు మేల్కొనెను. తత్క్షణమే ఈ యవకాశమును పూర్తిగా నుపయోగించుకొనుటకు శత్రువులమీఁద కుఱికెను. పాదుషాయొక్క స్కంధావారములో మిగిలినదానినంతయు ధ్వంసముచేసెను. మొగలాయీ సిపాయీలనేకులు చంపఁబడిరి. అనేకులు పట్టుబడిరి. మిగిలినవారు తమ ప్రాణములను కాపాడుకొనుటకు పాఱిపోయిరి. ఈ విషయమంతయు తెలియఁగానే పాదుషా ఫిరోజుజంగు ఏమాయెనని యడిగెను. పాదుషా శిబిరమునకును కోటకును నడుమనున్న యొకమసీదులో కొందఱు యోధులతో నాతఁడు తలదాఁచుకొని యున్నాఁడనియు, మూసీనది వెల్లువలు పాఱుచుండినందున శత్రువుల మీఁదికి పోవుట కాతనికి అవకాశము లేకుండెననియు చెంతనున్నవారు చెప్పిరి. సిపాయీలను దాఁటించుట కుపయోగపడుచుండిన పడవ ఎచ్చటను కానరాకుండెను. పాదుషా హయత్ ఖానను వానిని ఎనుబదిడెబ్బదియేనుఁగులతోపోయి మూసీనదిని దాఁటి వానివీపున నాసర్దారులను తెమ్మని యాజ్ఞాపించెను. వాఁడట్లే బయలుదేరెనుగాని ప్రవాహము చాలవేగముగా నుండినందున ఏనుఁగులకు దాఁటుటకు అదనుచిక్కక ఆ దినము అర్ధరాత్రము వఱకును, ఆతఁడు ప్రయత్నించి వెనుకకుపోయెను.

అబ్దుల్ రజాక్ లారీ తాను ఖైదు పట్టుకొనిపోయిన యా మొగలాయీ సర్దారులను తానాషాకడకు కొనిపోయెను. గోలకొండసుల్తాను వెంటనే వారికి సేదదేర్చుకొను సదుపాయములు చేయించి మూఁడుదినములు తనకడ నుంచుకొని చక్కని భోజనాదికము లొడఁగూర్చి మర్యాదచేసి వారి చిత్తవిభ్రాంతి తీర్చెను. గొప్పదుస్తులిచ్చి తాను నిలువయుంచుకొనియుండిన ధాన్యమును, తనకడనుండిన తుపాకిమందును యుద్ధపరికరములనుచూపి, తనకు కావలసినదానికన్నను హెచ్చుగా వస్తుసంచయము కలదనియు కోటవదలననియు నొకజాబువ్రాసి దానిని పాదుషా కిమ్మని ప్రమాణపూర్వకముగా కోరి గౌరవముగా వీడ్కొలిపెను.

వీరందఱును పాదుషాకడకుపోయిరి. తానాషాసుల్తాను మర్యాదచేయఁగా పాదుషావారిని అవమానపఱచెను. తానాషాకడ బహుమతు లందినందులకు చాలగర్హించెను. వారి బిరుదలమును తీసివేసి పదవులను తగ్గించెను. రాత్రి మూఁడవ జాములో తానాషాజాబును స్వయముగానే చదువుకొనెను. జాబులో పాదుషాహృదయము కరఁగునట్లు తానాషా ప్రార్థించియుండెను. మనసు కరఁగినవానివలెనై సార్ బరాఖాన్ అనువానితో 'మాయాజ్ఞలను తిరస్కరించునభిప్రాయము అబుల్ హసనుకు లేనియెడల అతఁడు చేతులుజోడించుకొని మాకడకు వచ్చిన మాయౌదార్యమునకు తగినట్లు మేము చేయఁగలము.' అని పాదుషా అనెను. ఇట్లొకవైపు చెప్పుచునే ఏబదివేల గోనెసంచులకు ఆజ్ఞాపించెను.

క్రీ. శ. 1687 సం. జూన్ నెల 20-వ తారీఖునాటికి గోలకొండ కోటగోడల క్రిందికి మూఁడు సొరంగములు త్రవ్వఁబడినవి. వాని నిండుగ తుపాకిమందు నిండింపఁబడినది. తుపాకిమందుకు నిప్పంటించుటకు కొంతముందు మోర్చాలవారు గొప్ప శబ్దము చేయుచు వీరావేశముతో యుద్ధమునకు వచ్చుచున్నట్లు ఉండినయెడల కోటలోపలి రక్షకసిబ్బంది ఇది యేమో యని గుంపుగా గోడలమీఁదికి వత్తురనియు తుపాకిమందు వేలినవెంటనే మొత్తముగా చత్తురనియు పాదుషా ఆలోచించి అట్లు చేయుమని ఆజ్ఞాపించెను.

కాని మొగలాయీల యీ ప్రయత్నమంతయు అబ్దుల్ రజాక్ ఎట్లో గ్రహించెను. అతఁడును అతని యనుచరులును ఎట్లో ప్రయత్నించి ఆ ప్రదేశమును కనుఁగొనిరి ; గోలకొండ కోటలోపలినుండి త్రవ్వి ఆ తుపాకిమందును పూర్తిగా రెండు సొరంగములనుండి తీసివేసి ఆ ప్రదేశమంతయు నీరుపాఱించి మట్టితో కప్పివేసిరి. మిగిలినదానినంతయు నీటితో తడిపిరి. ఇంతలో బయట మొగలాయీలు కోటపట్టునట్టి హాహాకారములు చేయఁగా కొందఱు కోటగోడలమీఁదికిపోయి చూడసాగిరి. పాదుషా ఏర్పాటుప్రకారము సర్దారులు ఈల వేయఁగానే మందులవారు మొదటి సొరంగముకడ నిప్పంటించిరి. కొంత మందు పోయినందుచేతను కొంత తడిసినందుచేతను మొగలాయీలకు చేర్పుగానున్న భాగమందు మందు బాగుగా నుండినందున వారిపైపే వేలినది. మొగలాయీలే ఎక్కువ

మంది కాలిచచ్చిరి. గోడలో కొంతభాగము కూలినందున అగడితకును దానికి నడుమ చాలమంది సమాధినంది౨రి. కోట మీఁదివారికి అపాయము తక్కువ. మొగలాయీలు చచ్చిన వారిసంఖ్య 1098 అని లెక్క తేలినది.

తా మెదురుచూడనివిధమున అందఱు చనిపోయినందు లకు మొగలాయీవారికి మతి పోయిన ట్లాయెను. తుపాకి మందువలని పొగయు దుమ్మును స్కంధావార మంతటిని ఆక్రమించి అంధకార బంధురముగా చేసెను. గోలకొండవారు మొగలాయీలగోడును చూచి తత్క్షణమే సన్నాహముతో పాదుషావారి సైన్యము మీఁదపడి వారిమోర్చాలను కొన్ని టిని పట్టుకొనిరి. పాదుషా కీ విషయము తెలియఁగానే గోల కొండవారిని దండింప నాజ్ఞాపించెను. ఘోరయుద్ధమై చాల జననాశమైన తర్వాత మోర్చాలను మరల మొగలాయీవారు నిలుపుకొనఁగలిగిరి. ఇంతలో పాదుషా రెండవ సొరంగమునకు నిప్పంటింప నాజ్ఞాపించెను. వెంటనే కోటలోపలనుండి కొన్ని వేలరాళ్లు బండలు పక్షులవలె రివ్వురివ్వున వచ్చి లెక్కలేని మొగలాయీల తలలనుకొట్టగా వారి ఏడ్పులును రొదలును మిన్నుముట్టుచుండినవి. ఈమాఱు మొగలాయీలు రెండు వేలయేడుగురు మరణించిరి. మరల కోటలోని ఫౌజు బయలు దేరివచ్చి మోర్చాలను పట్టుకొన యత్నించినవి. ఫిరోజుజంగు స్వయముగా వచ్చి ఘోరయుద్ధము చేసినను గోలకొండవారు తగ్గలేదు. ఆఱుగురు మొగలాయీవీరులు మరణించిరి.

ఈ రెండవ దురంతవార్త పాదుషా చెవిని పడఁగానే ఆతనికోపాగ్ని ప్రజ్వరిల్లసాగెను. తత్క్షణమే పల్లకియెక్కి రణరంగమునకు వచ్చెను. మహాశూరులను యోధాగ్రేసరులను ఒకచోట చేరవలసినదని పాదుషా ఆజ్ఞాపించెను. అందఱును ఆయత్తపడుచుండిరి. పాదుషా పల్లకి వచ్చుచుండఁగా నొకఁడు కోటగోడనుండి పేల్చిన తుపాకి దెబ్బకు పల్లకి మోయువారిలో నొకనిచేయి విరిగిపోయినది. పాదుషామాత్రము చలింపక పల్లకిని పొమ్మనెను. ఫిరోజుజంగు మొదలైనవారు పాదుషాయొక్క దృఢ సంకల్పమునుచూచి తమపరాక్రమములను చూపసాగిరి.

ఇంతలో దైవాధీనముగా మరల నొక తుపాను చెల రేఁగినది. మొగలాయీలు త్రవ్వుకొనిన సొరంగములే వారికి నదులవలె అడ్డుతగిలినవి. ఫిరంగులుంచు దిబ్బలన్నియు కరఁగి పోయినవి. ప్రవాహము క్షణక్షణమునకు ఎదురెక్కుచుండెను. మరల గోలకొండ ఫౌజులవారు కోట వెలువడి మోర్చాల వారిమీఁదికి వచ్చిపడిరి. మొగలాయీల చిన్న ఫిరంగుల నన్నిటిని లాగుకొని పోయిరి. బరువైన వానిని మేకులు కొట్టి నిరుపయోగము చేసిరి. అగడితలో మొగలాయీలు వేసిన మట్టి మూటలనుతీసి కోటగోడలో పడిపోయిన చోటులలో పెట్టించిరి. ఇంతలో నొకఁడు పాదుషాగారి పల్లకిముందు నడచుచుండిన గొప్ప యేనుఁగును, నలువదివేల రూపాయల వెలగలదానిని, ఫిరంగితో కొట్టి చంపెను. ఎందుచేతనో వారెవ్వరును పాదుషామీఁదికి ఫిరంగులను కాల్పలేదు. అది

తానాషా ఆజ్ఞగానుండును. ఇంతలో సాయంకాల మాయెను. మొగలాయీలు చేయునది లేక నాటి యుద్ధమును మాను కొని తమ గుడారముల నాశ్రయించిరి.

మఱునాఁడు తెల్లవారఁగానే పాదుషా దిగ్విజయము బయలు దేరెను. మూఁడవ సొరంగమునకు నిప్పంటించు నప్పుడు తానే సమీపమున నుండవలయునని ఢిల్లీశ్వరుని సంకల్పము. సముద్రమువలె మొగలాయీసైన్యము ఘోషతో బయలుదేఱెను. కవచములు ధరించిన యోధులు తిమింగిలములవలె నుండిరి. ధూళిధూసరితమైన యాప్రపంచమున యోధుల శిరస్త్రాణములు నీటిమీఁది బుడగలవలె మినమినలాడుచుండినవి. పాదుషా నల్లని గుఱ్ఱముమీఁద నెక్కి యమధర్మరాజునవలె వచ్చుచుండెను. సర్దారులందఱును పాదుషా వెనుక వారివారి తరగతుల ప్రకారము వచ్చుచు తానాషాను పట్టు యమకింకరులవలె నుండిరి. కొందఱు సిఫాయీల దుస్తు ఎఱుపుగానే యుండెనుగాని మొగములు మాత్రము దుఃఖావృతమై వెలవెల పాఱియుండెను. కొన్ని గుఱ్ఱములు వాని యస్థిపంజరములవలెను వానిమీఁది కవచములు చర్మములవలెను వానికి కాఁబోవు దుర్దశను సూచించునట్లుండెను.

కోటగోడలను సమీపించినంతట పాదుషా మూఁడవ సొరంగమునకు నిప్పంటించుటకు ఉత్తరువిచ్చెను. అది ఎంత మాత్రము మండలేదు. ఒక నిప్పురవ్వయైనను రాలేదు. గోలకొండవారు మందును పూర్తిగా తీసివేసి వత్తిని సైతము కత్తి

రించివేసి యుండిరి. మొగలాయీ సిబ్బంది యంతయు మొగము త్రేలవేసికొని వెనుదిరిగి పోయెను. ఫిరోజుజంగునకు రెండు బాణములుతగిలి నుంచి గాయమాయెను. ఇంక ననేకులకు దెబ్బలు తగిలినవి. కోట పట్టుపనిని పాదుషా తనకుమారుఁడు ఆజంషాకు ఒప్పగించెను.

తర్వాత కొన్నిదినములవఱకు తానాషాసైన్యములు మొగలాయీలను ఢీకొనలేదు. వారును కోటను పట్టుటకు రాలేదు. కొంచఱు సర్దారులు పాదుషా కడకుపోయి హైదరాబాదు మొదలైన ప్రధాన నగరములను పట్టుకొని దేశమును స్వాధీనము చేసికొనినయెడల తానాషా కొన్నాళ్లు కోటలోనుండి పోరాడి తుదకు ఆహారము లేనందున వశపడు నని మనవి చేసిరి. వెంటనే పాదుషా కొందఱు అధికారులను ప్రధాన ప్రదేశములకుపంపి తనజాబులలోను కచేరీ కాగితములమీఁదను ఫర్మానాలలోను దరఖాస్తులయందును హైదరాబాదనుపేరు వ్యవహరింపక దానికి దార్-ఉల్-జిహాద్ అని క్రొత్తపేరు వ్రాయవలయునని యాజ్ఞాపించెను. అబ్దుల్‌రహీం ఖానను వానినిపన్నులు మొదలైన వసూలుపనులయందు నియమించి మహమ్మదీయేతరుల యాచారవ్యవహారములను వేటిని సాగనీయక దేవాలయములను కూల్పించి మసీదులు కట్టుట కేర్పాటుచేసెను.

---

# ప్రకరణము ౨౨ - అబ్దుల్ రజాక్ లారీ కడపటియుద్ధము

ఈలోపల తానాషాయొక్క సర్దారులలో చాలమంది ఔరంగజేబుయొక్క స్కంధావారమును ప్రవేశించి పాదుషా కడ మర్యాదలను పదవులను సంపాదించుకొనసాగిరి. ఇట్లుండఁగా తానాషాకోటలో నొక కింవదంతి పుట్టెను. గోలకొండసర్దారులు ప్రధానులగువారు ముప్పురలో నొకఁడైన షేక్ మిన్ హాజ్ అనువాఁడు లోలోపల పాదుషాకు సహాయముచేయుట కొడంబడి యున్నాఁడని తానాషాతో కొందఱు ఆప్తులు చెప్పసాగిరి. తానాషా ఆమాటలను నమ్మి షేక్ మిన్ హాజును చెఱఁబెట్టించెను. ఇప్పుడు తానాషాసర్దారులలో నమ్మకమైనవారు ఇరువురే మిగిలిరి. ఒకఁడు అబ్దుల్ రజాక్ లారీ, రెండవవాఁడు అబ్దుల్లాఖాన్ పానీ. ఈయిరువురును తమశక్తినంతయు వినియోగించి తమ సుల్తానుకొఱకు పాటుపడుచుండిరి.

పాదుషా అబ్దుల్ రజాక్ లారీకడకు దూతను పంపెను. ఆఱువేల సైన్యమునకు ఆధిపత్యమును పెక్కు గౌరవములను ఇచ్చున ట్లొకఫర్మానా వ్రాసెను. రజాకునకు చాలకోపము వచ్చెను. రాజభక్తినుండి ఎంతమాత్రము ఆతఁడు చలింపక పాదుషాదూతను తిరుగఁగొట్టెను. తనప్రాణములకు సైతము లక్ష్యము చేయక ఆ ఫర్మానాను కొనిపోయి, కోటగోడమీఁద నిలిచి, పాదుషాసైన్యమునకు చూపుచు దానిపై నుమ్మివేసెను. నానావిధములుగా వెక్కిరించి తుదకు చింపి పాఱవేసెను. పాదు

షాకు ఇట్లుచెప్పి పంపెను. "ఈమహాయుద్ధమునకు పోల్పఁదగి నది కర్బలాయుద్ధము తప్ప వేఱుకానరాదు. హాజరత్ ఇమాంహుసేనుగారితో చేరియుండి తుదకు ద్రోహులై అతని మీఁదనే కత్తినెత్తిన పాపులతో అబ్దుల్‌రజాక్‌లారీ ప్రాణముండఁగా ఎంతమాత్రము చేరఁడు. ఆదెబ్బదిఇరువురు వీరులలో నొకనివలె ఇహపరములలో కీర్తిప్రతిష్ఠలు నాకు రాగలవు. తమ నాయకునికిని తమకును ప్రాణముండు వఱకును పోరాడి నశించినవారిలో నొకఁడను కాఁగలను." ఈవాక్యములు పాదుషాకు పోయి చెప్పిరి. అతఁ డాశ్చర్యపడెను. రజాక్‌మీఁద చాలగౌరవ మేర్పడెను. కాని ప్రత్యక్షముగ మాత్రము 'ఛీ! ఎంత దురదృష్టవంతుఁడు' అనెను.

మరల మొగలాయీలు ముట్టడి ప్రారంభించిరి. రుహుల్లాఖానువాఁడు కోటను పట్టుటకు తన సామర్థ్యము నంతయు వినియోగింప నారంభించెను. తుదకాతని ప్రయత్నములకు కొంత ఫలము కనఁబడెను. కోట తలుపులు తెఱచు నుపాయము కనఁబడెను. అబ్దుల్‌రజాక్‌లారీ ఎదురు తిరుగఁగా అబ్దుల్‌ఖాన్ పాని లొంగిపోయెను. ఈతఁడు తానాషాకు మిగిలిన యిద్దరు ప్రధానులలో నొకఁడు. ప్రధానమైన ఖిర్కీదర్వాజా యీతని స్వాధీనమందుండెను. ఎట్టి యాలస్యమును లేక కోటనుపట్టు మార్గమును చెప్పవలసినదని యాతనిని మొగలాయీలు ప్రార్థించిరి. వారు చూపిన యాశలకు లొంగి, కోటగోడలలో ఫిరంగిదెబ్బలకు చెడిపోయిన ప్రదేశములను చెప్పి మొగలాయీ

వారి సైన్యమురాఁగానే తాను తలుపు తెఱచున ట్లాతఁడు రహస్యముగా నొప్పుకొనెను. ఈవిషయము ఖానాసాకును రజాకునకును తెలియదు.

ఒకనాఁడు రాత్రి మూఁడుజాము లైనతర్వాత మొగలాయీ సర్దారులు రుహుల్లాఖాను, ముఖ్తర్ ఖాను, రణమస్త ఖాను, సాఫ్షికన్ఖాను మొదలైనవారు అబ్దుల్లాఖాను చెప్పిన మార్గములలో కోటగోడలమీఁదికి వచ్చిరి. మహమ్మద్ ఆజంషా, పాదుషాకుమారుఁడు, సైన్యముతో కోటదర్వాజా కడకువచ్చి నిలిచెను. వెంటనే అబ్దుల్లాఖాన్ వాని తలుపులు తెఱచివేసెను. మొగలాయీలు లోపల ప్రవేశింప నారంభించిరి.

ఈయార్భాటములు వినరాఁగానే అబ్దుల్ రజాక్ తానాషాయందలి భక్త్యనురాగములు ఒక్కమాఱుగా ఉబికిరాఁగా తటాలున యుద్ధసన్నద్ధుఁ డాయెను. తాను పూర్తిగా కవచాదులు ధరించుటకుగాని గుఱ్ఱమునకు జీనువేయుటకుగాని అవకాశము లేదు. ఒక కత్తి చేతఁగొని కనఁబడిన యొకగుఱ్ఱముయొక్క వట్టి వీపుమీఁదికి దుమికి రెండవచేత డాలు మాత్రముగొని యుద్ధమునకు ఉఱికెను. అతని వెంటనుండిన పండ్రెండుగురును అట్లే దుమికిరి. ఆ యావేశములో ఎవరు ఎచట నుండిరో వారెరుఁగరు. ఊహాతీతమైన పరాక్రమమును రజాక్ చూపసాగెను. అఱువదియేండ్లవాఁడు కాళ్లతోను చేతులతోను పోరాడెను. ప్రాణమునకే తెగించెను. 'శరీరములో ప్రాణముండు వఱకు పోరాడవలసినదే' యని అతఁ డఱచుచు

కొట్టుచుండెను. అడుగడుగునకును తనమీఁదికి కత్తులును ఈఁటెలును వచ్చుచుండఁగా వానిని కొట్టుచు త్రోయుచు నాతఁడు పోవుచునేయుండెను. నఖశిఖపర్యంత మాతనికి కత్తిదెబ్బలును ఈఁటె పోటులును. దర్వాజావఱకును పోయి తలుపులు వేయ వలయునని ఆతని యుద్దేశము కాఁబోలు. లెక్కలేని గాయములకుతోడు ఆతనికి మొగమున పండ్రెండు గాయములు తగిలినవి. ఒక దెబ్బకు కన్నొకటి పోయినది. ఆతని గుఱ్ఱమునకు చాల గాయములు తగిలి అది అతని బరువునకు వణకుచుండెను. ఇంతవఱకు వచ్చినంతట ఆతఁడు గుఱ్ఱముయొక్క కళ్లెములను వదలి దానిని మాత్రము తనకాళ్లసందున గట్టిగా పట్టుకొనెను. ఆ గుఱ్ఱము తత్క్షణమే గుంపు నుండి తప్పించుకొని రజాక్‌ను కొనిపోయి ఒక చెట్టుక్రింద త్రోసి చూచుచు నిలిచియుండెను. ఇంతలో తెల్లవారెను. ఎవఁడో ఆతని గుర్తించి దయదాల్చి తనయింటికి మోయించుకొని పోయెను.

---

## ప్రకరణము ౨౩ - తానాషా కడపటివిందు

కోటయంతయు గందరగోళింపసాగెను. వెంటనే తానాషాకు ఈవార్త అందినది. తత్క్షణమే సుల్తాను కోటలోను అంతఃపురమందును ఏడ్చుచున్న స్త్రీలను పరివారమును ఓదార్చి వారికడ సెలవు తీసికొనసాగెను. తర్వాత ఆస్థానమునకు వచ్చి తన సింహాసనముమీఁద కూర్చుండెను. ఆవాహన లేని అతిథు

లకై ఎదురుచూచు వానివలె దర్పముతో నుండెను. భోజన సమయమైనంతట త్వరగా అన్నపానముల కాజ్ఞాపించెను. ఇంతలోపల రుహుల్లాఖాన్ ముక్తారుఖానులు ఇద్దరుసర్దారుల తోను కొందఱు గొప్పవారితోను వచ్చి తానాషాను చూచిరి. ఆ క్లిష్టపరిస్థితిలో కూడ ఆస్థానభోగమును వీడక సింహాసనము మీాఁదనుండిన యాప్రభువును చూచినంతనే వారిధైర్యము తగ్గెను. ఆతని తేజమే వారిని కొట్టునట్లుండెను. ఇంకకొంత సేపటికి ఖైదుసేయఁబడువానివలె నాతఁ డుండలేదు. ఆచింత యే లేనివానివలె నుండెను. మొగలాయీా సర్దారులు ఆతనికి సలాములు చేసిరి. అతఁడు వారికి తనరాచఠీవి యంతయు కనఁ బడునట్లు బదులు సలాముచేసెను. వారినందఱను ప్రత్యేకముగా హెచ్చరించుకొని మర్యాదచేసి గంభీరముగ స్వాగతము పలికెను.

ఇంతలో నొకసేవకుఁడు వచ్చి తానాషాకు భోజనము సిద్ధమైయున్నదని విన్నవించెను. వెంటనే సుల్తాను తనకు భోజ నమునకు వేళయైనదని వారితోచెప్పి వారినికూడ తనతో విం దారగింప పిలిచెను. కొందఱు దుర్జనులు తానాషాను అటనుండి పోనీయరాదని పలికిరి. కాని మొగలాయీాసర్దారులు ఆలో చించి ఇట్లుచేయుటలో తప్పులేదనితలంచి ఒప్పుకొనిరి. ముక్తార్ ఖానును మఱియొకఁడును తానాషాతో భోజనమునకు కూ ర్చుండిరి. రుహుల్లాఖాను ఆశ్చర్యపడి 'ఇది భోజనానికి సమ యమా'? అని యడిగెను. తానాషా ఆతనిహృదయమును

గ్రహించి వెంటనే ఇట్లు జవాబిచ్చెను. 'అవును, ఇదే భోజనా నికి సమయము' రహుల్లాఖా ననెను. 'అది నాకు తెలియును. ఇటువంటిసందర్భమున తమ కెట్లురుచించును ?'

తానాషా గంభీరముగ నిట్లు బదులిడెను. 'మీరు సాధారణజనులను మనస్సులో నుంచుకొని మాటలాడుచున్నారు. నాకు భగవంతునియందు సంపూర్ణవిశ్వాసము కలదు. ఆయన దయామయుఁడు, మహనీయుఁడు, ఈ ప్రపంచము నంతటిని సృజించి ధనికులు దరిద్రులు అను భేదము లేక కాపాడువాఁడు. తన కృపాకటాక్షమును తనసేవకుఁడైన తానాషామీఁదినుండి ఎంతమాత్రము మరల్పఁడు. నాపితామహ మాతామహు లిరువురును తమజీవితకాలము నంతటిని ఐశ్వర్యములో గడపినారు. కాని నేను కొంతకాలము దారిద్ర్య మనుభవింపవలయునని భగవంతుని ఆజ్ఞ కాఁబోలు గడపినాను. మరల ఆమహామహుఁడు ఈ దీనునిమీఁద కనికరించి సకలైశ్వర్యములను ఇచ్చినాఁడు. నాకు ఆయన కుదిర్చినసన్ని వేశములచేత ఒకగంటలో రాజనైతిని. నేను సుల్తానగుదునని ఎవరును తలంపలేదు. నేనుకూడ ! భగవంతుని యనుగ్రహమువలన నాహృదయమున కోర్కెలేవియు లేవు. లక్షలు దానమిచ్చితిని, కోట్లు ఖర్చుచేసితిని, ఇప్పుడు రాజ్యాధిపత్యమును భగవంతుఁడు నాకడనుండి లాగివేయఁ జూచుచున్నాఁడు. నేనేమైన నపరాధ మొనర్చితినేమో! దేవుఁడు ఈమాత్రము దయచూపుచున్నందులకు నేను కృతజ్ఞత చూపవలసినదేగాని చింతింపవలసినవాఁడనుగాను. నా

కాలము ముగిసినవెంటనే ఈ రాజ్యాధికారమును ఆ స్తికుఁడైన అలంఘీరుపాదుషాచేత ఉంచుచున్న భగవంతునికి వందనము లాచరించుచున్నాను. ఇదంతయు దైవచిత్రము! రండు భోజనమునకు."

భోజనానంతరము తానాషా తనగుఱ్ఱమున కాజ్ఞాపించెను. శరీరమున విశేషవస్తువు లేవియు ధరింపక మెడలోనొక ముత్యాలహారమును మాత్రము ధరించి మొగలాయీ సర్దారులతో బయలుదేరెను. ఆతఁడు ముందుపోవుచుండఁగా వారు ఆతనివెనుక వచ్చుచుండిరి. ఆదృశ్యము చంద్రుని చుట్టు ప్రభ గుడికట్టిన ట్లుండెను. ఆమహనీయుఁడు పెండ్లినాఁడు కూడ ఇంత నెమ్మదిగా నడచియుండఁడు. ఆతని మొగమున నెట్టి భావమును లేదు, శాంతి తాండవించుచుండెను. పాదుషా పుత్త్రుఁడు మహమ్మద్ ఆజాం కోటకు బయట నొక గుడారమున నుండెను. తానాషా వచ్చుచున్నాఁడని సేవకులువచ్చి చెప్పఁగానే లేచి గుడారము వాకిట నిలిచి ఎదురుచూచు చుండెను. తానాషావచ్చి గుఱ్ఱముదిగి ఆజామునకు తనమెడలోని హారమునువేసి బహుమానించెను. రాజకుమారుఁడు దానిని గ్రహించి తానాషాను కౌఁగలించుకొని చాలదయతో ఓదార్పు పలికి పాదుషా కడకు కొనిపోయెను. ఎల్లవారిని క్షమించునట్టి ఔదార్యమును ప్రకటించుచు పాదుషా తానాషాను చాల మర్యాదతో చూచి ఆతఁడు తనసభలోనికి తన సర్దారులవలె వచ్చి నిలిచి యుండవలసిన యక్కఱ లేదనియు స్వేచ్ఛగా నుండవచ్చుననియు పలికి గౌరవించెను.

రుహుల్లాఖాన్ మొదలైనవారు తమకు దొరకినంత ధనము సేకరించుకొనిరి. బంగారము, నగలు, వెదకి స్వాధీనము చేసికొనసాగిరి. గోలకొండలోని ధనికులయొక్కయు సర్దారుల యొక్కయు వస్తువిశేషములను సోదావేయించుటకు మనుష్యుల నేర్పాటుచేసిరి. ఈదోపిడి యైన తర్వాత మొగలాయీసర్దారులు అపహరించినది పోఁగా పాదుషావారి ఖజానాకు చెల్లించినదిమాత్రము ఎంతవిలువ యనఁగా ఆఱుకోటుల ఎనుబదిరైయిదు లక్షల హొన్నులు, రెండుకోటుల ఏబదిమూఁడువేల రూపాయలు, నూటపదునైదుకోటుల పదమూఁడులక్షల దమ్ములు. ఇవిగాక బంగారు వెండి పాత్రలు, నగిషీవస్తువులు ఎన్నియో! హైదరాబాదును పాదుషా దార్ — ఉల్ — జిహాద్ (మతమునకై పోరాడిన స్థలము) అని పేర్కొనెను. హైదరాబాదును పాలించుటకు ఏర్పాటులుచేసి 1689 సం॥ జనవరినెల పాదుషా గోలకొండను వదలి బీదరువైపు బయలుదేరెను. తానాషాను తనతోకూడ పాదుషా జాఫరాబాదు వఱకు కొనిపోయి అచటికి చేరఁగానే దౌలతాబాదు కోటకు పంపెను. ఆతనికి ఏకొఱఁతయులేక జరుపవలసినదని ఆజ్ఞాపించెను.

మొగలాయీరాయబారి సాదత్‌ఖాను తానాషా పంపిన నగలను పాదుషాకు చేర్పలేదు. తానాషాతో నాతఁడు చెప్పినదంతయు నబద్ధము. ఇప్పుడానగలను పాదుషాకిచ్చుటకు ధైర్యములేక పాదుషావారి ముసద్దీలను గ్రహింపుఁడని కోరెను. వారు భయపడి మెల్లగా పాదుషాకు తెలిపి ఆతని

యాజ్ఞచే గ్రహించిరి. సాదత్‌ఖానునకు తానాషాపై నభిమాన ముండెను గాని ఆతఁ డేమియు చేయలేకపోయెను.

---

## ప్రకరణము ౨౮ - అబ్దుల్‌రజాక్‌లారీ బ్రదుకుట

ఆనాఁ డట్లుపడిపోయిన అబ్దుల్‌రజాక్‌లారీని మరల కొం దఱు రుహుల్లాఖాను కడకు కొనిపోయిరి. లెక్కలేని గాయములతో ఒడలు తెలియక లారీ పడియుండెను. షాఫషికన్‌ఖాన్ ఆతనిని చూచి "ఆహా! ఆ పొగరుపోతు, పాపిలారి! వీని తల కాయను తత్క్షణమే కొట్టి, పాదుషాకు చూపి, కోటదర్వాజాకు తగిలింపవలెను" అనెను. రుహుల్లాఖాన్ అడ్డుపడెను. 'ఈవిధముగా ప్రాణముపోవునట్టి స్థితిలో నున్నను ఈతఁడు గొప్ప వాఁడు. ఇట్టివాని తలను పాదుషాఆజ్ఞలేక కొట్టుట ఔదార్యము కాదు' అని అతనివిషయము పాదుషాకు పోయి చెప్పెను. పాదుషా ఆతని ఆయద్భుత వీరవిహారమును స్వామిభక్తిని విని ఆతని గాయములను మాన్పుటకు ఇరువురు వైద్యులను నియమించెను. వారిలోనొకఁడు సాశ్చాత్యుఁడు, రెండవ వాఁడు మహమ్మదీయుఁడు. వారిని ప్రతిదినము లారీయొక్క స్థితిని తనకు తెలుపుఁడని పాదుషా ఆజ్ఞాపించెను; "తానాషాకు అదృష్టముండి, రజాక్‌వంటి స్వామిభక్తిపరాయణుఁడు మఱి యొకఁడుండిన యెడల ఈకోటను పట్టుటకు మనకు ఇంకను చాలా కాలము పట్టియుండును" అని ఆశ్చర్యపడెను.

వైద్యులు రజాకును పరీక్షించి ఆతని శరీరమందు మొత్తము డెబ్బదిగాయములనియు గాయములమీఁద పడిన గాయములకు లెక్కలేదనియు చెప్పిరి. ఒకకన్ను పూర్తిగా పోయినను రెండవది గట్టిగానుండెను. ఆతఁడు బ్రతుకుట మాత్రము దైవాధీన మనిరి. పదుమూఁడుదినములు వైద్యు లుపచరింపఁగా రజాక్ కన్ను తెఱచి 'తానాషా'యని పలవరించెను. ఆతర్వాత నాతనికి నెమ్మదించునని వైద్యులకు ధైర్యమువచ్చినది. రజాకునకు స్పృహవచ్చినదని పాదుషాకు తెలియఁగానే ఆతఁడు రజాకునకిట్లు వ్రాసెను. "నిన్ను మేము క్షమించితిమి. నీపెద్దకుమారుఁడు అబ్దుల్‌ఖాదర్‌ను, ఇంకను కొలువు చేయఁగల వారిని మాకడకు పంపుము. వారందఱును తమతండ్రి కొఱకును తమ కొఱకును మాక్షమను ప్రార్థించిన వారికి మర్యాదలిచ్చి ఉన్నతోద్యోగముల నీయగలము."

ఈవిధముగా పాదుషా చెప్పిపంపఁగా రజాకు మర్యాదార్థము పాదుషాకు వందనములు చెప్పెనుగాని ఇట్లనెను "ఇంతవఱకు నాప్రాణములు పోక నేను బ్రతికియుండుట నిజమేకాని ఈప్రస్తుతదురవస్థలో నేను బ్రతికి పాదుషావారికి బానిస నగుదుననుట మాత్రము కల్ల. దయామయుఁడగు భగవంతుఁడు నాకు సంపూర్ణారోగ్యము నిచ్చి నాజీవితమును పొడిగించినను సర్వవిధముల చితికిపోయిన నేను ఇఁకను నౌకరీ చేయఁగలనను నమ్మకము మాత్రము లేదు. ఒకవేళ చేయఁగలిగినను అబుల్‌హాసన్ తానాషాచేత వృద్ధికి తేఁబడినవాఁడు

అలంఘీరు పాదుషాకు పాదాక్రాంతుఁడై నౌకరి చేయఁడని మాత్రము దృఢముగా నమ్ముఁడు" పాదుషాకు ఈవాక్యములు వ్యథ కలిగించెను. కాని కొంతకుకొంత ధార్మికుఁడుగాన రజాకునకు త్వరలో ఆరోగ్యము చేకూర్పుఁడని వైద్యులను హెచ్చరించెను. రజాక్ యొక్క ఆ స్థితిలో కొల్లపోఁగా మిగిలిన దాని నంతయు నాతని కిప్పించెను. ఆతఁడు సంపూర్ణారోగ్యమునందినంతనే ఓదార్చి పాదుషాకడకు తెమ్మని హైదరాబాదు సుబేదారుని కుత్తరువాయెను. సుబేదారాతని చేతికి సంకిళ్లు తగిలించి కొనిపొమ్మనెను గాని ఖాఁబహదూర్ ఫిరోజ్ జంగు అడ్డుపడి ఆయవమానమును నిలిపి తనకడ కొన్ని దినము లుంచుకొని నామకార్థమైనను పాదుషాకొలువును ఒప్పుకొమ్మనెను. రజాకు పాదుషాను దర్శించుటకు మాత్ర మొప్పుకొనెను. పాదుషా రజాకును చాలగౌరవించెను.

పాదుషా — అబ్దుల్ రజాక్ సాహెబ్, మీరు చాల గొప్పవారు. ఇంత స్వామిభక్తి, సాహసము, మతగౌరవమును చూపినవారిని మేము ఎక్కడను చూడలేదు. మీకు ఏమి కావలెనో కోరుఁడు, మేము చేయఁగలము.

రజాక్ — భగవంతుని దయవలన నాకు చావు ఒకటే మిగిలియున్నది. ఇఁక నేమియు నక్కఱలేదు.

పాదుషా — పోయినదేమో పోయినదిగదా. మాత రఫున ఈగోలకొండలో నవాబుగా నుండుఁడు.

రజాక్ — అల్లాం! అల్లా! మహాత్ముఁడు తానాషా. ఆయన ఉప్పుతిన్న ఎటువంటి పాపికూడ ఆపని చేయఁడు. అబ్దుల్ రజాక్ లారీ చేయనే చేయఁడు.

పాదుషా — మాకడ సేనాపతిగా నుండుఁడు సాహేబ్.

రజాక్ — తానాషాసుల్తాన్ బహద్దర్ నౌకరి చేసిన వాఁడు ముసల్మాన్ ఐనయెడల మఱియొకనికి నౌకరిచేయఁడు జహాపనా.

చుట్టునుండినవారు, అందును గోలకొండనుండి వచ్చిన ద్రోహులు హడలిపోయిరి. పాదుషా ఆశ్చర్యపడెను. 'తమకు నౌకరి ఇష్టము కాకపోయిన తమకొమారులకు ఇవ్వనిండు'

రజాక్ — వా రెట్లుపోయిన నాకేమి. బుద్ధిమంతులైనచో వృద్ధికి రాఁగలరు. వారికిని నాకును ఏమి ఇలాఖా?

పాదుషా కేమియు తోఁపక ఇట్లనెను—'అచ్ఛా! అచ్ఛా! తమవంటివారు ఈగోలకొండలో ఇంకొక రుండియుండిన మేము కోటను పట్టియుండఁజాలము. తాము చాల గొప్పవారు. తమ యిష్టమేమి ?'

రజాక్ దుఃఖము పట్టలేక ఇట్లనెను. "జహాపనా, నాకు ఇఁకనేమి ఇష్టముండును. మాసుల్తాన్ బంది. మావజీర్లు అక్కన్నమాదన్నలు తమ ద్రోహమువలన ఖూనీ చేయఁబడినారు. మాకోట చెడిపోయినది. ఎక్కడ చూచినను ద్రోహులు కనఁబడుచున్నారు. నాముసలి ప్రాణము ఈశ్మశానమును చూచుచు ఇఁకను ఉండదు. దేవుఁడు దయఁదలచిన తానాషాకే నౌకరి

చేసెదను. లేకపోయిన మెల్లగా బయలుదేరి మక్కాకు పోయెదను; ప్రభూ మక్కాకు పోయెదను, మక్కా, మక్కా." అని పలుకుచునే మహాఖ్షాతి రేకమున వెడలిపోయెను. పాదుషా ఆజ్ఞచే ఎవరును ఆతని నడ్డగింపలేదు. రజాక్ మక్కా చేరలేదు. పర్షియాదేశమునకు పోయి అచ్చట తనజన్మస్థలమగు 'లార్' లో కొన్ని దినములుండి తర్వాత మక్కాకు పోవుచు దారిలో చనిపోయెను.

---

## ప్రకరణము ౨౫ - తానాషా కడపటిమాటలు

తానాషా దౌలతాబాద్ కోటలో ఖైదిగా 1688 సం॥ జనవరినెలలో ప్రవేశించెను. ఆకోటయందే పదునాలుగు సంవత్సరములు ఆమహనీయుఁడు బందిగా గడపి తుదకు అతిసారభేదులచేత క్రీ. శ. 1702 లో ప్రాణములను వదలెను. ఆతఁడు చనిపోయిననాఁడొక విచిత్రదైవసంఘటన జరిగినది. ఒకనాఁడు తానాషా చాల జబ్బుగా నుండఁగా ఆకోటనుకాపాడునట్టి ఖిలేదారునకు స్వప్న మొకటి వచ్చినది. ఎవరోవచ్చి అతనితో 'అదుగో తానాషా చనిపోయినాఁడు. ఆతని శవమును తీసికొని పోయి అతనిగురువైన సయ్యద్ రాజు కొత్తాల్ యొక్క సమాధి ప్రక్కన సమాధిచేయుము" అని చెప్పిన ట్లుండెను.

తెల్లవాఱఁగానే ఖిలేదారు తానాషాను దర్శించెను. తానాషా తనవైపు చూడఁగానే సలాముపెట్టి 'తమతోనొక విషయము తత్క్షణము మనవి చేయవలయును' అనెను. వెంటనే

తానాషా అందుకొని 'ఔను. నీకు కలలోవచ్చిన భగవదాజ్ఞ నాకు మెలఁకువలోనే వచ్చినది. భగవదాజ్ఞను నెఱవేర్పుము.' ఖిలేదారు ఆశ్చర్యపడెను. ఆతర్వాత కొన్ని నిముసముల కంతయు తానాషా మరణించెను. తత్క్షణమే ఖిలేదారు ఢిల్లీపాదుషాకు తెలుపకయే తానాషా శవమును కొనిపోయి ఆతని గురువు సమాధికి ప్రక్కన పాతి సమాధి కట్టించెను. ఇందుచేతనే ఈయన గోరి గోలకొండలో లేదు. గురుశిష్యులు మరల కలసికొనిరి. ఆయన స్థానము భక్తులతోగాని ప్రభువులతో కాదు. తానాషా చనిపోయిన నాటి తారీఖు తెలియదుగాని జీవిత కాలము ఏబదియారేండ్లు

తానాషా ఖైదులో పడిన తర్వాత ఆతని కొక కుమారుఁడు పుట్టెను. సుల్తానుగాన ఆతనియంతఃపురముకూడ నాతనితో దౌలతాబాదులోనే యుండెను. ఆపిల్లవానికి బందిసుల్తానని ఇతరులు పేరుపెట్టిరి. అతఁడు పెద్దవాఁడైనంతట పాదుషా వానికి ఆస్థానమునకు వచ్చుట కనుజ్ఞయొసంగెను. కాని ఆ బాలుఁడు వచ్చుట కారంభించినంతట తానాషా పూర్వభృత్యులకు వానియందు దాక్షిణ్యభక్తులేర్పడి వారందఱును అతనికి సలాము లిడసాగిరి. ఈవిషయము పాదుషాకు తెలియఁగానే వానిని ఆస్థానమునకు రానీయక రహస్యముగా

[illegible] విద్యాలయ[illegible]

# వేదము వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్

## సంస్కృతగ్రంథములు

| | రు. | అ. |
|---|---|---|
| అభిజ్ఞానశాకుంతలము, శ్రీరామదాసయ్యంగారి తెలుఁగువ్యాఖ్యతో | 12 | 0 |
| మేఘసందేశము, మల్లినాథవ్యాఖ్య, తెనుఁగున సంపూర్ణ టీక | 4 | 0 |
| కుమారసంభవము, మొదటి 6 సర్గలు, టీకాతాత్పర్యములు | 4 | 0 |
| రఘువంశము, మొదటి 6 సర్గలు, టీకాతాత్పర్యములు | (అచ్చులో) | |
| అమరుకావ్యము, సంపూర్ణాంధ్రటీక ... | 2 | 0 |
| రసమంజరి, శృంగారరసస్వరూపవిస్తరము, సటీక ... | 2 | 0 |
| పంచతంత్రము, మూలముమాత్రము ... | 1 | 8 |

## ఆంధ్రగ్రంథములు.

| | | |
|---|---|---|
| శృంగారనైషధము, సర్వంకషవ్యాఖ్యతో పునర్ముద్రితము | 20 | 0 |
| జ్ఞానవాసిష్ఠరామాయణము, (వేదాంతము) మడికి సింగన కవి | 1 | 8 |
| ఆముక్తమాల్యద, సంజీవనీవ్యాఖ్యతో | (అచ్చగుచున్నది) | |

## కథలు.

| | | |
|---|---|---|
| పద్యకథాలహరి, ప్రాచీనగ్రంథములనుండి సంగ్రహించినది | 1 | 0 |
| సంగ్రహకథాసరిత్సాగరము, (కొన్ని కథలసంపుటి) | 1 | 8 |
| విక్రమార్కుని యద్భుతకథలు | 1 | 0 |
| భోజకాళిదాసకథలు | 1 | 0 |
| ఆంధ్రహితోపదేశచంపువు | 1 | 8 |
| ఉదయనచరిత్రము | 1 | 0 |
| ఈ ఆఱుకథలు ఒకసెట్టుగా కొనువారికి | 5 | 0 |
| కథాసరిత్సాగరము 6 భాగములు ఒకసెట్టుగా ... | 20 | 0 |
| ,, ఒక్కొక్క భాగము ప్రత్యేకముగా ... | 3 | 8 |

## నాటకములు.

| | | |
|---|---|---|
| ప్రతాపరుద్రీయ నాటకము | 4 | 0 |
| ఉషానాటకము | 1 | 8 |
| బొబ్బిలియుద్ధనాటకము | 2 | 8 |
| ప్రియదర్శికా నాటిక | 1 | 0 |
| నాగానందనాటకము | 1 | 8 |
| ఉత్తరరామచరిత్రనాటకము, శాస్త్రిగారి పీఠికతో | 3 | 0 |
| శ్రీకృష్ణరాయవిజయనాటకము | 0 | 8 |
| వ్యామోహం, సాంఘికనాటిక | 1 | 0 |
| తానీషానాటకము | 1 | 0 |
| ఆంధ్రాభిజ్ఞానశాకుంతలనాటకము ... | 2 | 0 |

| | | | |
|---|---|---|---|
| ఆంధ్రసాహిత్యదర్పణము, ఉదాహరణశ్లోకములతో | ... | 8 | 0 |
| అలంకారసారసంగ్రహము, సటీకాతాత్పర్యము | ... | 0 | 12 |
| ఛందస్సు పునర్ముద్రితము | ... | 0 | 6 |

## విమర్శలు - ఉపన్యాసములు.

| | | | |
|---|---|---|---|
| నన్నెచోడుని కవిత్వము విమర్శ | ... | 6 | 0 |
| గ్రామ్యభాషాప్రయోగనిబంధనము, (నాటకపాత్రోచితభాష) | | 0 | 12 |
| ఆంధ్రవ్యాకరణ సర్వస్వతత్త్వము | ... | 1 | 0 |
| తిక్కనసోమయాజి విజయము, జీవితచరిత్ర విమర్శ | ... | 0 | 8 |
| భారతాభారత రూపకమర్యాదలు | ... | 0 | 6 |
| ఆంధ్రగ్రంథ విమర్శన ప్రకారలేశము | ... | 0 | 6 |
| గ్రామ్యాదేశనిరసనము, గ్రామ్యగ్రాంధికవాదములది | ... | 0 | 6 |
| విసంధివివేకము | ... | 0 | 2 |
| స్త్రీ పునర్వివాహదుర్వాదనిర్వాపణము | ... | 1 | 0 |
| ఆంధ్రభాషాసర్వస్వార్థ నియమకతిపయములు (నిఘంటురచన) | | 0 | 4 |
| వేదము వేంకటరాయ శాస్త్రి గారి జీవితచరిత్రసంగ్రహము | | 2 | 0 |
| అక్కన్నమాదన్నల చరిత్ర, పునర్ముద్రితము | ... | 1 | 0 |

## నేలటూరి వేంకటరమణయ్యగారి గ్రంథములు.

| | | | |
|---|---|---|---|
| చరిత్రరచన (మొదలైన చారిత్రకవ్యాసములు) | ... | 2 | 0 |
| మధుమావతి కథలు | ... | 2 | 0 |
| దక్షిణాంధ్ర వాఙ్మయచరిత్రము | ... | 2 | 8 |
| THE EASTERN CHALUKYAS OF VENGI రు. 15 0 | తగ్గింపుధర | 10 | 0 |
| KAMPILI AND VIJAYANAGARA | | 3 | 0 |

REFERENCE
NOT FOR ISSUE

## 'తాతవెల్లి మిరాదారు' శేషగిరిశాస్త్రిగారి గ్రంథములు.

| | | | |
|---|---|---|---|
| తెలుఁగు ఫైలాలజీ-ఆంధ్రశబ్దతత్త్వము 2 భాగములు | ... | 3 | 0 |
| అర్ధానుస్వారతత్త్వము, వీరిదే పైదాని కనుబంధము | ... | 0 | 8 |

# కథలు — కథలు — కథలు

1. భోజకాళిదాసకథలు – భోజునియాస్థానము తులు,సమస్యాపూరణవినోదములు కాళిదాస లీలావతుల మొదలైన కథలు కలవు. రు.

2. విక్రమార్కుని యద్భుతకథలు – భోజమహారాజు సింహాసనమెక్కరాఁగా సింహాసనము మెట్లమీఁది బొమ్మలు ఆతనికి విక్రమార్కుని సాహసమునుగుఱించి చెప్పిన 32 వినోదకథలు. రు. 1-00

3. ఉదయనచరిత్రము–వత్సరాజుకథ మాత్రము కథాసరిత్సాగరమునుండి గ్రహింపఁబడినది. రు. 1-00

4. సంగ్రహకథాసరిత్సాగరము–ఆకాశయాన, సముద్రయానాద్యాశ్చర్యకరసాహసకార్యముల కథలను ఏర్చి కూర్చిన సంపుటి. రు. 1-50

5. ఆంధ్రహితోపదేశచంపువు – సంస్కృత వచనమునకు తెనుఁగువచనము, శ్లోకములకు పద్యములుగా ఆంధ్రీకరింపఁబడినది. రు. 1-50

6. పద్యకథాలహరి – ఆంధ్రవాఙ్మయమందలి పద్య కథలను ఏర్చి కూర్చినది. రు. 1-00

**ఈ 6 పుస్తకములు ఒక్క సెట్టుగా రు. 5-00**